ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
: fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
16-9-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 226 పేజీలు: 8+4 వెల: 6.50

సుంకాలు పెంచితే అమెరికాపై ప్రతిచర్య: చైనా 5
పోక్సో కేసులో నిందితునికి 21 యేళ్ల జైలు 6

## వక్ఫ్ సవరణపై పూర్తి స్టే ఇవ్వలేం




### కొన్ని నిబంధనలకే వర్తింపు

**ఐదేళ్లు ఇస్లాంను అనుసరించాలనే నిబంధన సహా స్టే జాబితాలో పలు అంశాలు**

**వక్ఫ్ మండళ్లలో ముస్లిమేతరుల సంఖ్య 3కు తగ్గింపు**

**'సుప్రీం'ఉత్తర్వులు**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 15:** దేశవ్యాప్త ఆందోళనలకు కారణమైన వక్ఫ్ చట్టం అమలుపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. రాజ్యాంగబద్ధత ఉన్నం దున మొత్తం చట్టంపై స్టే ఇవ్వలేమని స్పష్టం చేసింది. అయితే వక్ఫ్ చట్టంలోని పలు నిబంధనల అమలుపై దేశ సర్వోన్నత న్యాయస్థానం స్టే ఇచ్చింది. కనీసం ఐదేళ్లుగా ఇస్లామ్ మతాన్ని అనుసరిస్తున్న వారు మాత్రమే వక్ఫ్‌ను రూపొందించగలరనే నిబంధన కూడా స్టే ఇచ్చిన జాబితాలో ఉంది. సుప్రీంకోర్టు ప్రధా న న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్, న్యా యమూర్తి జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్ లతో కూడిన ధర్మాసనం ఈమేరకు >>2

# చర్చలు సఫలం

## కాలేజీల బంద్ విరమణ

**బకాయిలు తక్షణమే రూ. 600 కోట్లు చెల్లింపు**

**దీపావళికి మరో 600 కోట్లు**

**ప్రభుత్వం ప్రతిపాదనకు అంగీకరించిన కాలేజీ యాజమాన్యాలు**

**చర్చల్లో పాల్గొన్న డి.సిఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, శ్రీధర్ బాబు**



సోమవారం కాలేజీల యాజమాన్యాలతో చర్చలు జరుపుతున్న డి.సిఎం భట్టి. చిత్రంలో మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు15:** ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. ప్రైవేట్ ఇంజనీరింగ్, వృత్తి విద్యా సంస్థల యాజమాన్యాలతో తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జరిపిన చర్చలు ఫలిం చాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలంటూ సోమ వారం నుంచి బంద్ చేపట్టిన విషయం తెలిసిందే. కాగా రాత్రి యాజమాన్యాల ప్రతినిధులతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలం కావడంతో కాలేజీల బంద్ విరమణకు యాజమాన్యాలు అంగీక రించాయి. దీపావళి లోపు రూ.1200 కోట్లు విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఒకేసారి కాకుండా రెండు విడతలుగా ఈ ప్రక్రియ పూర్తి చేయనున్నారు. ఇప్పటికే టోకెన్లు ఇచ్చిన రూ.600 కోట్లు వారంలో విడుదల చేస్తామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. మరో రూ.600 కోట్ల బకాయిలను దీపావళి లోపు మంజూరు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కాగా, సోమవారం మధ్యాహ్నం కాలేజీల ఫీజు బకాయిల పంచాయతీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు చేరింది. ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాల తీరుపై మంత్రులతో అంతర్గత సమావేశంలో ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులపై ఇప్పటికే సానుకూల చర్యలు చేపడు తున్నప్పటికీ బంద్ పాటించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ కాలేజీల విద్యా ప్రమాణాలపై గత ప్రభుత్వ హయాం లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు విజిలెన్స్ కమిషన్ ఒక రిపోర్ట్‌ను సమర్పించిన సంగతి తెలిసిందే. అయితే, ప్రస్తుత ప్రభుత్వం ఆ నివేదికను మరోసారి పరిశీలిస్తున్నట్లు తెలు స్తోంది. ఇదిలా ఉండగా ఆదివారం అర్ధరాత్రి వరకు ఇంజనీరింగ్ కాలేజీల విద్యా సంస్థల యాజమాన్యాలతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు చర్చలు జరిపారు. చర్చల సారాంశాన్ని ఉదయం సిఎం వద్దకు తీసుకెళ్లి యాజమాన్యాల డిమాండ్లపై చర్చలు జరిపారు. కాలేజీల ఫీజు బకాయిలు విడతల వారీగా చెల్లించేందుకు సానుకూలంగా ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా యాజమాన్యా లు సమ్మె విరమించుకోవాలని, కాలేజీలు యథావిధిగా నడిపించా లని యూనియన్ నాయకులను ఆయన కోరారు. తర్వాత కాలేజీల యాజమాన్యాలతో ప్రభుత్వం మరోమారు చర్చలు జరిపి సఫలం చేసింది. కాలేజీల బంద్‌ను విరమింప చేసింది. >>2

## వీధిదీపాలు సర్పంచ్‌లకే

**నిర్వహణ బాధ్యత వారికే అప్పగింత**

**ఎల్ఇడి దీపాలపై పక్కాగా పర్యవేక్షణ**

**హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం**

**విద్యుత్ ఆదాకు సోలార్ పవర్ వినియోగం: సిఎం రేవంత్**



సోమవారం అధికారులతో సమీక్ష చేస్తున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు15:** రాష్ట్రమంతటా ఎల్ఈడీ వీధి దీపాలపై పక్కాగా పర్యవేక్షణ ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అన్ని గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు, వాటి నిర్వహణ బాధ్యతలను సర్పంచులకే అప్ప గించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గ్రామాల్లో అవసరమైనన్ని కొత్త ఎల్ఈడీ లైట్లను అమర్చటంతో పాటు వాటిని సమర్థంగా నిర్వహించే నిర్వహణ అధికారం గ్రామ పంచాయతీల పరిధిలోనే ఉండాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న ఎల్ఈడీ లైట్లు వెలుగుతున్నాయా లేదా, కొత్తగా ఎన్ని అవస రమున్నాయో పక్కాగా అంచనా వేయాలని, ప్రతి పోల్ సర్వే చేయాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. రాత్రి పూట ఎల్ఈడీ లైట్లు పని చేయటంతో పాటు పగటిపూట దుర్వినియోగం కాకుండా పర్యవేక్షణ ఉండాలని, అన్ని గ్రామాల ఎల్ఈడీ డ్యాష్ బోర్డు మండల స్థాయిలో ఎంపీడీవో పర్యవేక్షణలో ఉండాలని చెప్పారు. జిల్లాలో అడిషనల్ కలెక్టర్‌కు ఈ బాధ్యతలు అప్పగించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల పరిధిలో 16.16 లక్షల ఎల్ఈడీ లైట్లున్నాయని, వరంగల్, నల్గొండ, జనగాం, నారా యణపేట జిల్లాల్లో ఎల్ఈడీ లైట్ల కాంట్రాక్టు ఏజెన్సీ అధ్వర్యంలో ఉందని అధికారులు సీఎంకు వివరించారు. అన్ని గ్రామాల్లో సర్పం చులకే వీటిని అప్పగిస్తే.. లైట్ల నిర్వహణ, విద్యుత్తు దుర్వినియోగం కాకుండా అడ్డుకట్ట పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. సోమవారం ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో మున్సిపల్, పంచాయతీ రాజ్, జీహెచ్ఎంసీ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో అన్ని ఎల్ఈడీ లైట్లను హైద రాబాద్లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న 5.50 లక్షల ఎల్ఈడీ లైట్లు ఉన్నాయని, అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ సిటీని కూడా కలిపితే మొత్తం 7.50 లక్షల లైట్లు అవసరమవుతాయని మున్సిపల్ శాఖ >>2

## ఆరోగ్యశ్రీ సేవలు బంద్

**ఆసుపత్రుల సంఘం కీలక నిర్ణయం**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు15:** ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోవడంతో తెలంగాణలో మరో సారి ఆ సేవలను నిలిపివేయనున్న ట్లు తెలంగాణ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిట ల్స్ అసోసియేషన్ సోమవారంనాడు ప్రకటించింది. పెండింగ్ బిల్లుల క్లియరిం గ్‌పై ప్రభుత్వం పదే పదే హామీలు ఇచ్చి నెరవేర్చలేదని పేర్కొంది. మంగళవా రం.. అంటే సెప్టెంబర్ 16వ తేదీ అర్ధ రాత్రి నుంచి ఈ సేవలను నిలిపివేయ నున్నట్లు వెల్లడించింది. ఆరోగ్య శ్రీ సేవ ల ద్వారా ప్రైవేట్ ఆసు పత్రులకు రూ. 1400 కోట్లు చెల్లించాల్సి ఉందని తెలి పింది. ఈ బకాయిలు చెల్లిం చడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని విమ ర్శించింది. దీనిపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకూ ఎటు >>2

## పండుగ కల్తీలపై డేగ కన్ను



**బతుకమ్మ, దసరా నవరాత్రుల సందర్భంగా పెద్దఎత్తున కల్తీమద్యం, నాటుసారా సరఫరా**

**వ్యాపారులపై వలవేసిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్**

**30 దాకా తెలంగాణ వ్యాప్తంగా తనిఖీలు**

**పాత గోదాంలు, రైస్‌మిల్లులు, చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా**

**హైదరాబాద్,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతిలో దసరా, బతుకమ్మ పండుగలను ప్రత్యేకంగా జరుపు కుంటారు. పండుగల సందర్భంగా చుక్క..ముక్క సంస్కృతి కొనసాగింపుగా ఉంటుంది. దసర, బతుకమ్మ పండుగలకు కొత్త బట్టలు, మద్యం సేవించడం పారిపాటి. ఇదే అదనుగా భావించే అక్రమార్కులు కల్తీ మద్యం, ఫ్యూరియస్ లిక్కర్, నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్, నాటుసారా అమ్మకాలు జరిపి సొమ్ము చేసు కోవడానికి ప్రయత్నాలను ముమ్మరం చేస్తారు. వీరి అగడాలకు, అమ్మకాల కు అడ్డకట్టవేయడానికి ఎక్సైజ్ శాఖ ఈ నెల 30 వరకు ప్రత్యేక తనిఖీలు చేపట్టడానికి ప్రణాళికలు తయారీ చేశారు. పక్షం రోజుల పాటు ఈ నెల 30 తేదీ వరకు అన్ని కోణాల్లో దాడులు నిర్వహించాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టర్ షాన్‌వాజ్ ఖాసీం అదేశాలు జారీ చేశారు. ఎక్కువ ధరలు కలిగిన ప్రీమియం వీస్కీ మద్యాం బాటిళ్లలో తక్కువ ధరలు కలిగిన మద్యాన్ని నింపి అమ్మకాలు చేపట్టె వారిపై, కల్తీ మద్యాం తయారు చేసే కేంద్రాలపై, గోవా, ఢీల్లీ, హర్యానా ప్రాంతాల నుంచి దిగుమతి అయ్యే నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్, డిఫెన్స్ మద్యాం రవాణ, దిగుమతి, అమ్మ కాలపై వీటితోపాటు నాటుసారా తయారీ అమ్మకాలు, రవాణ, వినియోగంపై ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం మోపాలని డైరెక్టర్ అన్ని తనిఖీ టీమ్‌లకు అదేశాలు జారీ చేశారు. ఫ్యూరియస్ లిక్కర్‌పై తెలంగాణ వ్యాప్తంగా ఎక్సైజ్‌తోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్టిఎఫ్, టీడీఎఫ్ టీములు తనిఖీలు నిర్వహించ నున్నాయి. వరంగల్, మహబూబాబాద్, >>2



సోమవారం కఠ్మాండులో ప్రమాణం చేస్తున్న మంత్రులు

నేపాల్ తాత్కాలిక కేబినెట్‌లో ముగ్గురు మంత్రులు 3

## విరాసత్ చేయలేదని కుటుంబం ఆత్మహత్యాయత్నం

**దేవరకద్ర తహసీల్దార్, ఆర్ఐ నిర్వాకం**

**మహబూబ్‌నగర్‌లో ఘటన**

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు15, ప్రభాతవార్త:** తాతల నాటి ఆస్తి తమపేర చేయాలంటూ ఓ కుటుంబం ఏండ్లుగా తాసి ల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నా పట్టించుకోలేదు.. కార్యాలయాల చుట్టూ కాళ్ల చెప్పులు అరిగేలా తిరిగినా పట్టించుకోలే.. ఉన్న పొలం తమ పేర మీదకు కుటుంబం వెళ్లదీసే దిక్కులేక ఏం చేయాలో తోచని ఆ కుటుంబ పెద్ద భార్య ముగ్గురు పిల్లలు సహా ఆటోలో ఉంచి పెట్రోల్ పోసి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిని హృదయ విదారక ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. మహ బూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని బస్వయపల్లి గ్రామానికి చెందిన శంకర్ వారసత్వంగా ఉన్న భూమిని విరాసత్ చేయా లంటూ దేవరకద్ర మండల తహసీల్దార్, ఆర్ఐ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తు న్నాడు. తన తాతలకు సంబంధించిన ఆస్తిని తమ పేర్ల పైకి విరాసత్ చేసుకునేందుకు గత ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వ కార్యాల యాల చుట్టు తిరుగుతూనే ఉన్నాడు. భూమికి సంబంధించిన ఓఆర్సి హక్కులు ఈ ఏడాది మార్చిలో శంకర్ కే వచ్చాయి. అయితే దీనిని అన్‌లైన్ చేయాలంటూ తహసీల్దార్ కార్యాలయం చుట్టు కాళ్లు అరిగేల తిరిగేతే ఇప్పుడు భూమే లేదంటూ కార్యా లయం నుంచి సిబ్బంది >>2







సహదేవ్ సోరెన్, చంచల్ (ఫైల్)

## మావోయిస్టు అగ్రనేత సోరెన్ ఎన్‌కౌంటర్

**మరో ఇద్దరు టాప్ కమాండర్లు హతం**

**మూడు ఎకె 47లు, మందు గుండు సామాగ్రి స్వాధీనం**

**జమ్మికుంట /హుజురాబాద్, ప్రభాతవార్త:** దేశంలో అంతర్గత భద్రతకు విప్లవ పార్టీల వల్ల ముప్పు వాటిల్లుతున్నదని, ఇది అభివృద్ధికి ఆటంకంగా మారిందని భావించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అపరేషన్ కగార్ పేరుతో తలపెట్టిన మావోయిస్టుల ఏరివేత కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అనుకున్నంత పని నిత్యం దేశంలో ఏదో ఒక రాష్ట్రంలో, ఎక్కడో ఒక చోట ఎన్‌కౌంటర్‌ల పరంపర కొనసాగుతూనే ఉంది. అందులో భాగంగానే సోమవారం ఉదయం జార్ఖండ్ రాష్ట్రంలోని అజారిబాగ్ జిల్లా గోర్హర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పంతిత్రి దండకారణ్యంలో కోబ్రా స్పెషల్ పార్టీ పోలీసు బలగాలు పక్కా సమాచారంతోనే ఆ ప్రాంతంలో కుంబింగ్ నిర్వహిస్తుండగా, మావోయిస్టులు తారాస పడడంతో ఇరువర్గాల మధ్య జరిగిన హోరాహోరు ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ మరో అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు సహదేవ్ సోరేన్ మృతి చెందినట్లు ఆయనపై కోటి రూపాయల రివార్డు ఉన్నట్లు పోలీస్ వర్గాలు వెల్లడించాయి. మరో ఇద్దరు టాప్ మావోయిస్టు సీనియర్ కమాండర్లు హతమైనట్లు ఆ జిల్లా ఎస్పి హార్విందర్ సింగ్ మీడియాకు వెల్లడించారు. కాల్పులు జరిగిన అనంతరం దట్టమైన >>2

కోర్టు ఆవరణలోనే ట్రిపుల్ తలాక్
భర్త, మామను సుత్తితో కొట్టిన మహిళ 3



## మెడికల్ అడ్మిషన్లను పరిష్కరించండి

**సిఎస్‌కు కెటిఆర్ ఫోన్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు15:** మెడికల్ ఎంట్రన్స్ పరీక్షలలో అర్హత సాధించినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త స్థానికత జీవో కారణంగా ప్రవేశాలకు అనర్హులుగా మిగిలిపోతున్న తెలంగాణ విద్యార్థుల ఆవేదనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు సోమవారం వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కేటీ ఆర్‌తో సమావేశమయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానికతకు సంబంధించి ఒక ఇబ్బందికరమైన జీవోను తీసుకువచ్చిందని విద్యార్థులు కేటీఆర్‌కు తెలిపారు. గతంలో పదో తరగతి వరకు 7 సంవత్సరాలు ఎక్కడ చదివితే అక్కడే స్థానికులుగా పరిగణించే నిబంధన ఉండేదని విద్యా ర్థులు తెలిపారు. అయితే ఇప్పుడు 9, 10, 11, 12 తరగతులు వరుసగా చది విన వారికే స్థానికత వర్తించేలా మార్పు చేశారని >>2

## నాలాలో ముగ్గురు గల్లంతు

**వారి ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్న హైడ్రా**

**భారీ వర్షాలతో హైదరాబాద్ అతలాకుతలం**

**బాధిత కుటుంబ సభ్యులకు రూ. 5 లక్షల పరిహారం**



ముషీరాబాద్‌లో నాలాను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షాలకు నగరం అతాకుతలం అయ్యింది. గంట వ్యవధిలోనే దాదాపు 12 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఈ భారీ వర్షం ధాటికి అసిఫ్‌నగర్ అఫ్జల్‌సాగర్ కాలువలో ఇద్దరు గల్లంతయ్యారు. డ్రైనేజీలో మామ, అల్లుడు అర్జున్(26), రాము(25) పాటు.. కొట్టుకుపోయారు. మామను కాపాడే ప్రయత్నంలో అల్లుడు కూడా గల్లంతయ్యాడు. వీరిద్దరి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. అలాగే ముషీరాబాద్ మరో వ్యక్తి గల్లంతయ్యాడు. వినోభానగర్ నాలాలో దినేష్ అలియాస్ సన్నీ(26) నాలలో పడికొట్టుకుపోయారు. ఈనేపథ్యంలో హైడ్రా ముమ్మరంగా గాలిస్తుంది. ఆసిఫ్‌నగర్లోని అఫ్జల్ సాగర్ నాలాతో పాటు.. ముషీరాబాద్‌లోని వినోభానగర్ నాలా పరిసరాల్లో గాలింపు చర్యలను రంగనాథ్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈప్రతి క్యాచ్‌పిట్‌ను తెరిచి చూసిన తర్వాత వెంటనే వాటిని మూసి వేయాలని సిబ్బందిని ఆదేశించారు. గాలింపు చర్యలను మిగతా శాఖలతో కలిసి ముమ్మరం చేయాలన్నారు. నాలా ఆక్రమణలే ప్రమా దాలకు కారణం.. నాలాల ఆక్రమణలే ప్రమాదాలకు కారణమని గాలింపు చర్యలను పరిశీలించిన అనంతరం >>2



ముంబయిలో సోమవారం మహారాష్ట్ర కొత్త గవర్నర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరిస్తున్న గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్

# సోరెన్ ఎన్‌కౌంటర్

>> అటవి ప్రాంతంలోని సంఘటన స్థలంలో మూడు ఎకె 47 రైఫిళ్లు, మందుగుండు సామాగ్రి స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు. ఆ అభయారణ్య ప్రాంతం ఇంక కోబ్రా బలగాల చేతుల్లోనే కుంబింగ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గడిచిన నెల రోజుల కాలంలో చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరిగిన పలు ఎన్‌కౌంటర్‌లలో కేంద్ర కమిటీ నాయకులు పలువురు మృతి చెందగా, అప్పటికే కోలుకోలేని దెబ్బతో సతమతమవుతున్న మావోయిస్టు పార్టీ జార్ఖండ్‌లో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌తో మరింత చావుదెబ్బ తీసినట్లయింది. మరో ఇద్దరు టాప్ కమాండర్లు రఘునాథ్ హెంబరం అలియాస్ చెంచల్ దండకారణ్య స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడని, మరో జోనల్ కమిటీ సభ్యుడు విర్సన్ గంజల్ అలియాస్ రాం కిలేవాన్‌లపై ఒకరిక్కరిపై 50లక్షల చొప్పున రివార్డు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ యేడు జూలై మాసంలో జార్ఖండ్ దండకారణ్యంలో కోబ్రా స్పెషల్ పార్టీ భద్రత బలగాలు కగార్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా, అందులో ఒక జవాన్‌ను కిడ్నాప్ చేసి, హతమార్చిన సంఘటనలో కేంద్ర కమిటీ సభ్యుడు సహదేవ్ పేరు బయటకు వచ్చినట్లు పోలీస్ వర్గాలు పేర్కొన్నాయి. చాలా కాలంగా మావోయిస్టు బలగాలు సహదేవ్ సోరెన్ ఆధ్వర్యంలో జార్ఖండ్ ప్రాంతంలో ఎదో పెద్ద ఆపరేషన్‌కు ప్లాన్ చేస్తున్నట్లు పక్కా సమాచారం పోలీస్ వర్గాలకు అందినట్లు ఎస్పి హర్విందర్ సింగ్ మీడియాకు తెలిపారు. అనంతరం మృతి చెందిన మావోయిస్టుల కిట్ బ్యాగులు, మందుగుండు సామాగ్రి, ఇతర ఎలక్ట్రానిక్ పరకరాలు పోలీసులు ప్రదర్శించారు. ఈ సంఘటనతో జార్ఖండ్ రాష్ట్రంలో తీవ్ర భయానక పరిస్థితులు నెలకొన్నాయి.

# ఆత్మాహత్యాయత్నం

>> వెళ్లగొట్టారు. దీంతో ఆవేదనకు గురైన శంకర్ తన భార్య ముగ్గురు ఆడపిల్లలతో కలిసి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. భార్య, పిల్లలను తన ఆటోలో ఉంచి తనతో పాటు వారిపై ఆటోపై కూడ పెట్రోల్ పోసి నిప్పంటించుకునే ప్రయత్నం చేశారు. వెంటనే గమనించిన చట్టుపక్కల వారు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే ఆటోకు నిప్పు అంటుకోవడంతో పూర్తిగా ఆటో దగ్ధం అయింది. ఎవరకి ప్రాణహాని జరగకపోవడంతో అంతా ఊపిరి పీలుచ్చుకున్నారు. ఈ ఘటనతో ఒక్కసారిగా పాలమూరు ఉలికిపాటుకు గురైంది. విషయం తెలుసుకున్న మహబూబ్‌నగర్ ఆర్డీవో నవీన్ తహసిల్దార్, ఆర్ఐ పై చర్యలు తీసుకుంటామని ఒక ప్రకటన విడుదల చేశారు. బాధితునికి కొత్త ఆటో తెప్పించడంతోపాటు.. భూమిని ఆన్లైన్ చేస్తామని తెలుపడంతో బాధితులు సంతోషం వ్యక్తం చేశారు.

# నాలాలో ముగ్గురు గల్లంతు

>> హైడ్రా కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ హైడ్రా నాలాలను ఆక్రమించి నిర్మించడమే కాకుండా.. వాటి ప్రవాహాన్ని అశాస్త్రీయంగా దారి మళ్లించడంతో వరద సాఫీగా సాగడంలేదన్నారు. వరద ప్రవాహానికి ప్రధాన అడ్డంకిగా ఉన్న ఒకటి రెండు కట్టడాలనే తొలగిస్తామని.. మిగతా వారు ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని కమిషనర్ స్పష్టం చేశారు. నాలాల చెంతన పేదలే ఎక్కువ సంఖ్యలో నివసిస్తున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకుని.. తప్పనిసరై కూల్చి వేయాల్సి వస్తే వారికి ప్రత్యామ్నాయం ప్రభుత్వం చూస్తుందన్నారు. పేదల పట్ల ప్రభుత్వానికి ఆ సింపతీ ఉందని.. హైడ్రా కూడా అదే తీరుతో పని చేస్తున్నదని చెప్పారు. ఈ సమస్య మూలాలకు వెళ్లి పరిష్కరించాల్సి నవసరం ఉందని జీహెచ్ ఎంసీ, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలతో కలిసి అధ్యయనం చేసిన తర్వాతే ముందుకు వెళ్తామని.. పేదల నివాసాలు పెద్దమొత్తంలో ఉన్నందున అన్ని జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. భారీ వర్షం పడితే అమీర్‌పేట పరిసరాలు నీట మునిగేవని.. అక్కడ అండర్‌గ్రౌండ్ లో పూడుకుపోయిన నాలాలను తెరవడంతో సమస్య పరిష్కారం అయ్యిందన్నారు.నాలా ప్రమాదంలో గల్లంతైన బాధిత కుటుంబ సభ్యులకు నష్ట పరిహారం రూ. 5 లక్షలు చెల్లిస్తామని కలెక్టర్ హరిచందన తెలిపారు. అఫ్జల్ సాగర్ నాలాను హైడ్రా కమిషనర్ రంగనాథ్ తో కలిసి పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ నాలాలో గల్లంతైన వారి మృతదేహాలు దొరకలేదు, దొరికిన తరువాత చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాలాల వద్ద ఉండే ప్రజలు వరద ఉధృతి ఎక్కువ ఉంటే జాగ్రత్తగా ఉండాలన్నారు. కొన్ని నిర్మాణాలు నాళాలపైఉన్నాయని అలాంటివాటితో అందరికిప్రమాదమని అన్నారు.

## సిఎం రేవంత్‌తో సమావేశమైన అమెరికా కాన్సల్ జనరల్ లారా విలియమ్స్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు15:** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ మర్యాదపూర్వకంగా కలిశారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన ఈ సమావేశంలో అమెరికా కాన్సులేట్‌కు చెందిన అధికారులు కూడా పాల్గొన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో సాగిన ఈ భేటీలో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై చర్చలు జరిగాయి.

## వీసా ఇప్పిస్తామంటూ ఇరాన్‌లో భారతీయుడి కిడ్నాప్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 15:** ఇరాన్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని ప్రలోభపెట్టి 20 లక్షలు కాజేసిన ప్రముఖుల కథ వెలుగులోకి వచ్చింది. అంతేకాకుండా ఇరాన్ వెళ్లాక అక్కడ ఒక గ్యాంగ్‌ఢిల్లీ వాసిని కిడ్నాప్‌చేసి కోటిరూపాయలు డిమాండ్‌చేసిన వైనం కూడా బయటకు వచ్చింది. 26 ఏళ్ల హిమంశు మాథుర్ అమన్ రాటి అనే వ్యక్తిని కలుసుకున్నాడు. తనంతతాను ఇమ్మిగ్రేషన్ సేవల్లోపనిచేస్తున్నానని, డిశ్చార్జి సర్టిఫికేట్‌కోర్సు పూర్తయ్యాక షిప్పింగ్ కంపెనీల్లో ఉద్యోగం వచ్చేవిధంగా తాను చేయగలనంటూ నమ్మించాడు. ఆ తర్వాత ఆస్ట్రేలియా వర్క్ వీసా లభిస్తుందని చెప్పాడు. దీనితో కోర్సును నోయిడాలో పూర్తిచేసిన మాథుర్‌కు మనం ఇద్దరం బయలుదేరదామని చెప్పాడు. ఆగస్టులో తాను ఇండోనేసియాలో ఉన్నానని ఒక ఏజెంట్ మీకు ఆస్ట్రేలియాకు 19 లక్షలకే వీసా వచ్చే ఏర్పాట్లుచేస్తాడని చెప్పడంతో మాథుర్ జకార్తాకు వెళ్లాడు. అక్కడే రాథిని కలిసి పానిపట్‌కు చెందిన విశాల్ అనే వ్యక్తిని కలిసారు. ఆగస్టు తొమ్మిదిన మాథుర్ సోదరుడు డింపీ 12 లక్షలు కర్నాల్‌లోని తన సహచరుడికి అందచేయాలనడంతో వెంటనే ఇచ్చారు.

## ఆరోగ్యశ్రీ సేవలు
# బంద్

>> వంటి సానుకూల ప్రకటన రాలేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో సమ్మె నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. నిధులు లేమి కారణంగా.. హాస్పిటల్స్ నడిపించే పరిస్థితి లేదని ప్రైవేట్ హాస్పిటల్స్ అసోసియేషన్ ఒక ప్రకటనలో పేర్కొంది. బిల్లులు పొందాల్సిన జాబితాలో దాదాపు 400 హాస్పిటల్స్ ఉన్నట్లు సమాచారం. గత ఏడాదిగా హాస్పిటల్స్‌కు ప్రభుత్వం నగదు చెల్లించడం లేదని యాజమాన్యాలు వాపోతున్నాయి. అయితే ఈ అంశంపై ఆగస్టు 31వ తేదీనే ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశామని హాస్పిటల్స్ యాజమాన్యం తెలిపింది. ఆ రోజు అర్ధరాత్రి నుంచే సేవలు బంద్ చేస్తామని ప్రభుత్వాన్ని స్పష్టం చేశామని.. దీంతో ఆరోగ్య శాఖ మంత్రి రంగంలోకి దిగి ఆర్థిక శాఖ మంత్రితో మాట్లాడి నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని తెలిపింది. అయినా ఇప్పటివరకూ నిధులు రాకపోవడంతో సమ్మెకు దిగబోతున్నట్లు వెల్లడించింది. కానీ రెండు వారాలు గడిచినా.. ఆ నిధులు ఇప్పటి వరకు విడుదల చేయలేదని యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో సేవలను నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ ఏడాది జనవరిలో సైతం ఇదే విధంగా ఆరోగ్య శ్రీ సేవలను సదరు అసోసియేషన్ నిలిపివేసిన విషయం విదితమే.

# పరిష్కరించండి

>> పేర్కొన్నారు. దీనివల్ల వందలాది మంది విద్యార్థులు నష్టపోతున్నారని కేటీఆర్‌కు వివరించారు. పదో తరగతి వరకు తెలంగాణలో చదివిన తర్వాత, అత్యుత్తమ శిక్షణ కోసం చాలామంది ఆంధ్రాతో పాటు అనేక నాన్‌తెలుగు రాష్ట్రాలలో కోచింగ్‌లు తీసుకుని నీట్ పరీక్షలకు సన్నద్ధమయ్యారని, ఇప్పుడు ఆ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అర్హత సాధించినప్పటికీ, ప్రభుత్వం వారిని అనర్హులుగా ప్రకటించి ప్రవేశాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం మొండిగా సుప్రీంకోర్టు వరకు వెళ్లిందని వారు తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమస్యలను సవివరంగా విన్న కేటీఆర్.. వెంటనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సమస్యను సానుకూలంగా పరిశీలించాలని ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక ప్రతినిధి బృందం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలుస్తుందని తెలిపారు.

## వారం - వర్జ్యం

16-09-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
దశమి రా.12.25
ఆరుద్ర ఉ.6.46
వర్జ్యం : సా.6.36-8.11
దు.ఉ.8.24-9.13, 2)రా.11.04-11.53
శుభసమయం:ఉ.6.30-7.20, సా.6.30-7.30
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** పోరాడి దూరప్రాంత అవకాశములను సాధిస్తారు. శుభకార్యాలలో పాల్గొంటారు.

**వృషభం:** ఉద్యోగములో స్థాయి పరపతి పెంచుకొనే యత్నములకు గాను విశేషంగా కృషి చేస్తారు.

**మిథునం:** మీ మీద నిందారోపణలు చేసే వ్యక్తుల విషయంలో జాగ్రత్తలు వహించండి.

**కర్కాటకం :**కుటుంబ ఐకమత్యకు విఘాతమేర్పడకుండా సంయమనం పాటించండి.

**సింహం:**మీ మాటకు మంచితనమునకు గాను సమాజములో మీకు గౌరవ ప్రతిష్ఠలు పెంపొందాయి.

**కన్య :** నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆస్తి విదాదాలు తీరి లబ్ధి పొందుతారు.

**తుల :** దీర్ఘకాలిక సమస్యలు తీరి ప్రశాంతత పొందుతాయి. వివాహాది శుభకార్యాలలో పాల్గొంటారు.

**వృశ్చికం:**పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ఉద్యోగలకు ఇంక్రిమెంట్లు లభిస్తాయి.

**ధనుస్సు:** రాజకీయ, సినీ, కళారంగాల వారికి విదేశీ పర్యటనలు వుంటాయి. వాహనసౌఖ్యం.

**మకరం:** నూతన పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. శత్రువులు సైతం పాత్రులుగా మారి సహాయం అందిస్తారు.

**కుంభం:**ముఖ్యమైన వ్యవహారాలలో ఎదురైన ఆటంకాలను అధిగమిస్తారు. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**మీనం :** కీలక నిర్ణయాలలో తొందరపాటు వద్దు. ఉద్యోగాలలో స్వల్ప మార్పులు చోటు చేసుకుంటాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వక్ఫ్ సవరణపై పూర్తి స్టే ఇవ్వలేం

>> సోమవారం మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. వక్ఫ్ చట్టంలోని అన్ని సెక్షన్లను సవాలు చేస్తూ దాఖలైన ప్రాథమిక అభియోగాలపై తాము విచారణ జరిపామని, ఆ మొత్తం చట్టంపై స్టే విధించేంతగా పరిస్థితేం కనిపించలేదన్నారు. ఎందుకంటే పిటిషనర్ల ప్రధాన ఆందోళన, అభ్యంతరం అనేది 3(ఆర్), 3సీ, 14, వంటి పలు సెక్షన్లపైనే ఉందని పేర్కొన్నారు. ముస్లిమేతర వ్యక్తులకూ వక్ఫ్ బోర్డ్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ)గా అవకాశం ఇవ్వొచ్చంటూ చట్టంలో చేసిన సవరణపై స్టే ఇవ్వలేమని సుప్రీంకోర్టు బెంచ్ తెలిపింది. వీలైనంత మేరకు ముస్లిం వర్గానికే ఆ పదవిని కేటాయించేందుకు ప్రయత్నించాలని నిర్దేశించింది. రాష్ట్రాల వక్ఫ్ బోర్డులు, సెంట్రల్ వక్ఫ్ మండళ్లలో ముస్లిమేతరుల సంఖ్యను 4 నుంచి 3కు తగ్గిస్తున్నట్లు పేర్కొంది. కనీసం ఐదేళ్లుగా ఇస్లామ్ మతాన్ని అనుసరిస్తున్న వారు మాత్రమే వక్ఫ్‌ను క్రియేట్ చేయగలరనే నిబంధనపై సుప్రీంకోర్టు స్టే విధించింది. వక్ఫ్‌ను ఎవరు రూపొందిచవచ్చు తప్పకుండా ఇస్లామ్‌ను అనుసరిస్తున్న వారే దీన్ని రూపొందించాలా అనే దానిపై కొత్త రూల్స్ సిద్ధమయ్యే వరకు, ప్రస్తుత నిబంధనపై స్టే అమల్లో ఉంటుందని పేర్కొంది. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి వక్ఫ్ ఆస్తిలో కలుపుకుంటే, వివాదం పరిష్కారానికి ప్రభుత్వం ఒక అధికారిని నియమిస్తుందనే నిబంధన వక్ఫ్ చట్టంలో ఉంది. దీనిపై స్టే విధించింది. ఏదైనా ఆస్తి వక్ఫ్‌దా ప్రభుత్వానిదా అనే అంశాన్ని తేల్చి, ఆదేశాలిచ్చే అధికారాన్ని జిల్లా కలెక్టర్‌కు కల్పిస్తూ చేసిన సవరణపై సుప్రీంకోర్టు స్టే విధించింది. న్యాయమూర్తుల్లా జిల్లాల కలెక్టర్లు దేశ పౌరుల హక్కులపై నిర్ణయాలు తీసుకోలేరని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. వారు అలా చేయాల్సి వస్తే, అధికారాల విభజన సూత్రానికి విఘాతం కలుగుతుందన్నారు. వక్ఫ్ ఆస్తుల హక్కుదారులు ఎవరు అనేది కోర్టు తీర్పులతోనే నిర్ణయం అవుతుందని సీజేఐ చెప్పారు. కోర్టు కేసుల్లో తీర్పులు వచ్చేదాకా, ఆయా వివాదాస్పద ఆస్తులపై ఎవరికీ హక్కులను బదిలీ చేయకూడదని అడ్వకేట్ అన్నారు.

వక్ఫ్ సవరణ చట్టంలోని పలు నిబంధనల అమలుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఐదేళ్లుగా ఇస్లామ్‌ను అనుసరిస్తున్న వారికే వక్ఫ్‌ను రూపొందించే హక్కు ఉంటుందనే నిబంధనపై స్టే విధించారు. ఎవరైనా వ్యక్తి ఐదేళ్లుగా ఇస్లామ్‌ను అనుసరిస్తున్నాడా? లేదా? అనేది నిర్ధరించడానికి నిర్దిష్టమైన వ్యవస్థ ఏదీ లేకపోవడం వల్లే సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. వక్ఫ్ బోర్డుల్లో నియమించే ముస్లిమేతరుల సంఖ్యను 4 నుంచి 3కు తగ్గించారు. వక్ఫ్ ఆస్తి రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన నిబంధనపై స్టే విధించలేదు. కానీ అందుకు నిర్దేశించిన గడువును పొడిగించింది" అని వక్ఫ్ చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన అడ్వకేట్ అనస్ తన్వీర్ తెలిపారు. చాలావరకు మా వాదనలను సుప్రీంకోర్టు బెంచ్ పరిగణనలోకి తీసుకుంది. వాటితో సమ్మతించింది. చాలాకాలంగా ముస్లిం మతపరమైన అవసరాల కోసం వినియోగిస్తున్న భూమి లేదా ఆస్తిని వక్ఫ్‌గా పరిగణించాలనే మా వాదనను సుప్రీంకోర్టు అంగీకరించింది. ముస్లింల రక్షిత కట్టడాల విషయంలోనూ మా వాదనకు దేశ సర్వోన్నత న్యాయస్థానం అంగీకారం తెలిపింది. అలాంటి కట్టడాలను థర్డ్ పార్టీ ఏదీ క్లెయిమ్ చేసుకోకూడదని కోర్టు చెప్పింది. కోర్టు ఆదేశాలు, విచారణపై మేం సంతృప్తితో ఉన్నామని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ సభ్యుడు సయ్యద్ ఖాసిం రసూల్ ఇలియాస్ చెప్పారు. వక్ఫ్ సవరణ చట్టం ద్వారా కేంద్ర ప్రభుత్వం చేసిన కుట్ర వ్యవహారం బహిర్గతమైంది. వక్ఫ్‌కు భూములను దానం చేసిన వాళ్లు భయపడ్డారు. తాము ఇచ్చిన భూములను ప్రభుత్వం కబ్జా చేస్తుందేమోనని కలవరపడ్డారు. కానీ వారికి ఊరటనిచ్చేలా సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకుంది. పలు వివాదాస్పద నిబంధనలపై స్టే విధించింది. ఐదేళ్లుగా ఇస్లామ్‌ను పాటిస్తున్న వాళ్లను కేంద్ర ప్రభుత్వం ఎలా గుర్తిస్తుంది? ఇది విశ్వాసానికి సంబంధించిన విషయం. ప్రభుత్వం ఇలాంటి అన్ని అంశాలను నిశితంగా పరిశీలించాకే చట్టాలు చేయాలి. మేం మా పోరాటాన్ని కొనసాగిస్తాం" అని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌ఘరీ తెలిపారు. నేను తమిళనాడులోని తిరుచెందురై గ్రామానికి చెందిన పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తున్నాను. ఆ గ్రామం మొత్తాన్ని వక్ఫ్ పరిధిలోకి తీసుకున్నారు. ఇటువంటి వివాదాస్పద అంశాలతో ముడిపడిన వక్ఫ్ చట్టపు సెక్షన్లపై స్టే విధించడాన్ని స్వాగతిస్తున్నాను. ఆయా సెక్షన్లపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పునస్సమీక్ష చేయాల్సిన అవసరం ఉంది. సుప్రీంకోర్టు జారీ చేసిన మధ్యంతర ఆదేశాలు పారదర్శకంగా, సమతూకంతో ఉన్నాయి. చాలాకాలంగా ముస్లిం మతపరమైన అవసరాల కోసం వినియోగిస్తున్న భూమి లేదా ఆస్తిని వక్ఫ్‌గా పరిగణించాలనే వక్ఫ్ బై యూజర్ నిబంధన దేశానికి అనుకూలమైంది కాదని సుప్రీంకోర్టు బెంచ్ అభిప్రాయపడిందని అడ్వకేట్ ప్రియదర్శిని రాహుల్ తెలిపారు. మొత్తం వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీంకోర్టు స్టే విధించలేదు. కానీ పిటిషనర్ల అభ్యంతరాలు, ఆందోళనలను పరిగణనలోకి తీసుకొని, వారికి అనుకూలంగా మధ్యంతర ఆదేశాలను జారీ చేసింది. కొన్ని సెక్షన్ల అమలుపై స్టే విధించింది. వక్ఫ్ ఆస్తుల యాజమాన్య నిర్ధారణ, కేటాయింపునకు చట్టపరమైన మార్గాలనే అనుసరించాలని పిటిషనర్లు వాదిస్తున్నారు. వక్ఫ్ సవరణ చట్టంలోనూ ఇదే విధమైన నిబంధనలు ఉన్నాయి. ఈ అంశాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఏదైనా వక్ఫ్ ఆస్తిని ప్రభుత్వం తీసుకుంటే, ట్రిబ్యునల్, హైకోర్టు ఆదేశాలను పాటించాల్సి ఉంటుందని కూడా సవరణ చట్టంలో ఉంది. ట్రిబ్యునల్ తీర్పు వచ్చిన తర్వాతే, ప్రభుత్వ నిర్ణయం అమల్లోకి వస్తుందని రూల్స్ చెబుతున్నాయని సీనియర్ అడ్వకేట్ బరుణ్ సింగ్ చెప్పారు. వక్ఫ్ బోర్డులలో ముగ్గురికి మించి ముస్లిమేతరులను నియమించకూడదని సుప్రీంకోర్టు చెప్పింది. వక్ఫ్ ఆస్తిని గుర్తించే, నిర్ధారించే ప్రక్రియపై వక్ఫ్ సవరణ చట్టంలో పొందుపర్చిన నిబంధనపై న్యాయస్థానం స్టే విధించింది. దీనివల్ల వక్ఫ్ ఆస్తులకు రక్షణ లభిస్తుంది. మొత్తం మీద ఈ ఆదేశాలు బాగున్నాయి. మేం దీన్ని స్వాగతిస్తున్నామని అడ్వకేట్ ఎంఆర్ శంషాద్ చెప్పారు.



బీహార్‌లోని పూర్ణియాలో సోమవారం పలు అభివృద్ధి ప్రాజెక్టులను జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని మోడీ. చిత్రంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, సిఎం నితీష్ కుమార్ తదితరులు

# చర్చలు సఫలం

>> చర్చల సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సుల్తానియా, విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రేషనలైజేషన్ కోసం, కాలేజీ యాజమాన్యాల సమస్యలు, ఇతర ప్రతిపాదలను చర్చించేందుకు ప్రభుత్వం త్వరలో యాజమాన్యాల ప్రతినిధులు, అధికారులతో కూడిన కమిటీని నియామకం చేయనున్నట్లు డిప్యూటీసిఎం తెలిపారు. కాగా ఫీజు రియిం బర్స్‌మెంట్ బకాయిలచెల్లించాలని డిమాండ్‌చేస్తూ రాష్ట్రంలో పలు ప్రైవేటు కాలేజీలు సోమవారం బంద్‌ను అమలు చేశాయి. అయితే పరీక్షలకు ఈ బంద్ మినహాయింపు ఉంటుందని తెలిపాయి. అయితే మరికొన్ని కాలేజీలు మాత్రం బంద్ చేయకుండా యథావిధిగా కొనసాగాయి. ప్రభుత్వంతో చర్చలు సఫలం కావడంతో బంద్‌ను పూర్తిగా విరమించుకున్నాయి.

# వీధిదీపాలు సర్పంచ్‌లకే

>> సీఎంకు నివేదించింది. గతంలో ఉన్న ఏజెన్సీ కాంట్రాక్టు ముగియటంతో ఇప్పుడు చాలాచోట్ల లైట్లు వెలగటం లేదని, నిర్వహణ కూడా సరిగా జరగలేదని అధికారులు నివేదించారు. కోర్ అర్బన్ సిటీ పరిధిలో జీహెచ్ఎంసీతో పాటు కొత్తగా చేరిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామాలన్నింటిని పరిగణనలోకి తీసుకొని ఎల్ఈడీ లైట్ల అవసరాన్ని అంచనా వేయాలని సీఎం ఆదేశించారు. కొత్తగా ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు, నిర్వహణకు టెండర్లు పిలవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఎల్ఈడీ లైట్ల తయారీలో పేరొందిన కంపెనీలను ఆహ్వానించాలని, ఏడేండ్ల పాటు నిర్వహణ బాధ్యతలు కంపెనీలకు అప్పగించాలని, నిర్వహణ పక్కాగా ఉండేందుకు వీలుగా టెండర్ నిబంధనలను రూపొందించుకోవాలని సీఎం సూచించారు. ఎల్ఈడీ లైట్లతో పాటు కంట్రోల్ బాక్స్ ల ఏర్పాటు, నిరంతరం అవి పనిచేస్తున్నాయా లేదా, ఏయే ప్రాంతాల్లో ఇబ్బందులున్నాయో తెలుసుకునేందుకు ప్రత్యేకంగా వ్యవస్థ ఉండాలన్నారు. హైదరాబాద్ ఐఐటీ లాంటి సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని సూచించారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో వీధి దీపాలకు ప్రతి నెలా రూ.8 కోట్ల కరెంటు బిల్లు చెల్లించాల్సి వస్తుందని, విద్యుత్తు ఆదా చేసేందుకు సోలార్ పవర్ వినియోగించే అంశాన్ని, అందుకు అవసరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారు. కోర్ అర్బన్ సిటీ ఏరియాతో పాటు అవుటర్ అవతల ఉన్న మున్సిపాలిటీల్లోనూ ఎల్ఈడీ లైట్ల ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కోర్ అర్బన్ సిటీతో పాటు మున్సిపాలిటీల్లో ఎల్ఈడీ లైట్లకు కూడా టెండర్లు పిలవాలన్నారు.

సిఎం వద్ద జరిగిన సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, పంచాయితీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, కోర్ అర్బన్ ఏరియా మున్సిపల్ సెక్రటరీ ఇలంబర్తి, మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవి, జీ హెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ శ్రీజన ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# పండుగ కల్తీలపై డేగ కన్ను

>> అదిలాబాద్, నల్లగొండ, ఖమ్మం జి ల్లాలో కొద్ది ప్రాంతంలో తయారు అయ్యే నాటు సారా స్థావరాలపై ముక్మడి దాడులు నిర్వహించాలని డైరెక్టర్ అదేశించారు. నాటు సారా తయారీతో పాటు సారా తయారీకి వినియోగించే ముడిసరుకు రవాణపై కూడ నిఘా పెట్టి అడ్డుకోవాలని అదేశించారు.ఢిల్లీ, హర్యానా, గోవా, డిఫెన్స్ క్యాంటిన్ల నుంచి అక్రమంగా దిగుమతి అయ్యే నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్ ఎక్కువగా రంగారెడ్డి, హైదారాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ, మెదక్ డివిజన్లలో నిఘా బృందాలు దాడులు నిర్వహించాలని అదేశించారు.వీటితోపాటు ఖాళీ గోదాముల్లోను, రైస్ మిల్లుల్లో అక్రమంగా తయారు అవుతున్న కల్తీమద్యం,ఫ్యూరియస్ లిక్కర్ తనిఖీలు ముమ్మరంగా చేయాలని అదేశించారు.

**గత పదేళ్లలో ఎన్‌డీపీఎల్ కేసుల వివరాలు.. ఇలా ఉన్నాయి.**

తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్ అమ్మకాలపై ఎక్సైజ్‌శాఖ ఉక్కుపాదాం మోపుతూ వస్తుంది. 2014 నుంచి 2025 ఆగస్టు నాటికి 4516 కేసులను ఎక్సైజ్ శాఖ నమోదా చేసింది. 3238 మందిని ఈ కేసుల్లో అరెస్టు చేసింది. 1,22,222 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు. 616 వాహనాలకు కూడ స్వాధీన పరుచుకున్నారు. 2025 జనవరి నుంచి ఆగస్టు వరకు 644 కేసులు నమోదా చేసి 381 మందిపై కేసు నమోదా చేశారు. 8201 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.86 వాహనాలను సీజ్ చేశారు. తెలంగాణలో గత పదేళ్లలో నాటు సారా తయారీ అమ్మకాలు, రవాణ సమయాల్లో దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకొని నమోదు చేసిన కేసులు భారీగా ఉన్నాయి. 2014 నుంచి 2025 ఆగస్టు నాటికి నాటుసారా తయారీ, అమ్మకాలు, రవాణపై 2,75,028 కేసులు నమోదా చేశారు. 1,59,974 మందిపై కేసులు నమోదా చేశారు. 31,45,169 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు, 65,59,847 కేజీల నల్ల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. 18,065 వాహనాలను సీజ్ చేశారు. 2025 ఆగస్టు నాటికి 10,333 కేసులు నమోదా చేసి, 9694 మందిపై కేసులు నమోదా చేసి 48,180 లీటర్ల నాటుసారా ను స్వాధీనం చేసుకున్నారు. 2,06,848 కేజీల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. 1633 వాహనాలను సీజ్ చేశారు.15 రోజుల పాటు స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీములు,ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు,జిల్లా టాస్‌ఫో ర్స్ టీములతోపాటు ఎక్సైజ్ స్టేషన్ల సిబ్బంది కలిసి ఎన్‌డీపీఎల్, నాటుసారా తాయారా అమ్మకాలపై స్పెషల్ డ్రైవ్ చెపట్టనున్నారు.ఇతర రాష్ట్రాల నుంచి రైళ్లలోను, వాహనాల్లోను, బస్సుల్లో వచ్చె నాన్‌డ్యూటి పెయిడ్ లిక్కర్‌ను, స్థానికంగా తయారు చేసే నాటు సారాను రాకుండా, లేకుండా చేయడమే లక్ష్యంగా దాడులు నిర్వహిస్తారు.15రోజుల పాటు పటిష్టమైన దాడులు చేస్తామని షాన్‌వాజ్ ఖాసీం, (ఐపీఎస్),ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డెరెక్టర్ తెలిపారు.

## కేంద్రమంత్రి బండి సంజయ్‌పై కెటిఆర్
# రూ.10 కోట్ల పరువు నష్టం దావా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు15:** కేంద్రమంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరువు నష్టం దావా వేశారు. బండి సంజయ్‌తో పాటు పలు మీడియా సంస్థలు, సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లపై హైదరాబాద్ సిటి సివిల్ కోర్టులో పిటిషన్ వేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నిరాధార ఆరోపణలు చేయడంతో పాటు తప్పుడు కథనాలను ప్రచురించినందుకు కేటీఆర్ ఈ దావా వేశారు. తప్పుడు సమచారాన్ని తొలగించడంతో పాటు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పరువు నష్టం కింద రూ.10 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. 2025 ఆగస్టు 8న బండి సంజయ్ తప్పుడు, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారని కేటీఆర్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలలో తెలంగాణ ఎస్ఐబీ (స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్) దుర్వినియోగం, ఫోన్ ట్యాపింగ్. ఆర్థిక అవకతవకలకు ముడిపెట్టారని తెలిపారు. ఏబీఎన్ తెలుగు, ఎన్టీవీ, టీవీ5, వీ6, ఏఎన్ఎన్ తెలుగు వంటి టీవీ ఛానెళ్లు, అలాగే ఇండియా టుడే, ఎన్డీటీవీ, డెక్కన్ హెరాల్డ్, టైమ్స్ ఆఫ్ ఇండియా వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, అలాగే ఎక్స్ (ట్విట్టర్), యూట్యూబ్, గూగుల్, మెటా (ఫేస్‌బుక్/ఇన్‌స్టాగ్రామ్) వంటి సోషల్ మీడియా సంస్థలు ఈ వ్యాఖ్యలను విస్తృతంగా ప్రసారం చేశాయన్నారు. ఈ వ్యాఖ్యలు కేవలం పరువుకు భంగం కలిగించడమే కాకుండా, తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడానికి ఉద్దేశించినవిగా ఉన్నాయని తెలిపారు. ఈ ఆరోపణలపై 2025 ఆగస్టు 11న లీగల్ నోటీసు పంపినప్పటికీ, బండి సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పడానికి నిరాకరించారని.. అందుకే న్యాయస్థానాన్ని ఆశ్రయించానని పిటిషన్‌లో కేటీఆర్ పేర్కొన్నారు. బండి సంజయ్ కేవలం రాజకీయ కక్షతో విపరీతమైన నిందారోపణలతో దుష్ప్రచారానికి పాల్పడ్డారని తెలిపారు. అధికారంలో ఉన్న కేంద్ర మంత్రి ఇటువంటి బాధ్యతారహితమైన, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేయడం వల్ల ప్రజా ప్రతినిధుల విశ్వసనీయత, గౌరవానికి తీవ్రమైన పరిణామాలు ఉంటాయని కూడా ఈ ఫిర్యాదులో నొక్కి చెప్పారు. నిరాధార ఆరోపణలపై బండి సంజయ్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని పిటిషన్‌లో కేటీఆర్ డిమాండ్ చేశారు. మరోసారి తన పరువుకు నష్టం కలిగించే కంటెంట్‌ను ప్రచురించకుండా, ప్రసారం చేయకుండా నిందితులను నిరోధించేలా ఉత్తర్వులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు, మీడియా పోర్టల్స్‌లో ప్రచురించిన కథనాలు, వీడియోలు, పోస్టులను తక్షణమే తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కాగా, డిసెంబర్ 15న కేసు విచారణకు కావాలని బండి సంజయ్ సిటీ సివిల్ కోర్టు సమన్లు జారీ చేసింది.

### డిసెంబర్ 15న విచారణకు హాజరు కావాలని సంజయ్‌కి కోర్టు సమన్లు

బండి సంజయ్ ఎవరికీ భయపడే వ్యక్తి కాదు: బండి సంజయ్‌బండి సంజయ్ ఎవరికీ భయపడే వ్యక్తికాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కెటిఆర్ పరువు నష్టం దావాపై ఆయన స్పందించారు. మీ నాన్న పేరు చెప్పుకుని నువ్వు రాజకీయాలకు వచ్చావ్, మీ ప్రభుత్వం నా మీద 109 కేసులు బనాయించిందన్నారు. ఎన్నికేసులు పెట్టినా ధైర్యంగా కొట్లాడను కానీ, నీ లాగా పరువు నష్టం దావాలు వేయలదన్నారు.



బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్‌రావు

# 'సెప్టెంబరు 17' ముమ్మాటికి విమోచన దినోత్సవమే

## మాజీ గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** 'సెప్టెంబరు 17న విమోచన దినోత్స వం అని, రాష్ట్ర ప్రభుత్వాలు చరిత్రను వక్రీకరిస్తున్నందున పోరాటాన్ని భవిష్యత్తులోనూ కొనసాగించాల్సిన అవసరం ఉందని మాజీ గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్‌రావు అన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాస్కర్ యోగి రచించిన సెప్టెంబర్ 17 – ముమ్మాటికీ విమోచనే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. మహారాష్ట్ర మాజీ గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్ రావుతో పాటు రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు, శ్రీవర్ధన్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.హెచ్ విద్యాసాగర్ రావు మాట్లాడుతూ 1998లో సెప్టెంబరు 17 తెలంగాణ విమోచన దినోత్సవం కోసం ఉద్యమాన్ని ప్రారంభించుకున్నామని, భారతీయ జనతా పార్టీ నాయకులందరూ ఈ కార్యక్రమాన్ని ప్రాణప్రదంగా భావించాలని నిర్ణయించుకున్నామన్నారు. 1969లో తెలంగాణ ఉద్యమంలో అనేక మంది ప్రాణాలను కోల్పోయారు. ఆంధ్రప్రదేశ్‌తో కలిసిన తర్వాత కూడా సామాజిక విభేదాలు, అన్యాయాలు కొనసాగాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బలహీన వర్గాల, వివిధ కులాల యువతకు విద్య, అభివృద్ధి కోసం మార్గదర్శనం అవసరం అన్నారు. ఈ యువతకు సరైన దిశ నిర్దేశం ఇవ్వకపోతే, వారు సవాళ్లను ఎదుర్కోవడం కష్టంగా ఉంటుందని, ఈ నేపథ్యాన్ని పరిగణలోకి తీసుకొని, తెలంగాణ యువతకు స్పష్టమైన దిశ నిర్దేశం ఇవ్వడం, వారికి అవగాహన, సాధన అవకాశాలు అందించడం అత్యంత అవసరం అన్నారు. 17 సెప్టెంబర్ 17 అంటే కేవలం జెండా వందనం, మిలిటరీ పరేడ్, సెల్యూట్ చేయడం మాత్రమే కాదు. ఇది తెలంగాణ విమోచన, స్ఫూర్తి ప్రతీక అన్నారు. ఈ రాష్ట్రం మేము పోరాడి తెచ్చుకున్నాం, ఎవరో మనకు ఇచ్చింది కాదని యువతలోనూ ఈ భావన ఉండాలన్నారు. భాస్కర్ యోగి రాసిన 17 సెప్టెంబర్ ముమ్మాటికి విమోచనమే పుస్తకం ద్వారా, ఈ చరిత్ర, పోరాటం, అనేక అంశాలు స్పష్టంగా తెలిసిపోతాయన్నారు.

# అక్టోబరు 1 నుంచి రైల్వే రిజర్వేషన్‌లో మార్పు

## ఆధార్ ఆథెంటికేషన్ తప్పనిసరి

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** తాత్కలిక బుకింగ్ లోనే ఆధార్ అథెంటికేషన్‌ను అమలును సాధారణ టికెట్ల రిజర్వేషన్‌కు జత చేసింది. మొదటి 15 నిమిషాలు కేవలం ఆదార్ వెరిఫైడ్ యూజర్లు మాత్రం ఐఆర్ సిటిసి, అధికారిక యాప్‌ల్లో వీలుకల్పించింది. ఇవి అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్నట్లు సోమవారం రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఏదైనా రైలు ప్రస్తుతం 60 రోజుల ముందే టికెట్ రిజర్వేషన్ చేసుకునేందుకు సౌలభ్యం ఉం టుంది. అయితే తత్కాల్ టికెట్ల మాదిరిగానే బుకింగ్ ప్రారంభమైన వెంటనే అక్రమార్కులు సాఫ్ట్‌వేర్ సహా యంతో టికెట్లను బుక్ చేయడంతో ప్రయాణీకులు నష్టపోతున్నారని తెలిపింది. ఈ నేపథ్యంలోనే రిజర్వేషన్లు పక్కదారి పట్టకుండా సామాన్య యూ జర్ ప్రయోజనం చేకూరాలని నిర్ణయం తీసుకుం టున్నట్లు వెల్ల డిం చారు. కౌంటర్‌లో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేసింది.



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

# సాయుధ పోరాట వీరుల చరిత్రను పాఠ్య పుస్తకాలలో చేర్చాలి

## సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** తెలంగాణ సాయుద పోరాట వీరుల జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాలలో చేర్చాలని సిపిఐ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని అన్నారు. సోమవారం రోజున తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా మండలంలోని మహ్మదాపూర్ గ్రామంలో పార్టీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన చాడ వెంకటరెడ్డి అమర వీరుల స్తూపాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన అనభేరి ప్రభాకర్‌రావుతో పాటు 12 మంది అమర వీరులు మహ్మదాపూర్ గుట్టల్లో అమరులయ్యారని గుర్తు చేశారు. వారి జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాలలో చేర్చి భవిష్యత్ తరలాకు వారి చరిత్ర తెలిసే విధంగా చూడాలన్నారు. అంతే కాకుండా వారు ప్రాణ త్యాగం చేసిన స్థలాలలను స్మృతి వనాలుగా ఏర్పాటు చేయడంతో పాటు సెప్టెంబరు 17వ తేదీన తెలంగాణ వియోచన దినోత్సవంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. పార్టీ కరీనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, సిద్దిపేట జిల్లా సహా కార్యదర్శి గడిపె మల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు శంకర్, నాయకులు జాగిరి సత్యనారాయణ, జనగాం రాజ్‌కుమార్, పద్మ, వేల్పుల శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, అశోక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

# మిశ్రమ పంటల్లో 12వ స్థానంలో రాష్ట్రం

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త :** మిశ్రమ పంటల సాగులో దేశంలో తెలంగాణ 12వ స్థానంలో నిలిచింది. ఈ అంతర పంటల సాగులో బంగాల్, పంజాబ్, గుజరాత్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, అస్సాం, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల తర్వాత స్థానంలో తెలంగాణ ఉంది. ఈ మేరకు దీనికి సంబంధించి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ నివేదిక వెల్లడించింది. అంతర పంటలపై అంతగా ఆసక్తి లేకపోవడం, ప్రభుత్వపరంగా ఆశించినటువంటి స్థాయిలో ప్రోత్సాహం లేకపోవడం తదితర అంశాలు దీనికి కారణాలుగా తెలిపింది. కాగా ఒకే వ్యవసాయ క్షేత్రంలో ఏకకాలంలో రెండు, అంతకంటే ఎక్కువ పంటలను పండించే అంతర పంటల సాగు దేశంలో ఏటా విస్తరిస్తోందని నివేదిక స్పష్టం చేసింది. ప్రధాన పంటల మధ్య స్వల్పకాలిక పంటలను వేస్తున్నట్లుగా గుర్తించింది. కూరగాయలు, పండ్ల తోటల్లోనూ మిశ్రమ పంటలు సాగవుతున్నాయి. వరి పంట సాగు, ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న ప్పటికీ, మిశ్రమ పంటల సాగులో పురోగమించడం లేదని గుర్తిం చింది. రైతులు ప్రధాన పంటలు పండించేందుకే ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నట్లు పేర్కొంది.

# నేపాల్ తాత్కాలిక కేబినెట్‌లో ముగ్గురు మంత్రులు

**ఖాట్మండు, సెప్టెంబరు 15:** నేపాల్ తాత్కాలిక ప్రధాని సుశీల కర్కి తన కేబినెట్‌లో ముగ్గురు మంత్రులను తీసుకున్నారు. రాష్ట్రపతిభవన్‌లో వీరు ముగ్గురు చేత మం త్రులుగా ప్రమాణం చేయించారు. ఆర్థిక మంత్రిత్వ శాఖను రామేశ్వర్‌ప్రసాద్‌ఖానాల్ నిర్వహిస్తారని, ఇంధన మంత్రిత్వశాఖను అదే శాఖకు ఛైర్మన్‌గా వ్యవహరించిన కుల్మాన్‌ఘీసింగ్‌ను నియమించారు. ఇక ఓంప్రకాష్ ఆర్యల్‌ను హోం అంతర్గత వ్యవ హారాల శాఖ మంత్రిగా నియమించారు. మానవహక్కుల న్యాయవాదిగాను, ఖాఠ్మండు మేయర్‌కు సలహాదారుగాను పనిచేసారు. ప్రజాప్రయోజనాల కోసం అనేక న్యాయపోరాటలు కూడా నిర్వహించారు.

సుశీలాకర్కికి ప్రధాని పదవిలో పోటీగా వచ్చిన కుల్మాన్ ఘీషింగ్ ఇప్పటివరకూ అదే ఇంధనశాఖలో చీఫ్‌గా వ్యవహరించారు. స్వతహాగా ఇంజినీర్ అయిన ఘీషింగ్ లోడ్‌షెడ్డింగ్ నివారించడంలో విశేష కృషిచేసారు. ఇక ఆర్థికమంత్రిగా వచ్చిన ఖానాల్ దేశంలో ఆర్థికసంస్కరణలకు కీలక సూత్రాలను సిఫారసుచేసే స్థాయి సంఘ ప్యానెల్‌కు ఛైర్మన్‌గా కూడా వ్యవహ రించారు. ఇదిలా ఉండగా వచ్చే యేడాది మార్చి ఐదో తేదీన ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించారు. అంతేకాకుండా కర్కి బాధ్యతలు స్వీకరించిన 'జెంజి' ఆందోళనలో దెబ్బతిన్న ప్రభుత్వ భవనాల న్నింటినీ వెంటనే మరమ్మతులుచేసి యధాస్థితికి తీసుకు రావాలని ఆదేశించారు.

వీటిలోముందు ప్రధాని కార్యా లయం, నివాసం వంటి వాటితోపాటు మంత్రుల నివా సాలు, సుప్రీంకోర్టు భవనం, పార్లమెంటు భవనం వంటివి ఉన్నాయి. ఇక రాజకీయ పార్టీల నాయకుల ఇళ్లను కూడా ఆందోళన కారులు ధ్వంసం చేసారు. వీటిలో అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ నివాసం, మాజీ ప్రధాని కెపిశర్మ ఓలి నివాసాలుకూడా దగ్ధం అయ్యాయి. అనేక షాపింగ్ మాల్స్, హోటళ్లు, ఇతర వ్యాపారాలకకు అపారనష్టం కలిగించారు. నష్టం అంచనాలను అధికార యం త్రాంగం మదింపుచేస్తోంది.



# గొర్రెల పంపిణీ స్కాంలో ఎపి రైతులను విచారించిన ఇడి

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన గొర్రెల పంపిణీ స్కాంలో ఎపికి చెందిన రైతుల నుంచి కేంద్ర దర్యాప్తు సం స్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సోమవారం వాంగ్మూలం తీసుకుంది. ఈ స్కాంలో ఎపికి చెందిన 20 మంది రైతులకు ఈడీ అధికారులు నోటీసులు జారీ చేయడం తెలిసిందే. ఇందులో 15 మంది రైతులు సోమవారం నాడు బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి రాగా ఈ స్కాంపై వారి నుంచి ఈడీ అధికారులు కొన్ని ప్రశ్నలు అడిగి వివరాలు తీసుకున్నారు.

కాగా విచారణ అనంతరం రైతులు మీడియాతో మాట్లాడుతూ తమ వద్ద నుంచి గొర్రెలను కొనుగోలు చేసిన మొహియుద్దీన్, అతని అనుచరులు రెండు కోట్ల రూపాయలకు పైగా ముంచేసినట్లు తెలిపారు. దీనిపై గతంలో నే తాము గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు అన్ని ఆధారాలు ఇచ్చామని వారు తెలిపారు. ఈ కేసులో తమకు ఇప్పటికీ న్యాయం జరగలేదని వారు వాపోయారు. తమతో పాటు చాలా మంది రైతులను మొహియుద్దీన్, అతని అనుచరులు మోసం చేశారని వారు తెలిపారు.

సామాన్య రైతులమైన తమ విషయంలో సర్కారు వెంటనే స్పందించి ఆదుకోవాలని వారు కోరారు. ఈ కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని వారు కోరారు.

# విద్యాసంస్థ అంటే అదో జీవన వ్యవస్థ

## గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**నల్గొండ ప్రతినిధి, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** విద్యా సంస్థ అంటే కేవలం ఇటుకలు, నిర్మాణాలు కాదని, దార్శనికత, విలువలు శ్రేష్ఠత కోసం నిరంతర ప్రయత్నాల ద్వారా రూపొందించబడిన జీవన వ్యవస్థ అని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. సోమవారం నల్గొండ జిల్లా నార్కట్పల్లి మండలంలో ఉన్న మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ నాలుగో వార్షికోత్సవానికి హాజరై ఇండోర్ స్టేడియం వద్ద మొక్కలు నాటారు. అనంతరం 22 మందికి పిహెచ్‌డి అవార్డులను, 57 మందికి స్వర్ణపతకాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఛాన్స్‌లర్ అయిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మాట్లాడుతూ విద్యా రంగం, పరిశోధన, ఆవిష్కరణలు, సేవాకార్య కలాపాలలో అద్భుతమైన పురోగతి సాధిస్తున్న మహాత్మాగాంధీ విశ్వ విద్యాలయం గ్రామీణ వాతావరణంలో ఉంటూ తెలంగాణ అంతటా గ్రామాల నుండి ఎక్కువ మంది విద్యార్థులను ఆకర్షిస్తున్నదని అన్నారు. విద్యార్థుల హాజరును బలోపేతం చేయడం, హాస్టల్, క్యాంపస్ సౌకర్యాలను మెరుగుపరచడం, సమ్మిళిత అభ్యాస వాతావరణాన్ని పెంపొందించడంపై మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం విశ్వవిద్యాలయం చూపుతున్న దృష్టి లోతైన ప్రశంసలకు, గ్రామీణ యువతను ఉద్ధరిం చడం, సమాజంలో అర్థవంతమైన భాగ స్వామ్యం కోసం వారిని సిద్ధం చేయడంలో యూనివర్సిటీ పాత్ర నిజంగా ప్రశంసనీయమని కొనియాడారు. న్యాక్ అక్రెడిటేషన్ గుర్తింపులు యునివర్సిటీకి గౌరవాన్ని తీసుకురావడమే కాకుండా సంస్థ పెరుగుతున్న ప్రభావాన్ని కూడా ప్రతిబింబిస్తున్నదన్నారు. దేశం ఇప్పుడు ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించి ఐదు బిలియన్ డాలర్ల మైలురాయి వైపు క్రమంగా ముందుకు సాగుతోందని త్వరలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిం చడానికి సిద్ధంగా ఉందని అన్నారు. మహాత్మాగాంధీ విశ్వ విద్యాలయం వంటి విశ్వవిద్యాలయాలు సమ్మిళిత వృద్ధికి కీలకంగా మారుతుందని, గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో భారతదేశం ర్యాంక్ 2015లో 81వ స్థానంలో ఉండగా ఇటీవలి సంవత్సరాలలో 39వ స్థానానికి మెరుగుపడిందని గమనించడం సంతోషంగా ఉందని, ఈ పురోగతి పెరుగుతున్న ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను ప్రతిబింబి స్తుందన్నారు. ఎ.పి.జె. అబ్దుల్‌కలాం చెప్పినట్లుగా.. 'కలలు కనండి, కలలు ఆలోచనలుగా రూపాంతరం చెందుతాయి, ఆలోచనలు కార్యరూపం దాలుస్తా య'న్నారు. ప్రతి ఒక్కరు వీటిని పాటించాలని సూచించారు. హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ బిఎస్ మూర్తి మాట్లాడుతూ దేశంలోని ప్రతి విశ్వవిద్యాలయం పరిశోధనలను ప్రోత్సహించాలని ఇంజనీరింగ్ విభాగంలో చేయూతనివ్వాలని అన్నారు. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఖాజాఅల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి మాట్లాడారు. గవర్నర్ ఎడిసి భవానిప్రసాద్, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి దేవసేన, యూనివర్సిటీ అధ్యాపక బృందం తదితరులు కార్యక్రమానికి హాజరు కాగా, నల్గొండ ఎంపి కుందూరు రఘువీర్‌రెడ్డి గవర్నర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తదితరులు ఉన్నారు.



సోమవారం మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ నాలుగో వార్షికోత్సవంలో పాల్గొని అవార్డులను ప్రదానం చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

# ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌ను ఇష్టారీతిన మారుస్తున్న సర్కారు

## మాజీమంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, సెప్టెంబరు 15:** రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) కోసం అలైన్‌మెంట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టారీతిన మారుస్తోందని, రైతులు తమ భూములు కోల్పోకుండా నిలదీస్తామని బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ, మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. సంగారెడ్డి నియోజకవర్గం కొండాపూర్ మండలం గ్రామాల రైతులు సోమవారం హరీష్ రావును కలిశారు. ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ.. అలైన్‌మెంట్ మార్చి పేద రైతుల పొట్ట కొట్టడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ అనాలోచిత చర్యల వల్ల రైతులు భూములు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. సిఎం సొంత భూములకు మేలు కలిగేలా అలైన్‌మెంట్ మార్చడం దుర్మార్గం అని మండిపడ్డారు.

రైతుల ఆవేదన సిఎం రేవంత్‌రెడ్డికి అర్థం కావడం లేదా..? అని ప్రశ్నించారు. అలైన్‌మెంట్ మార్పుతో కేంద్రం ఆర్‌ఆర్‌ఆర్‌ను తిరస్కరించే పరిస్థితి ఉందని అన్నారు. రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌తో రేవంత్ రెడ్డి ఆడుతున్న ఆటలు పేద రైతులకు శాపంలా మారాయని మండిపడ్డారు.

ఉత్తర భాగాన అలైన్‌మెంట్ మార్పు వల్ల సంగారెడ్డి నియోజకవర్గం కొండాపూర్ మండలంలోని గిరిమాపూర్, తుమ్మరపల్లి, అలియాబాద్, మారేపల్లి, రాంపూర్ తాండ, గోటిలగుట్ట తండా,మాచేపల్లి తండా, శివన్న గూడెం, గంగారం గ్రామాలు తీవ్రంగా నష్టపోతున్నాయని తెలిపారు.

ఈ గ్రామాల్లో ఎక్కువగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, రైతులే ఉన్నారని, అలైన్‌మెంటు మార్పుతో పేద బడుగు బలహీనవర్గాలకు చెందిన రైతులే తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు.

రైతులు భూములు కోల్పోకుండా మొదటగా ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను బిఆర్‌ఎస్ ప్రభుత్వం గిర్మాపూర్ చేవెళ్ల మీదుగా ప్రతిపాదించిందని, కానీ రేవంత్ రెడ్డి మాత్రం తన స్వలాభం కోసం వికారాబాద్, పరిగి, కొడంగల్ మీదుగా ట్రిపుల్ ఆర్ మార్గాన్ని అష్టవంకరలుగా తిప్పుతూ పచ్చటి పొలాలను మాయం చేసే కుట్రకు తెరలేపారని ఆరోపించారు.

# రాష్ట్రానికి అదనంగా 40 వేల టన్నుల యూరియా

## వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** రాష్ట్ర రైతుల అవసరాల మేరకు ఇప్పటికే కేటాయించిన యూరియా కంటే అదనంగా మరో 40 వేల టన్నులను సరఫరా చేసేందుకు కేంద్రం ఉత్తర్వులు జారీ చేసిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఈ మేరక ఢిల్లీలోని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ కార్యదర్శి రజత్ కుమార్ మిశ్రాను కలిసి యూరియా కొరతపై వివరించినట్లు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో సాగులో ఉన్న వరి, మొక్కజొన్న, పత్తి వంటి ప్రధాన పంటలకు యూరియా అత్యవసరమని తెలిపామన్నారు. ముఖ్యంగా ఈ పదిహేను రోజులు వ్యవసాయ సీజన్‌లో కీలకమైనవని, ఈ సమయంలో రైతులకు ఎరువులు అందుబాటులో లేకపోతే పంటలు తీవ్రంగా దెబ్బతింటాయి చెప్పారు. అందు వల్ల యూరియా సరఫరా నిరంతరంగా కొనసాగేలా చూడాలని కేంద్రాన్ని కోరినట్లు వెల్లడించారు. అలాగే అంతకు ముందు నెలల్లో ఏర్పడిన యూరియా లోటును పూడ్చే విధంగా ఈ నెలలో 2 లక్షల టన్నుల యూరియా సరఫరా చేయాలని కోరామన్నారు. రానున్న 10 రోజుల్లో మరో లక్ష టన్నుల యూరియాను సరఫరా చేయాలని అడగ్గా, ఈ వారంలో 80 వేల టన్నులను సరఫరా చేస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని తెలిపారు. అందులో భాగంగానే 40 వేల టన్నులు కేటాయిస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేసిందని చెప్పారు. దీంతో ఈ నెల మొదటి 15 రోజులలోనే 1,04,000 టన్నుల యూరియాను రాష్ట్రానికి సరఫరా చేసినట్లు అవుతుందని వివరించారు. మిగతా మొత్తం కూడా పంపించడానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారన్నారు.

# కోర్టు ఆవరణలోనే ట్రిపుల్ తలాక్

## భర్త, మామను చెప్పుతో కొట్టిన మహిళ



**లక్నో, సెప్టెంబరు 15:** ఉత్తరప్రదేశ్‌లో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. కోర్టు బయట భర్తను ఓ మహిళ చెప్పుతో చితకబాదింది. భరణం కేసు విచారణకు హాజరైన ఆమెకు భర్త కోర్టు బయటే మూడుసార్లు తలాక్ చెప్పాడు. అనంతరం దాడికి పాల్పడ్డాడు. దీంతో ఆగ్రహించిన బాధితురాలు ఆత్మరక్షణ కోసం భర్తపై చెప్పుతో దాడి చేసింది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. బాధితురాలి వివరాల ప్రకారం '2018లో వివాహం జరిగింది. పెళ్లైనప్పటి నుంచి భర్త కొట్టేవాడని. అదనపు కట్నం కోసం వేధించడం మొదలు పెట్టాడని వాపోయింది. నాకు ఇద్దరు కుమార్తెలు జన్మించారు. వారు పుట్టాక నన్ను ఇంట్లో నుంచి వెళ్లగొట్టాడు. అప్పుడు కోర్టు సాయం కోరడం తప్ప నాకు వేరే మార్గం లేదు. భరణం కోసం కేసు పెట్టాను. ఆర్థిక సాయం కోరుతూ దావా వేశా. దీంతో పిల్లలను నా దగ్గర నుంచి బలవంతంగా లాక్కెళ్లిపోయాడు' అని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. ఇక ఈ కేసుపై రాంపూర్ కోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. ఈ విచారణకు బాధితురాలు తన అత్తతో కలిసి హాజరుకాగా, ఆమె భర్త తన తండ్రితో కలిసి కోర్టుకు వచ్చాడు. విచారణ అనంతరం బాధితురాలు కోర్టు నుంచి బయటకు వచ్చింది. అదే సమయంలో భర్త, ఆమె మామ ఇద్దరూ బాధితురాలిని వెంబడించి దుర్భాషలాడారు. కేసును ఉపసంహరించుకోవాలని ఒత్తిడి చేశారు. దీనికి ఆమె నిరాకరించడంతో, మామ ప్రోద్బలంతో భర్త అక్కడికక్కడే మూడుసార్లు 'తలాక్..' చెప్పి ఆమెపై దాడికి దిగినట్టు బాధితురాలు వివరించింది. ఈ క్రమంలో ఆత్మరక్షణ కోసం చెప్పుతో భర్తపై దాడి చేసినట్లు తెలిపింది. 'నాకు వేరే మార్గం కనిపించలేదు. మొదట వాళ్లే నన్ను కొట్టారు. అందుకే ఆత్మరక్షణ కోసం వారిపై చేయి చేసుకోవాల్సి వచ్చింది. నా భర్త, మామను వెంటాడి చెప్పుతో కొట్టాను. నా పిల్లలను దూరం చేశారు. నా జీవితాన్ని నాశనం చేశారు. ఇప్పుడు తలాక్ చెప్పి నాపై దాడి చేశాడు. నేను ఎలా సహిస్తాను నాకు న్యాయం కావాలి. నా ఇద్దరు కూతుళ్లను నాకు అప్పగించాలి. వారికి భరణంతో పాటు మేం అదే ఇంట్లో నివసించే హక్కు కల్పించాలి. నిందితులకు కఠిన శిక్ష పడాలి' అని ఆమె డిమాండ్ చేశారు. ఈ ఘటనతో కోర్టు ఆవరణలో కాస్త గందరగోళం నెలకొంది.

# కవితతో జూబ్లీహిల్స్ అభ్యర్థి విష్ణువర్ధన్‌రెడ్డి భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 15:** జూబ్లీహిల్ ఉప ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యే కవిత తరఫున అభ్యర్థిని బరిలోకి దించే అవకాశం ఉంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి సోమవారం సమావేశ మయ్యారు. ఇద్దరు మధ్య దాదాపుగా అరగంటకు పైగా మంతనాలు సాగాయి. ఉపఎన్నికలో విష్ణును పోటీకి దించే యోచనలో కల్వకుంట్ల కవిత ఉన్నట్టు సమాచారం. ఈ భేటీ అనంతరం విష్ణువర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ఇది కేవలం మర్యాదపూర్వక భేటీ మాత్రమేనని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయంలో జరిగే దసరా వేడుకలకు కవితను ఆహ్వానించడానికే తాను కలిశానని, దీనికి రాజకీయాలు ఆపాదించవద్దని ఆయన కోరారు. బీఆర్‌ఎస్ నుంచి బహిష్కరణకు గురైన తర్వాత తనకంటూ ప్రత్యేక రాజకీయ వేదికను ఏర్పాటు చేసుకునే పనిలో కవిత నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ఈ ఏడాది బతుకమ్మ పండుగ సందర్భంగా ఆమె తన కొత్త పార్టీ పేరును ప్రకటించే అవకాశాలు ఉన్నాయని కూడా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే తన రాజకీయ భవిష్యత్తుకు తొలి అడుగుగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికను ఆమె ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. బిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా దివంగత ఎంఎల్‌ఎ మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత పేరును దాదాపు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. తెలంగాణ భవన్‌లో ఇటీవల జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియో జకవర్గంలోని బిఆర్‌ఎస్ కార్యకర్తలతో కెటిఆర్ సమావేశమైన సందర్భంగా సునీత పేరును ఫైనల్ చేసినట్లు సమాచారం.

## సైబర్‌క్రైం బాధితులకు లోక్‌అదాలత్ ద్వారా

# 12.8 కోట్ల నగదు అప్పగింత

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సైబర్‌క్రైం బాధితులకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) లోక్‌అదాలత్ ద్వారా మూడవ త్రై మాసికానికి సంబంధించి రూ. 12.94 కోట్లను అందజేసింది. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో ఈ నగదు అప్పగింత కార్యక్రమం జరిగింది. ఈ మేరకు టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ ఒక ప్రకటన విడుదల చేశారు. మొత్తం 4539 మంది బాధితులకు ఈ నగదు అప్పగించినట్లు ఆమె తెలిపారు. అంతకు ముందు 2501 మందికి లోక్ అదాలత్‌తో సంబంధం లేకుండా రూ. 27.91 కోట్లను అందించామని దీంతో 7040 మంది బాధితులకు రూ. 40.86 కోట్లు అందిందని ఆమె తెలిపారు. ఈ ఏ డాది ఇప్పటి వరకు మొత్తం 18,872 మంది బాధితులకు 138.04 కోట్ల రూపాయలను అందించామని శిఖాగోయల్ తెలిపారు. ఇందులో సైబ రాబాద్‌లో 1937 కేసులకుగానూ 11.51 కోట్ల రూపాయలు, హైదరాబాద్‌లో 941 కేసులకుగానూ 9.29 కోట్ల రూపాయలు, రాచకొండలో 1061 కేసులకుగానూ 6.41 కోట్ల రూపాయలు, సంగారెడ్డిలో 266 కేసులకుగానూ 1.04 కోట్ల రూపాయలు బాధితులకు అందించినట్లు ఆమె వెల్లడించా రు. 2024 మార్చి నుంచి ఇప్పటివరకు 36,786 మంది బాధితులకు 321 కోట్ల రూపాయలను అందించామని, ఈ డబ్బంతా సైబర్‌నేరగాళ్ల బ్యాంకు ఖాతాల నుంచి జప్తు చేసినవని శిఖా గోయల్ వివరించారు. సైబర్ నేరాలపై బాధితులు వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు.




# కరీంనగర్‌లో పాస్‌పోర్ట్ కేంద్రం అప్‌గ్రేడ్

## సామాన్యులకు చేరువలో పాస్‌పోర్టు సేవలు

## కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

**కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:** ఒకప్పుడు పాస్ పోర్ట్ పొందాలంటే నెలల సమయం పట్టేది,బ్రోకర్లకు పెసలు ఇవ్వాల్సి వచ్చేది ఇప్పుడు ఆ సమస్య లేదనీ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.తెలంగాణలో 5 పాస్ పోర్టు సేవా కేంద్రాలుంటే అందులో కరీంనగర్ ఉందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో 2014లో కరీంనగర్ పాస్ పోర్టు సేవా కేంద్రం నుండి సేవలు ప్రారంభమైనట్లు తెలిపారు.పెరుగుతున్న డిమాండ్,అవసరాలను ద్రుష్టిలో పెట్టుకుని 2022లో పూర్తిస్థాయి పాస్‌పోర్ట్ సేవా కేంద్రంగా అభివృద్ధి చేసుకున్నమని వివరించారు.ఆదివారం వరకు ఉన్న భవనంలో కొన్ని ఇబ్బందులు ఉండేవన్నారు.పరిమితమైన సౌకర్యాలు మాత్రమే ఉండేవన్నారు.పాస్ పోర్టు సేవలకోసం వచ్చే ప్రజలు కొంత ఇబ్బందిగా ఫీలయ్యేవారు,వాటిని ద్రుష్టిలో ఉంచుకుని ఇప్పుడు 7 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న కరీంనగర్ ఫార్చ్యూన్ మాల్‌లో పాస్ పోర్టు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు.ఇకపై ప్రజలకు,ఇక్కడి స్టాఫ్ కు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు.కొత్త భవనంలో విస్తారమైన వెయిటింగ్ హాలు ఉందన్నారు.చిన్నపిల్లల సంరక్షణ గది,పార్కింగ్ సౌకర్యం,వీల్‌చైర్ వంటి అనేక సౌకర్యాలు ఉన్నయన్నారు.కరీంనగర్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఇప్పటికే ప్రతిరోజు సగటున 230 శ్లాట్లను నిర్వహిస్తోందన్నారు. ఈ సంఖ్యను 500 కు పెంచేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ కొత్త భవనం ద్వారా మరింత సామర్థంతో పని చేసి, విద్య, ఉపాధి, వ్యాపారం లేదా వ్యక్తిగత కారణాల కోసం విదేశాలకు వెళ్లదలచిన యువతకు, వృత్తి, వ్యాపారుల ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందించే అవకాశం ఏర్పడిందన్నారు. కరీంనగర్ మధ్యలో ఉండటం వల్ల తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలకు ఇక్కడికి చేరుకోవడం సులభం అవుతుందన్నారు.భవిష్యత్తులో పాస్‌పోర్ట్ సేవల ప్రధాన కేంద్రంగా కరీంనగర్ మారే అవకాశాలున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థలమిస్తే పర్మినెంట్ బిల్డింగ్ కట్టించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.తెలంగాణ రీజనల్ పాస్‌పోర్టు అధికారి జొన్నలగడ్డ స్నేహజను ఆయన అభినందించారు. అనంతరం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తూపాస్ పోర్ట్ సేవ కేంద్రం అప్రెడేషన్ చేయడం సంతోషకరమన్నారు. కరీంనగర్ పాస్ పోర్ట్ కేంద్రం రాష్ట్రంలో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇప్పుడున్న 250 స్లాట్స్ ను,500 స్లాట్స్ చేయాలని బండి సంజయ్ కి విజ్ఞప్తి చేశానన్నారు.

వార్త


ప్రతి మనిషి ఎంతో గొప్పవాడైనప్పటికీ, అతని మెదడుకున్న శక్తిలో శతకోటి భాగం కూడా తన జీవితకాలంలో ఉపయోగించుకోలేడనేది యథార్థం.

- ఎన్.డుబినిన్

# 'కుండపోత' కష్టాలు!

వాతావరణంలో తలెత్తుతున్న అనూహ్యమార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారితీస్తున్నాయి. అపార నష్టం కలిగిస్తున్నాయి. వర్షాల గూర్చి కొంతమేరకు వాతావరణ పరిశోధన శాస్త్రజ్ఞుల అంచనాలకు అందుతున్నా ఎక్కడ, ఎప్పుడు కుంభవృష్టి కురుస్తుందో కచ్చితమైన, స్పష్టమైన సమాచారం అందివ్వలేకపోతున్నది. దేశంలో అనేక చోట్ల ఈ వర్షాల కుంభవృష్టితో వరదలు ఉధృతమై అపార నష్టం కలిగిస్తున్నాయి. తెలంగాణలోని మొన్న నిజామాబాద్, నిన్న కామారెడ్డి ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో కురిసిన కుంభవృష్టి రోడ్లు జలాశయాలుగా మారిపోయాయి. ఏకబిగువన కురిసిన వర్షంతో నగరవాసులు అతలాకుతలమయ్యారు. ఇద్దరు నాలాల్లో కొట్టుకుపోయారు. ఇక లోతట్టు కాలనీలో ఇళ్లల్లోకి నీరువచ్చింది. ఒక్క తెలంగాణలోనే కాదు అటు ఆంధ్రప్రదేశ్, ఆమాట కొస్తే దేశంలోని అనేక ప్రాంతాలు అ కుంభవృష్టి వర్షాలకు విలవిల్లాడుతున్నాయి. లక్షలాది ఎకరాల పంట నష్టం జరుగుతున్నది. వాతావరణంలో తలెత్తుతున్న ఈ మార్పుల కారణంగా రుతుపవనాల గమనం వర్షపాత విషయంలో భారత వాతావరణ విభాగం కచ్చితమైన అంచనాలు నేటికీ వేయలేకపోతున్నది. యేడాదియేడాదికి ఈ వరదల విపత్తులు పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే అంశం. ఇందుకు ప్రధానంగా తప్పుపట్టాల్సింది, నిందించాల్సింది మానవుడినే. మానవుడి పర్యావరణ విధ్వంస చర్యలే ఈ బీభత్సానికి, విపత్తులకు కారణమవుతున్నాయని ఎన్నో అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతే మానవుడి మనుగడే భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రేమికులు దశాబ్దాల తరబడి పదే పదే ఆందోళన వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండాపోతున్నాడు. పర్యావరణాన్ని కాపాడడంఅటుంచి తూట్లు పొడవడం దురదృష్టకరం. అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు పర్యావరణానికి చేటు తెస్తున్నాయి. ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాల నుంచి మొదలుపెడితే కొండలను తొలచి ప్రాజెక్టులు రహదారుల నిర్మాణాలు నగరీకరణ పేరుతో ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది ఎకరాల పంట భూమిని అరణ్యాల్లో జనవాసాలుగా మార్చడం ఒకటేమిటి ఎన్ని విధాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగుతారో అన్ని మార్గాల్లో నిత్యం అన్వేషణ జరుగుతున్నది. ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం మరో పది, పదిహేనేళ్లలో భారత జనాభా దాదాపు 150 కోట్లకు చేరుకుంటుందని అందుకు తగినట్లుగా దేశంలో సహజవనరులపై ఒత్తిడి పెరుగుతుందని ప్రధానంగా అటవీ సంపద వేగంగా తరిగిపోతుందని స్పష్టం చేసింది. భారత్‌లో రోజుకు దాదాపు మూడువందల ముప్ఫైఎకరాలకుపైగా అటవీ భూమి అదృశ్యమైపోతుందని ఎన్నో నివేదికలు ఘోషిస్తున్నాయి. బొగ్గగనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు,పరిశ్రమలు నదీలోయ ప్రాజెక్టుల కోసం యథేచ్ఛగా అడవులను నరికివేస్తున్నారు. ఇలాంటి కారణాలు ఎన్నో పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి. ప్లాస్టిక్‌వాడకాన్ని నియంత్రించలేకపోతున్నారు.అందువల్ల పర్యావరణానికి జరుగుతున్న నష్టం అంతా ఇంతా కాదు. ఒక్క ప్లాస్టిక్ సంచి మట్టిలో కలిసిపోడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుంది. కొన్ని ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినా అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. పెట్రోలు, డీజిల్ లాంటి ఇంధనాల వాడకం గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వాహన కాలుష్యం నియంత్రణ మాటలకే పరిమితమవుతున్నది.పెరుగుతున్న వాహనాల సంఖ్యకు రెట్టింపుస్థాయిలో వాహన కాలుష్యంతోపాటు పరిశ్రమలు వదులుతున్నపొగ అన్నీకలిపివాయు కాలుష్యాన్ని పెంచుతున్నాయి. ఇలాంటి రకరకాల కారణాలతో భూమిలో ఉష్ణోగ్రత పెరిగిపోక తప్పదు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉష్ణోగ్రతపెరిగి ప్రపంచంలోని తీర ప్రాంతాలు, దీవులతోసహా అనేక దేశాలు ముంపునకుగురయ్యే ప్రమాదం ఉందని ఏనాడో పర్యావరణవేత్తలు హెచ్చరించారు. ఇలా ప్రకృతితో మనిషి ఆటలాడుకుంటుంటే అందుకు ప్రతీగాప్రకృతి తీవ్రంగానే స్పందిస్తున్నది. పర్యావరణం దెబ్బతిన్న కారణంగా సకాలంలో వర్షాలు కురవకపోవడం, కురిస్తే ఒకేసారి ఒకే ప్రాంతంలో కుంభవృష్టి కురవడం ఇటీవలకాలంలో పెరిగిపోతున్నది. వీటితోపాటు వరదలు, తుఫాన్లతోపాటు భూకంపాలు లాంటి ఉపద్రవాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. యేటా దాదాపు 380కిపైగా ప్రపంచవ్యాప్తంగా ఉపద్రవాలు సంభవిస్తున్నట్లు అధికార రికార్డులే వెల్ల డిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా యేటా లక్షలాదిమంది ఈ ఉపద్రవాలతో ప్రాణాలు వదులుతుంటే కోట్ల సంఖ్యలో బాధితులుగా మారుతున్నారు. మరెందరో రోగపీడితు లు అవుతున్నారు. ఇక ఆస్తుల నష్టం గురించి చెప్పాల్సిన పనిలేదు. అయితే పాలకులు తీసుకుంటున్న ముందు జాగ్రత్తల చర్యలవలన ప్రాణ,ఆస్తులనష్టం కొంత వరకు నియంత్రించగలుగుతున్నారు. కానీ పర్యావరణం సమతు ల్యం దెబ్బతిన్న కారణంగా ప్రకృతి విజృంభణకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. సాంకేతికంగా ఎంత పరిజ్ఞానం సంపాదించినా, ఎంత పురోభివృద్ధివైపు పయనించినా ప్రకృతిముందు తలవంచని పరిస్థితుల నుండిమానవుడు బయటపడలేకపోతున్నాడు. తెలుగురాష్ట్రాల్లో గత రెండు,మూడు నెలలుగా కురుస్తున్న కుంభవృష్టి వర్షాలతో వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. వ్యవసాయ రంగానికి జరిగిన నష్టం లక్షల,కోట్లలో ఉండొచ్చు. ఏదిఏమైనా వీటన్నింటికి మూలకారణమైన ప్రకృతి సృష్టించే ఉపద్రవాలను నియంత్రించేందుకు పర్యావరణాన్ని కాపాడుకునేందుకు త్రికరణశుద్ధిగా కృషిచేయాల్సినతరుణమిది. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా భవిష్యత్‌లో ప్రళయాలు తప్పవు. భారీ మూల్యం చెల్లించక తప్పదు.

ప్రతిభావంతుడు సముద్రపు గట్టులాంటివాడు. అలలవంటి సమస్యలకు వెనుతిరిగిపోడు.



టి. ఎడిసన్

శారీరక సామర్థ్యం ద్వారా మనకు బలం రాదు. అణచిపెట్టలేనంతటి ఆత్మబలం ద్వారానే అది లభిస్తుంది.



మహాత్మా గాంధీ

## ప్రజావాక్కు



### చెరువుల పట్ల నిర్లక్ష్యం వద్దు

నీరే మనుగడకు ప్రాణాధారం. ప్రతి చుక్క అమూల్యం. అటువంటి చెరువులను పూడ్చి వేస్తూ ప్రమాదకరమైన స్థలంలోఇల్లు నిర్మించడం ప్రమాదకరమని తెలిసిన ప్రభుత్వం వాటిపై చర్యలు తీసుకోకపోవడం. పేద ప్రజలకు అటువంటి స్థలాలపై అవగాహన లేక అక్కడే నివాసం ఉండటం వర్షాకాలంలో ఆ ఊర్లు నీటమునిగి ఎన్నో విపత్తులకు గురవ్వడం,ఆస్తినష్టం,ప్రాణనష్టం జరుగుతుంది. తరిగిపోతున్నచెరువులను రక్షించడం మనందరి బాధ్యత. ఇప్పటికైనా వరదల్లో ఊర్లు కొట్టుకుపోకుండా ప్రభుత్వం దృష్టిసారించి వెంటనే చర్యలు చేపట్టి చెరువులను పూడిక తీసి రానున్నతరాలకు వారసత్వ సంపదగా అందించాలి.

- కాల్వ నిఖిత, సిద్ధిపేట

### గ్రూప్ 1 మెయిన్స్ రద్దు చేయాలి

**తెలంగాణ** రాష్ట్రప్రభుత్వం గ్రూప్ 1మెయిన్స్‌ను రద్దుచేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని నిరుద్యోగ అభ్యర్థులు ఆందోళన చేస్తూ అదే విధంగా జీవో 29 రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.నిరుద్యోగ అభ్యర్థులు వేసిన పిటిషన్‌కు మెయిన్స్‌లోఅవకతవకలు జరిగాయి అని ఏకంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. గ్రూప్ 1 మెయిన్స్ పై అనేక సందేహాలు ఉన్నాయి వీటి అన్నింటికి పరిష్కారం ఒక్కటే గ్రూప్1మెయిన్స్‌ను రద్దుచేయడమే అంటూ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు నిరుద్యోలు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలి. సంబంధించిన టీజీపీఎస్‌సీఅధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల జారీ చేస్తూ ముందు ముందు జరిగే పోటీ పరీక్షలనుఛాలెంజ్‌గాతీసుకుని సమర్థవంతంగా నిర్వహించాలి.

- మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### ఆర్థిక సహాయం కల్పించాలి

**విజ్ఞాన** శాస్త్రాన్ని కేవలం వారి చదువులో భాగంగా పరిశోధన చేస్తూ ఒక దృక్పథంతో చేపట్టిన ప్రయోగ ఫలితాలు మనిషి జీవనానికి, ప్రాణ రక్షణకు, సౌలభ్యానికి తోడ్పడే మహానుభావుల త్యాగం అమూల్యం, చిరస్మరణీయం.వాటి ఫలితాలుఅనుభవించడం చాలాతేలిక. కావున అటువంటి ఆశయాన్ని, కృషిని గుర్తిస్తూ ఉన్నత విద్యావంతులు ఉద్యోగంతోపాటు ముందుకు సాగేందుకు కృషి చేస్తే మరిన్నిరంగాల్లో సమస్యలు పరిష్కారం అవ్వొచ్చు.

- బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

### రాసిపెట్టి ఉంటుంది

**తాము** అమిత బలవంతులమని, దైవ భక్తులమని తమను ఎవరూ ఏమీ చేయలేరని విర్రవీగి ఎన్నో అకృత్యాలకి పాల్పడి తమ చావుని తామే కొని తెచ్చుకున్నారు పురాణకాలంలోని రాక్షసులు. చరిత్రలో కూడా కొందరు రాజులు. చక్రవర్తులు ఇదే విధంగా కండకావరంతో కన్నుమిన్ను కానరాకుండా ప్రవర్తించి చివరికి మట్టిలో కలిసిపోయారు. మరికొందరు రాజ్యాలను పోగొట్టుకుని అడవులపాలయ్యారు.ఇలాంటి వారి కథలను విని కూడా ఏలికలకు బుద్ధిరావడం లేదు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైరిపక్షాల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇష్టానుసారం ప్రవర్తిస్తున్నారు. నోటికొచ్చిన తిట్లు తిడుతున్నారు. చులకనగా చూస్తు అవమానిస్తున్నారు. అహంకారం, గర్వం వంటివి ప్రదర్శించడంలో నాటి రాక్షసులకి, రాజులకి తామేమి తీసిపోమని నిరూపిస్తున్నారు.

-మిథునం, హైదరాబాద్

### ఆటుపోట్ల జీవితం ఆస్వాదిస్తే ఉత్తమం

**అతల** వితలసుతలాది పద్నాలుగు లోకాలలో భూలోకం అత్యుత్తమమైనది. ఈ భూలోకంలో భారతఖండం ఇంకా ఉత్కృష్టమైనది. ఇక్కడ మానవుడిగా పుట్టడం ఎన్నో జన్మల పుణ్యఫలమంటారు. ఎందుకంటే ఇది ఖర్మభూమి. ఎందరో దేవతలు కొలువై సులభంగా మోక్షంఇచ్చే భూమి.ఎన్నో ప్రకృతి వనరుల కాలవాలమైన భూమి. ఐనప్పటికీ ఈ భూమిలో పుట్టిన ప్రతి మనిషికి పోరాటం తప్పదు.కష్టసుఖాలు వెలుగు నీడల్లా వెంటాడుతూనేఉంటాయి.బతికినంతకాలం జీవితం చాలా విలువైనది. ఎప్పటికప్పుడు కొత్తపాఠాలు నేర్పుతూనే ఉంటుంది. కష్టాన్ని కూడాఇష్టంగా స్వీకరిస్తే ప్రతిరోజు జీవితం కొత్తగానే ఉంటుంది.

-డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

### కాలమే సమాధానం చెబుతుంది

నేపాల్‌లో, బంగ్లాలో, శ్రీలంకలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన ప్రజలు ప్రధాని రాజీనామా దాకా తీసుకొచ్చారు. నిప్పు లేనిదే పొగ రాదు అన్నట్టు ప్రభుత్వం అనుసరించిన అవినీతి విధానాలు ఒకవైపు వలసీకరణ ఒకవైపు, విద్యార్థుల ఉద్యమం ఒకవైపు,ఈ జెన్‌జెడ్ ఉద్యమాన్ని ఫలవంతం చేసాయి. నేపాల్ కూడా వాటి లాగే చైనా వలలో చిక్కుకుపోయి ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం చేసుకుంటుందా లేదా సర్వ సంక్షేమ రాజ్యాంగ వ్యవహరిస్తూ ఆర్థిక స్థిరత్వము సాగిస్తూ ముందుకు వెళుతుందా కాలమే సమాధానం చెప్పాలి.

-భారత అవినాష్, జనగామ

**మనవి** ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రధానులు మారడం సంక్షోభ పరిష్కారమేనా!

**నిర్దిష్టమైన లక్ష్యంలేని ఏ ఉద్యమం కూడా దేశ ప్రజలు ఎదుర్కొంటున్న ఏ ఒక్క మౌలిక సమస్య పరిష్కరించలేదు. ఒక వ్యక్తిస్థానంలో మరొక వ్యక్తిని అధికారంలో కూర్చోబెట్టటానికే పరిమితం అవుతుంది. శ్రీలంకలో జరిగింది అదే. నేపాల్ యువతదేశ ప్రధాన సమస్యలైన పేదలకు భూపంపిణీ, సంపద జాతీయకరణ, పారిశ్రామిక అభివృద్ధి, నిరుద్యోగ సమస్య పరిష్కారం వంటి సమస్య పరిష్కారం వెడల అవగాహన లేదు. వారి ఉద్యమంలో ఈ అవగాహన వ్యక్తం కాలేదు. పాలకుల వెడల అసంతృప్తిని మాత్రమే వ్యక్తం చేసింది. మౌలిక సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం కొనసాగకుండానే ఉద్యమం ఆగిపోవటానికి అదే కారణం. సుశీలకర్కిని ప్రధానిగా నియమించటం ద్వారా ఎటువంటి మార్పు జరగదు.**

బొల్లిముంతసాంబశివరావు

నేపాల్లో యువత తిరుగుబాటుతో తీవ్రసంక్షోభం ఏర్పడింది. ప్రధాని కెపి ఓలీ శర్మ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ప్రదర్శనలు పెద్దఎత్తున సాగాయి. మంత్రుల ఇళ్లపై దాడులు జరిగాయి. ప్రభుత్వ భవనాలకు నిప్పు అంటించారు. హోంమంత్రితోసహా అనేక మంత్రులు రాజీనామా చేశారు. మిలటరీ కాల్పుల్లో 39 మంది చనిపోగా వందలాది మంది గాయపడ్డారు. చివరికి ప్రధానమంత్రి శర్మ రాజీనామా ప్రకటించాడు. యువత తిరగబడితే జరిగే పరిణామాలకు నేపాల్ మరో ఉదాహరణ. యువత తిరుగుబాటుకు సోషల్ మీడియాపై నిషేధం ప్రధానకారణంగా చెప్పటం వాస్తవ పరిస్థితులను మరుగుపర్చటమేఅవుతుంది. సుదీర్ఘకాలం దేశంలో రాజరిక పరిపాలన సాగింది. దాని ఫలితంగా పేదరికం, నిరుద్యోగం పెరుగుతూవచ్చింది. రాజరికానికి వ్యతిరేకంగా నేపాల్ మావోయిస్టు పార్టీ పదేళ్లపాటు సాయుధ తిరుగుబాటు నడిపింది. ప్రభుత్వం, మావోయిస్టు పార్టీ ఒప్పందంలో భాగంగా నేపాల్లో ఎన్నికలు జరిగాయి. పెద్ద పార్టీగా మావోయిస్టు పార్టీ ఏర్పడింది. ఇతర పార్టీలతో కలసి ఆపార్టీ అధినేత ప్రచండనాయకత్వాన ప్రభుత్వం ఏర్పడింది. కొద్దికాలానికే ప్రభుత్వ భాగస్వాముల మధ్య విభేదాలు ఏర్పడి ప్రచండ రాజీనామా చేశాడు. ఆయన రాజీనామా తర్వాత కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ నేపాల్ (యూనిఫైడ్ సోషలిస్టు) మాధవకుమారే నేపాల్ ప్రధానిగా సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు జరిగింది. ఇంకా ఝలానాథ్ఖనాల్, బాబురామ్ భట్టారామ్, సుశీల్కోయిరాలా, కెపి ఓలీ శర్మ, షేర్ బహదూర్దేవుబా ప్రధానులు అయ్యారు. ప్రచండ మూడవసారి 2022-2024 వరకు ప్రధానిగా ఉన్నాడు. తర్వాత మరలా కెపిఓలీశర్మ (కమ్యూనిస్టుపార్టీఆఫ్ నేపాల్) (సిపిఎన్) ప్రధాని అయ్యారు. నేటియువత ఆందోళనతో రాజీనామా చేశాడు. పదిసంవత్సరాలు సాయుధపోరాటం చేసిన ప్రచండ మార్క్సిజానికి, లెనినిజం, మావో ఆలోచనా విధానాలకు తిలోదకాలు ఇచ్చి భూర్జువా పార్టీలతో పొత్తు ద్వారా అధికారం చేపట్టాడు. కెపిశర్మ కూడా మార్క్సిజాన్ని జపిస్తూ ఇతరపార్టీలతో కలసి మూడుసార్లు ప్రధానిగా ప్రభుత్వాలు ఏర్పాటు చేశాడు. భూర్జువా ప్రభుత్వాల మాదిరిగానే, ప్రచండ, కెపిశర్మ ప్రభుత్వాల్లో కూడా తీవ్రమైన అవినీతి పెరగటమేకాకుండా, పేదరికం, నిరుద్యోగం కూడా బాగా పెరిగింది. నేపాల్ ప్రధానంగా వ్యవసాయదేశం. నూటికి 66 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. 20శాతం భూమి మాత్రమేవ్యవసాయయోగ్యంగా ఉంది. వ్యవసాయం ద్వారా 70లభిస్తున్నది. గ్రామీణ ప్రజల్లో 28శాతం పేదరికంలో ఉన్నారు.జిడిపిలోమూడింట ఒక వంతు వ్యవసాయం నుండి వస్తుంది. దేశ జనాభాలో 7శాతంగా ఉన్న భూకామందుల వద్ద 31శాతం భూమి ఉంది. పారిశ్రామిక రంగం కూడా బాగా వెనుకబడి ఉంది. 1960 నుండి 1981వరకు నేపాల్లో 11 పారిశ్రామిక మండలాలున్నాయి.వీటిల్లో 611 పారిశ్రామిక సంస్థలు, 18,087 ఉద్యోగులున్నారు.1990-91లో పారిశ్రామికవృద్ధి రేటు 15.05గా ఉంది. 1995 తర్వాత నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణల ఫలితంగా పారిశ్రామిక వృద్ధి రేటు తగ్గటం ప్రారంభమైయింది. 2005-2006లో 8.28కి,2015



16కి8 తగ్గింది.పారిశ్రామిక ప్రైవేటీకరణ ఫలితంగా1995లో ప్రతికూల పారిశ్రామికవృద్ధిరేటు 12.8గా ఉంది. 1996లో 2.9 మాత్రంగానే ఉంది. 1997నాటికి దేశంలోని ప్రభుత్వ యాజమాన్యంలోని అన్నిపారిశ్రామిక సంస్థలు అమ్మి వేయబడ్డాయి. కార్పొరేట్ సంస్థల్లో పెద్దసంఖ్యలో పనిచేస్తున్న కార్మికులను అరబ్ దేశాలకు, మలేసియాకు పంపటానికి ఏర్పాట్లు జరిగాయి. ఫలితంగా కార్పొరేట్ సంస్థలు వివాదంలో పడ్డాయి. కార్పొరేట్ సంస్థలతోపాటు జనపనార,చెరకు, పొగాకు, పత్తికర్మాగారాలు మూతపడడంతో కార్మికులు నిరుద్యోగులుగా మారారు. 2022లో కార్మికులు పెద్దఎత్తున తొలగించబడ్డారు. దేశంలో ఆర్థిక సంక్షోభాలు ఏర్పడ్డాయి. దేశ ఆర్థికవ్యవస్థ మొత్తం దిగుమతులపై ఆధారపడి ఉంది. 2022లో వాణిజ్య దిగుమతుల విలువ17వేలకోట్లు ఉండగా ఎగుమతుల విలువ 2 వేలకోట్ల రూపాయలు మాత్రమే. 1951లో మొత్తం ఎగుమతి విలువ 151మిలియన్ల రూపాయలు.1998లో ఎగుమతులు 28.3 పెరిగాయి. 1989లో భారత దేశం విధించిన ఆంక్షల వల్ల 12.3 తగ్గాయి. పాలక ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాల వల్ల దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగాయి. 2010 నుండి పేదరికం తీవ్రంగా పెరిగింది. దేశ జనాభాలో 10శాతంగా ఉన్న అగ్రశ్రేణి సంపన్నుల వద్ద 40శాతం సంపద ఉంది. ఇది 40 శాతంగా ఉన్న పేదల సంపదకంటే 26రెట్లు ఎక్కువ. (17 డిసెంబర్ 2023 నాటికి) సంపన్నుల ఆదాయాన్ని పరిగణలోకి తీసుకుని,సగటు కుటుంబ ఆదాయంగా పేద కుటుంబాలకు వర్తింపచేయడాన్ని అనేక మంది విమర్శించారు. నేపాల్లో ఒకధనవంతుడి ఆదాయం రూ.25కోట్లు జనాభాలో 40శాతం ఉన్న ప్రజలు 100 సంవత్సరాల్లో కూడా అంత సంపద సంపాదించలేరు. 2.80 కోట్ల నేపాల్ జనాభాలో 60 లక్షల మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. 2019 నాటికి దేశ జనాభాలో 39శాతంమంది తక్కువ ఆదాయంతో రోజుజీవితం గడుపుతున్నారు.పిల్లల్లో 64శాతం మందికి పోషకాహారం లభించటం లేదు. పెరుగుతున్న పేదరికం, నిరుద్యోగం, తాండవిస్తున్న అవినీతి, కొద్దిమంది వద్దే దేశ సంపద ఉండడం నేపాల్ ప్రజల్లో ముఖ్యంగా యువతలో కెపి ఓలీశర్మ ప్రభుత్వం వెడల తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. నిరుద్యోగంతో సతమతమవుతున్న యువత ఫేస్‌బుక్, యుట్యూబ్, ఇన్స్టాగ్రామ్, వాట్సాప్‌ల ద్వారా కొద్దిమేర ఉపాధి పొందుతున్నారు.వీటిద్వారా ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు దేశప్రజలకు తెలుస్తూ ఉండటంతో వాటిపై కెపిశర్మ ప్రభుత్వం నిషేధం విధించడంతో నామమాత్రపు ఉపాధి కూడా యువత దూరమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి.అసలే ప్రభుత్వం వెడలకోపంతో ఉన్న యువత లోఈ చర్య మరింత కోపాన్ని రగిల్చి ఉద్యమానికి దారితీసింది. కేపీఓలీ శర్మ రాజీనామా చేసిన తర్వాత ఉద్యమకారులు,ఆర్మీకలసి మాజీ సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కిని దేశ తాత్కాలిక ప్రధానిగా ప్రకటించారు. దేశఅధ్యక్షుడు పార్లమెంటును రద్దుచేసి ఆరునెలల్లో ఎన్నికలు జరపాలని చెప్పారు. నిర్దిష్టమైన లక్ష్యంలేని ఏ ఉద్యమం కూడా దేశప్రజలు ఎదుర్కొంటున్న ఏ ఒక్క మౌలిక సమస్య పరిష్కరించలేదు. ఒక వ్యక్తిస్థానంలో మరొక వ్యక్తిని అధికారంలో కూర్చోబెట్టటానికే పరిమితం అవుతుంది. శ్రీలంకలో జరిగింది అదే. నేపాల్ యువతదేశ ప్రధాన సమస్యలైన పేదలకు భూపంపిణీ, సంపద జాతీయకరణ, పారిశ్రామిక అభివృద్ధి,నిరుద్యోగసమస్య పరిష్కారం వంటి సమస్య పరిష్కారం వెడల అవగాహన లేదు. వారి ఉద్యమంలో ఈ అవగాహన వ్యక్తం కాలేదు. పాలకులవెడల అసంతృప్తిని మాత్రమే వ్యక్తంచేసింది.మౌలిక సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం కొనసాగకుండానే ఉద్యమం ఆగిపోవటానికి అదే కారణం. సుశీలకర్కిని ప్రధానిగా నియమించటం ద్వారా ఎటువంటి మార్పు జరగదు. •

# సుప్రీంకోర్టు ఆదేశాలు బేఖాతరు!

తడకమళ్ళ మురళీధర్

నిర్ణయాలు తీసుకోవడంలో కాలయాపన చేయటం, అనవసర అడ్డంకులను సృష్టించటం, బాధ్యతల నుండి తప్పించుకొని రెడ్ టేపిజం ప్రక్రియలకు పాల్పడటం తగదంటూ చాలాసార్లు ఉన్నత న్యాయస్థానాలు ప్రభుత్వ అధికారులను నిలదీసిన వార్తలు మనకు సుపరిచితమే. అయితే ఉన్నత న్యాయస్థానాలు ఎన్నిసార్లు చీవాట్లు పెట్టినా బ్యూరోక్రసిలో మార్పు అడవి కాచిన వెన్నెల లాగా ఉంటుందనేది నగ్నసత్యం.నాణేనికి మరోవైపు పరిశీలించినట్లయితే బ్యూరోక్రసీని నిగ్గదీసే ఉన్నత న్యాయమూర్తులు ఎంతవరకు ప్రజలకు, కక్షిదారులకు జవాబుదారీగా నిలుస్తున్నారనేది సామాన్య మానవుడు, కక్షిదారులు, న్యాయవాదులు ప్రశ్నించలేని ప్రశ్నగా మిగిలిపోతుంది.ఎంత సేపూ ప్రభుత్వాలు సరిపడా కోర్టులను ఏర్పాటు చేయలేదనే దుగ్ధతప్ప, పదవులనలంకరించిన ఉన్నత న్యాయమూర్తులు సహేతుకమైన సమయంలో తీర్పులు వెలువరించట్లేదనే కక్షిదారుల ఆవేదన,ఆత్రుత, నిరీక్షణ, ఆదుర్దాకు ఏమాత్రం విలువ దక్కటం లేదు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం ఉన్నత న్యాయమూర్తులు సహేతుకమైన సమయంలో తీర్పు వెలువరించని సందర్భాలు కోకొల్లలు. అందులో ప్రజల దృష్టికి వచ్చిన సందర్భాలు చాలా అరుదు. కక్షిదారులు న్యాయమూర్తులకు వ్యతిరేకంగా తమ గోడును ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి. అలహాబాద్ హైకోర్టు ముందున్న 2008 నాటి రవీంద్ర ప్రతాప్ షాహి వర్సెస్ స్టేట్ ఆఫ్ యూపీకేసులోని క్రిమినల్ అప్పీల్‌లో 24-12-2021న ఇరు పక్షాల తుది వాదనలు విని సంవత్సరం దాటినా తీర్పు వెలువరించలేదనే విషయం సుప్రీంకోర్టు దృష్టికి తేబడింది. "మాకు ఈ వార్త అత్యంత దిగ్భ్రాంతికరం,ఆశ్చర్యకరమైన విషయంగా అనిపిస్తుంది' అంటూ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు వ్యాఖ్యానిస్తూ అనిల్ రాయ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బీహార్ కేసులో సుప్రీంకోర్టు ధర్మాసనం 20సంవత్సరాలకు పూర్వమే అనగా 06-08-2001న వెలువరించిన మార్గదర్శకాలను పునరుద్ఘాటించింది.అనిల్‌రాయ్ కేసులో పాట్నా హైకోర్టు న్యాయమూర్తులు 23-08-1995 తేదీన ఇరుపక్షాల తుది వాదనలు విని 14-08-1997న మాత్రమే తుది తీర్పు వెలువరించారు. సుప్రీంకోర్టు దృష్టికి ఈ విషయం తేగా, తీర్పు సకాలంలో వెలువరించనందున, రాజ్యాంగం 21వ అధికరణ ద్వారా జైల్లో మగ్గుతున్న ఆ కేసులోని నిందితులకు కల్పించబడిన స్వేచ్ఛహక్కుకు విఘాతం కలిగిందని పేర్కొంది.సివిల్ ప్రొసీజర్ చట్టం,క్రిమినల్ ప్రొసీజర్ చట్టం తీర్పులను వెలువరించటానికి ఉన్నత న్యాయస్థానాలకు ఎటువంటి సమయ పరిమితి నిర్దేశించకున్ననూ, సహేతుకమైన సమయంలో తీర్పును వెలువరించాలని, అప్పుడే న్యాయం అందించినట్లవుతుందని సుప్రీంకోర్టు ఘాటుగా వ్యాఖ్యానిస్తూ కొన్ని మార్గదర్శకాలను ఆదేశాల రూపంలో జారీ చేసింది. ఇరుపక్షాల తుది వాదనలు విన్న మూడు నెలల్లోగా తీర్పు వెలువరించాలని, ప్రతి తీర్పు మొదటి పేజీలో తీర్పు రిజర్వు చేసిన తేదీ, తీర్పు వెలువరించిన తేదీ విధిగా పేర్కొనాలని సుప్రీంకోర్టు దేశంలోని అన్ని ఉన్నత న్యాయస్థానాలకు ఆదేశాలిచ్చింది. ఒకవేళ మూడు నెలల్లోగా తీర్పు వెలువరించకపోతే, సంబంధిత కక్షిదారులు సంబంధిత న్యాయమూర్తి ముందు ఆ విషయం తెలియజేస్తూ దరఖాస్తుద్వారా నివేదించే అవకాశం సుప్రీంకోర్టు తీర్పు కల్పించింది. అయిననూ ఆరు నెలల్లోగా తీర్పు ప్రకటించకపోతే కక్షిదారులు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదుచేసే విధంగా మార్గదర్శకాలు నిర్దేశించారు. ఇటువంటి విలక్షణమైన, కఠినతరమైన మార్గదర్శకాలు 06-08-2001నే సుప్రీంకోర్టు నిర్దేశించినప్పటికీ, కొంతమంది ఉన్నత న్యాయమూర్తులు వాటిని గాలికొదిలేసి సమయపాలనను పాటించకుండా తీర్పులను ఏళ్లతరబడి పొడిగిస్తూ కక్షిదారులకు రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛహక్కుకు విఘాతం కలిగిస్తున్నారు. కొంతమంది సబార్డినేటు న్యాయమూర్తులు అరెస్టు మార్గదర్శకాలకు గండి కొడ్తుంటే ఉన్నత న్యాయస్థానాలు తీర్పులు వెలువరించాల్సిన సమయపాలన మార్గదర్శకాలను నిర్హేతుకంగా ఉల్లంఘిస్తున్నాయి.ఈ మార్గదర్శకాలు ఉన్నాయనే విషయం వారికి తెలియదేమో అనుకునే ఆస్కారం ఉండటానికి వీలు లేదు.ఎందుకంటే చట్టం తెలియదనటం సాకుకాదు. సుప్రీంకోర్టు సూచనలు, ఆదేశాలు 141వ అధికరణ ప్రకారం దేశంలోని అన్ని న్యాయస్థానాలు విధిగా పాటించాలి. తీర్పు రిజర్వు చేసిన తేదీని హైకోర్టులు తమ తీర్పుల్లో పేర్కొన్న సందర్భాలు అతిస్వల్పం. సకాలంలో తీర్పు ప్రకటించటమే కాకుండా తీర్పు ప్రతిని అదేరోజు వెబ్‌సైట్‌లోకి అప్ లోడ్ చేయించాలి.తీర్పు కాపీని ఇరు పక్షాలకు కనీసం వారంలోగా అందజేయాలి.కాసేపు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ప్రక్కన పెడితే, ప్రతి న్యాయమూర్తి ప్రజలకు, కక్షిదారులకు, రాజ్యాంగానికి జవాబుదారీగా భావించవలసి ఉంటుందనే విషయాన్ని గమనించాలి. ప్రభుత్వ అధికారులను ప్రశ్నించే విధంగానే కక్షిదారులు న్యాయస్థానాలను తీర్పు ప్రకటించటానికి జరిగే అలక్ష్యాన్ని సున్నితంగా, నిర్ద్వందంగా ప్రశ్నించగలిగే వాతావరణం కల్పించబడాలి. •

# మధ్యాహ్న భోజన పథకంలో ఉపాధ్యాయుల భాగస్వామ్యం

దాడిశెట్టి శ్యామ్ కుమార్

ప్రభుత్వ పాఠశాలలో జాతీయ పౌష్టికాహార పథకం కింద ఒకటో తరగతి నుండి పదో తరగతి విద్యార్థిని విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం కొన్నిసార్లు నిర్వాహకుల వలన కావచ్చు, ఉపాధ్యాయుల పర్యవేక్షణ కావలసినంత లేకపోవడం వల్ల కావచ్చు. కారణాలు ఏమైనా అడపాదడపా మధ్యాహ్నభోజనంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్నిసార్లు విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిన్నతర్వాత అస్వస్థకు లోనవుతున్నారు అనే వార్తలు వినవస్తుంటాయి. పరిశుభ్రమైన పాఠశాల పరిసర వాతావరణంలో నిర్వాహకులు సరైన రీతిలో వండటం, ప్రభుత్వం నుండి వచ్చేటువంటి భోజనానికి కావలసినటువంటి బియ్యం ముడిసరకు లాంటివి నాణ్యత ప్రమాణాలు కలిగి ఉండడం అనేది ముఖ్యమైనప్పటికీ, కొన్నిసార్లు ఎవరి అప్రమత్తత లేకపోవడం ఏమోగానీ మధ్యాహ్నం భోజనం తింటున్న విద్యార్థులు అడపాదడపా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.మధ్యాహ్న భోజనం అందించే విధానంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కలిసి భోజనం చేయడానికి సంబంధించి మధ్యాహ్న భోజనంపై హైకోర్టు ప్రశ్నించిన తీరు అదేవిధంగా ముఖ్యమంత్రి ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంలో మధ్యాహ్నభోజనం ఉపాధ్యాయులు విద్యార్థులతో కలసి తింటే బాగుంటుందేమో అని సూచించిన సంగతి విధితమే.నిర్వాహకులు ఉపాధ్యాయుల పర్యవేక్షణలో మధ్యాహ్న భోజనం ప్రత్యక్ష పరిశీలన ఉంటుంది కాబట్టి నిర్వాహకులలో జాగ్రత్త భావనఉంటుంది. మధ్యాహ్న భోజనాన్ని మరింత మంచిగా వండడానికి ప్రయత్నిస్తారు. నిర్వాహకులపై ఆరోపణలు దరిచేరకుండా చూసుకునే ప్రయత్నం చేస్తారనే వాదనలు తెరపైకి వస్తున్నాయి. ప్రస్తుతం మధ్యాహ్న భోజన పథకంలో రోజువారి మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టిక ఆహారం ఇచ్చేక్రమంలో ముందుగా పాఠశాలలోని ఉపాధ్యాయులలో రోజుకొకరు భోజన నాణ్యతను పరీక్షించి రుచిని చూడాలనే నిబంధనతో పాటు రోజువారి వంటకాలు రుచికి సంబంధించి ఉపాధ్యాయుల అభిప్రాయాన్ని మధ్యాహ్న భోజన డైరీలో రాస్తూ ఉంటారు. కానీ క్షేత్రస్థాయిలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై అనేక సందేహాలు వ్యక్తం అవుతూనే ఉన్నాయి.చాలా వరకు పాఠశాలలో వంటశాలలున్నప్పటికీ ఎక్కువగా కట్టెల పొయ్యిలనే వాడుతుండడం గ్యాస్ సిలిండర్ల వాడకం తక్కువ ఉండడం గమనార్హం. దేశంలోని ప్రభుత్వ యాజమాన్యాల కింద నడుస్తున్నటువంటి పాఠశాలల్లో విద్యార్థులను అధిక సంఖ్యలో ఆకర్షించడానికి విద్యార్థుల్లో సామాజిక సమానత్వ భావాన్ని పెంపొందించడం, నాణ్యమైన బోధన అభ్యసనతో పాటు విద్యార్థుల పెరుగుదలకు అవసరమైనటువంటి పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని మధ్యాహ్నం భోజనంలో అందించడానికి నిర్దేశించిన మధ్యాహ్న భోజన పథకంరాష్ట్రాల్లో ప్రభుత్వ ప్రాథమిక,ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలలో నిర్వహించబడుతుంది. మధ్యాహ్న భోజన పథకం ఉద్దేశం ఏమైనా కానీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని



విద్యార్థులకు ఒకపూట మధ్యాహ్న భోజనాన్ని అందించే క్రమంలో సవాలక్ష సమస్యలు ఎదురవుతుండడం సాధారణమైపోతున్నాయనే వాదనలు వినిపిస్తున్నప్పటికీ దీనికి ప్రధాన కారణం కొన్ని సందర్భాల్లో నాణ్యత ప్రమాణాలు కలిగినటువంటి ఆహారాన్నినిర్ణీత సమయంలో నిర్వాహకులు అందించలేకపోతున్నారా అనే అనుమానం కలగక మానదు. ప్రధానంగా ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించవలసి ఉంటుంది. అలాంటప్పుడు ఒక ఉపాధ్యాయుడు దాన్ని నాణ్యతను పరిశీలించిన తర్వాత విద్యార్థులకు అందించే క్రమంలో ప్రతిరోజు ఒక ఉపాధ్యాయునికి ఒక పూట మధ్యాహ్న భోజనం వర్తింపజేసి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కలిసి భోజనం చేసే తీరు వలన మధ్యాహ్న భోజనంఅనేక సమస్యలకు మార్గం సుగమం అవుతాయేమో అనే భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతుండడం విశేషం. పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ అనే సంస్థ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆయా ప్రభుత్వాలు ఉచితంగా ఒక పూట మధ్యాహ్న భోజనాన్ని అందించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించడం జరిగింది. వాదనలను పరిగణలోకి తీసుకున్న భారత అత్యున్నత న్యాయస్థానం మధ్యాహ్న భోజనం ఆవశ్యకత గుర్తించి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచిత మధ్యాహ్నం భోజనం తప్పనిసరిగా అమలుపరచాలని రెండు వేల ఒకటి సంవత్సరంలో వివరణాత్మకమైన తీర్పును ఇచ్చింది. అంతేకాకుండా దేశంలోని బాలల ఆరోగ్య పరిస్థితిపై అధ్యయనం చేసిన బోర్, మొదలియార్ కమిటీ సూచనల ప్రకారం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తప్పనిసరిగా పోషకాహారంతో కూడిన భోజనం అవసరమని చెప్పింది. అనంతరం జరిగిన పరిణామాల్లో రెండు వేల ఐదు సంవత్సరం నుండి భారతదేశంలోని అన్ని రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాలతో సహా ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి శ్రీకారం చుట్టారు. సాధారణంగా మధ్యాహ్న భోజన పథకం అమలు విధానంలో అరవై శాతం కేంద్ర ప్రభుత్వం నలభై శాతం రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహకారాన్ని అందిస్తాయి. అయితే కేంద్ర ప్రభుత్వం భోజనానికి కావలసినటువంటి ధాన్యాలను నేరుగా అందించడమే కాకుండా పంచవర్ష ప్రణాళికల్లో ప్రతిసారిమధ్యాహ్న భోజనానికి అధిక సంఖ్యలో నిధులను కేటాయిస్తుంటారు. తరచుగా నెలలు తరబడి అయినా కూడా బిల్లులు రాని పరిస్థితులు గతంలో గోచరించి నప్పటికీ మధ్యాహ్న భోజన నిర్వాహకులకు నిర్వహణకు అవసరమైన ఖర్చు మొత్తం ఎప్పటికప్పుడు అందిస్తే గాని మధ్యాహ్న భోజన నిర్వహణ సజావుగా ముందుకు కొనసాగుతుందనే భావన నిర్వాహకులలో లేకపోలేదు. ఏదేమైనప్పటికీ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యా దశలో విద్యార్థుల మానసిక శారీరక అభివృద్ధికి ప్రాధాన్యత కలిగి ఉంటుంది. కాబట్టి ప్రభుత్వం నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనపథకం నాణ్యత ప్రమాణాలు కలిగిన సరైన పౌష్టిక విలువలు కలిగిన భోజనాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో వండించిప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుల సమక్షంలో నిర్దేశించిన రోజువారీ మెనూప్రకారం విద్యార్థులకు క్రమపద్ధతిలో అందించగలిగితే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల పట్ల ఆసక్తి చూపడమే కాకుండా విద్యార్థుల ఆరోగ్యానికి ఈ పథ కంఎంతో ఉపయోగకరమైన విధంగా ఉంటుంది. •

# సుంకాలు పెంచితే అమెరికాపై ప్రతిచర్య



## తీవ్రంగా హెచ్చరించిన చైనా

## భయపెట్టడం, ఒత్తిడి చేయడంతో సమస్యలు పరిష్కారం కావని హితవు

**బీజింగ్, సెప్టెంబరు 15:** తమతోపాటు పలు దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు వాటిపై నాటో, జి-7 దేశాలు టారిఫ్‌లు విధించాలని అమెరికా పిలుపునివ్వడంపై చైనా తీవ్రంగా స్పందించింది. కేవలం ఏకపక్షంగా వేధించేందుకు ఆర్థిక బలప్రదర్శనకు ఇటువంటి చర్యలు చేపడతామని తీవ్రంగా ఆరోపించింది. వాషింగ్టన్ చెప్పినట్లు చేస్తే మాత్రం తాము ప్రతి చర్యలు చేపడతామని తీవ్రంగా హెచ్చరించింది. ఓ పక్క స్పెయిన్ మాడ్రిడ్‌లో సోమవారం నుంచి ఇరు దేశాల ప్రతినిధుల మధ్య చర్చలు మొదలైన వేళ చైనా నుంచి ఈ ప్రతిస్పందన రావడం గమనార్హం. రోజువారీ సాధారణ ప్రెస్ బ్రీఫింగ్స్‌లో భాగంగా చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జిన్ మాట్లాడుతూ ప్రపంచంలోని ఇతర దేశాల వలే రష్యాతో కూడా తమకు సాధారణ సంబంధాలున్నాయన్నారు. ఇది అంతర్జాతీయ చట్టాలకు పూర్తిగా అనుగుణంగానే ఉన్నట్లు పేర్కొన్నారు. 'అమెరికా చర్యల ఏకపక్ష వేధింపులు, ఆర్థిక బలప్రదర్శనకు నిదర్శనం. ఇవి తీవ్ర స్థాయిలో అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలను దెబ్బతీస్తాయి. అంతేకాదుప్రపంచ వాణిజ్య, పారిశ్రామిక పంపిణీ వ్యవస్థలపై కూడా ప్రతికూల ప్రభావం ఉంటుంది. భయపెట్టడం, ఒత్తిడి చేయడం వంటివి సమస్యలను పరిష్కరించలేవని ఎప్పుడో నిరూపితమైంది. ఉక్రెయిన్ విషయంలో చైనా విధానం ఎప్పుడూ ఒక్కటే. కేవలం చర్చలు, సంప్రదింపులతోనే ఆచరణయోగ్యమైన పరిష్కారం మార్గం లభిస్తుంది' అని పేర్కొన్నారు. ఏకపక్ష ఆంక్షలను చైనా ఎప్పుడూ వ్యతిరేకిస్తుందని చెప్పారు. ఐరోపా, అమెరికా ఇప్పటికే రష్యాతో వ్యాపార లావాదేవీలు జరుపుతున్నాయని గుర్తు చేశారు. ఇక తమ, రష్యా సంస్థల మధ్య సహకారం ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు అనుగుణంగా ఉంటుందన్నారు. నాటో దేశాలన్నీ రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం పిలుపునిచ్చారు. దాంతోపాటు రష్యన్ పెట్రోలియం కొంటున్న చైనాపై 50 నుంచి 100 శాతం సుంకాలు విధిస్తానని కూడా ట్రంప్ సంకేతం పంపారు. భారీ స్థాయిలో డ్రాగన్‌పై సుంకాలు విధిస్తేనే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నిలిచిపోతుందని తాను విశ్వసిస్తున్నట్లు ప్రకటించారు. కొన్ని నాటో దేశాలు ఇప్పటికే రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుండటం దిగ్భ్రాంతికి గురిచేస్తోందని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. యుద్ధాన్ని నిలువరించేందుకు కావాల్సిన నిబద్ధత కొన్ని నాటో దేశాల్లో తక్కువగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.



### చట్టవిరుద్ధ పద్ధతులుంటే

# బీహార్ 'సర్' రద్దుచేస్తాం

## సుప్రీంకోర్టు స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 15:** భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) అనుసరిస్తున్న పద్ధతుల్లో ఏదైనా చట్టవిరుద్ధం అని తేలితే, బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను రద్దు చేస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బీహార్‌లో చేపట్టిన సర్‌కు వ్యతిరేకంగా దాఖలైన వ్యాజ్యాలపై సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం విచారణ చేసింది. ఈ సందర్భంగా సర్ నిర్వహణలో ఎలక్షన్ కమిషన్ చట్టాలను, తప్పనిసరి నిబంధనలను పాటించిందని తాము భావిస్తున్న సుప్రీం ధర్మాసనం పేర్కొంది. సర్ పరంగా తాము ఇచ్చే తుది తీర్పు బీహార్‌కు మాత్రమే కాదు, దేశం మొత్తానికి వర్తిస్తుందని స్పష్టం చేసింది. బీహార్ సర్ ఎక్సర్‌సైజ్‌పై తుది వాదనలు అక్టోబర్ 7న వింటామని సుప్రీం కోర్టు పేర్కొంది. ఇంతకు ముందు, నిర్ణీత కాల వ్యవధుల్లో దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్వహించాలనే ఆదేశాలు జారీ అయితే తమ ప్రత్యేక అధికార పరిధికి విఘాతం కలుగుతుందని సుప్రీంకోర్టుకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) తెలిపింది. ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కు సంబంధించిన విధానంపై పూర్తి విచక్షణతో స్వతంత్రంగా నిర్ణయాన్ని తీసుకునే అధికారం తమకు ఉందని పేర్కొంది. ఈ విషయంలో ఇతర సంస్థలతో నిమిత్తం లేకుండా పనిచేసే స్వేచ్ఛ తమకు ఉందని ఈసీ చెప్పింది. ఈ మేరకు వాదనలతో సుప్రీంకోర్టులో కౌంటర్ అఫిడవిట్‌ను ఎన్నికల సంఘం దాఖలు చేసింది. బీహార్‌లో చేపట్టిన సర్ కోసం 11 గుర్తింపు కార్డులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంది. అయితే వీటిలో ఆధార్ కార్డు లేకపోవడంతో ప్రతిపక్ష పార్టీలు పెద్దఎత్తున ఆందోళన చేశాయి. ఆధార్‌ను గుర్తింపు పత్రంగా పరిగణించాలని కోరుతూ, సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. దీనితో ఆధార్‌ను 12వ గుర్తింపు పత్రంగా పరిగణించాలని ఈనెల 8న సర్వోన్నత న్యాయస్థానం ఈసీకి ఆదేశాలు జారీ చేసింది. అయితే ఆధార్ అనేది వ్యక్తుల గుర్తింపునకు, నివాసానికి చట్టబద్ధమైన రుజువుగా మాత్రమే ఉంటుందని, అది పౌరసత్వాన్ని సూచించదని స్పష్టం చేసింది. ఈసీ బీహార్‌లో ఎస్ఐఆర్ చేపట్టి, సరైన ధ్రువీకరణ లేకుండా లక్షలాది మంది నిజమైన ఓటర్ల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తోందని విపక్షాలు విమర్శలు గుప్పించాయి.



## మహారాష్ట్ర గవర్నర్‌గా దేవవ్రత్ ప్రమాణం

**ముంబయి, సెప్టెంబరు 15:** మహారాష్ట్ర గవర్నర్‌గా గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం ముంబైలోని రాజ్‌భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రశేఖర్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కూడా హాజరయ్యారు. కాగా, ఇటీవలే జరిగిన ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో సీపీ రాధాకృష్ణన్ గెలుపొందిన విషయం తెలిసిందే. దీంతో ఆయన మహారాష్ట్ర గవర్నర్ పదవి నుంచి వైదొలిగారు.

# నెతన్యాహు జాగ్రత్త.. ఖతార్ మా మిత్రదేశం


## యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక



**వాషింగ్టన్, సెప్టెంబరు 15:** గత వారం గాజాలో కాల్పుల విరమణ కోసం అమెరికా చేసిన ప్రతిపాదనలపై చర్చించేందుకు దోహాలో సమావేశమైన హమాస్ నేతలపై 'సమ్మిట్ ఆఫ్ ఫైర్' పేరుతో ఇజ్రాయెల్ విరుచుకుపడిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఖతార్ తమకు చాలా ముఖ్యమైన మిత్ర దేశమని.. దానిపై ఏదైనా నిర్ణయం తీసుకోవాలనుకున్నప్పుడు ఇజ్రాయెల్ ఆచితూచి వ్యవహరించాలని ఆ దేశ ప్రధాని నెతన్యాహును హెచ్చరించారు. ఖతార్ ఎమిర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్-థానీని అద్భుతమైన వ్యక్తిగా ట్రంప్ అభివర్ణించారు. ఇజ్రాయెల్ హమాస్‌పై ఎటువంటి చర్యలు తీసుకున్నప్పటికీ ఖతార్ జోలికి మాత్రం వెళ్లొద్దని అన్నారు.
కాల్పుల విరమణకు సంబంధించి యుఎస్ ప్రతిపాదన మేరకు ఇటీవల దోహాలో ఖతార్ అధికారులు, హమాస్ నేతలు భేటీ అయ్యారు. వీరి మధ్య చర్చలు జరుగుతుండగానే ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో వారెవరూ ప్రాణాలు కోల్పోలేదు. అయితే, ఈ దాడులను ఖతార్ తీవ్రంగా పరిగణించింది. మధ్యవర్తిత్వ సూత్రంపై జరిగిన దాడిగా అభివర్ణించింది. కాగా భారత్‌తో సహా పలు దేశాలు ఈ దాడులను ఖండించాయి. మరోవైపు- అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆదివారం ఇజ్రాయెల్‌కు చేరుకున్నారు. గాజా సమస్యకు పరిష్కారం ఏమిటనేది ఇజ్రాయెల్ అధికారుల్ని అడిగేందుకు ఆయన అక్కడికి వెళ్లినట్లు సమాచారం. అయితే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాత్రం తాము చేసిన దాడులను సమర్థించుకున్నారు. అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడులను. అమెరికాలో జరిగిన 9/11 దాడులతో పోల్చారు. ఆయన ఓ విడియోలో మాట్లాడారు. హమాస్‌తో యుద్ధానికి దారితీసిన అక్టోబరు 7 నాటి దాడులను ఆయన ప్రస్తావించారు. వీటిని అమెరికాలో జరిగిన 9/11 దాడులతో పోల్చుతూ నాడు యుఎస్ ఎలా స్పందించిందో ప్రస్తుతం తాము అలాగే చేశామన్నారు. దాడులకు కారణమైన ఉగ్రవాదులు ఏదేశంలో ఉన్నా వెంటాడి హతమారుస్తామని నాడు అమెరికా ఏ విధంగా చెప్పిందో ప్రస్తుతం తాము కూడా అదే చేశామని అన్నారు.

# విదేశీ ఉద్యోగులను నియమించుకోండి

## దక్షిణ కొరియా దెబ్బకు దిగొచ్చిన డొనాల్డ్ ట్రంప్



**వాషింగ్టన్, సెప్టెంబరు 15:** అమెరికా పరిశ్రమల్లో విదేశీ ఉద్యోగుల అవసరం ఉందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. యుఎస్‌లో పెట్టుబడుల గురించి తాము ఆలోచిస్తామంటూ దక్షిణ కొరియా నుంచి హెచ్చరికలు వచ్చిన నేపథ్యంలో అధ్యక్షుడు దెబ్బకు దిగొచ్చారు. ఇంతకీ ఏం జరిగిందంటే..? ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి అక్రమ వలసల విషయంలో కఠినవైఖరి అవలంబిస్తు న్నారు. వారిని గుర్తించి, వెనక్కి పంపిస్తున్నారు. ఇందులో భాగంగానే ఇటీవల జార్జియాలో 475 మంది అక్రమ వల సదార్లను నిర్బంధినట్లు హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రకటించింది. జార్జి యాలో దక్షిణ కొరియాకు చెందిన హ్యుందాయ్ కంపెనీ ప్లాంట్‌లో దక్షిణ కొరియా వాసులు అక్రమంగా పనిచేస్తున్నారన్న సమాచారం ఆధా రంగా ఈ రైడ్ జరిగింది. ఇక్కడ అదుపులోకి తీసుకున్న వారిలో ఆ దేశవాసులే ఎక్కువగా ఉన్నారు. ఇది రెండుదేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలకు దారితీసింది. దీనిపై దక్షిణకొరియా అధ్యక్షుడు లీ జె మ్యూంగ్ స్పందించారు. 'ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మా వ్యాపార సంస్థలు యుఎస్‌లో పెట్టుబడులు పెట్టడానికి వెనకడతాయి' అని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో డొనాల్డ్ ట్రంప్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'సంక్లిష్టమైన ఉత్పత్తులను తయారుచేస్తోన్న విదేశీ కంపెనీలు అమెరికాలో భారీ పెట్టుబడులు పెట్టిన సమయంలో నైపుణ్యం కలిగిన కార్మికులు అవసరం అవుతుంటారు. కొంతకాలం నిపుణులైన కార్మికులను వారు మా దేశానికి తీసుకురావాలని నేను కోరుకుంటున్నాను. వారి నుంచి మన కార్మికులు శిక్షణ పొందాలి. లేకపోతే ఆ భారీ పెట్టుబడుల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. మేం ఆ విదేశీ సంస్థల ఉద్యోగులను స్వాగతిస్తున్నాం. మేం వారి నుంచి నేర్చుకొని, వారికంటే మెరుగ్గా రాణిస్తాం' అని ట్రంప్ రాసుకొచ్చారు.



## 30 యేళ్లుగా ఉన్నా సరైన పత్రాలులేవని పంజాబీ వృద్ధురాలి అరెస్టు

**వాషింగ్టన్, సెప్టెంబరు 15:** అక్రమ వలసలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కఠినంగా వ్యవహరిస్తున్నారు. సరైన పత్రాలు లేకుండా అమెరికాలో నివసిస్తున్న విదేశీయులను ఇమిగ్రేషన్ అధికారులు గుర్తించి, వారిని జైలుకు తరలించడం లేదా స్వదేశానికి పంపించడం చేస్తున్నారు. ఈ క్రమంలో నార్తర్న్ కాలిఫోర్నియాలోని ఈస్ట్ బేలో నివాసం ఉంటున్న హర్జిత్ కౌర్ (73)ను అధికారులు గత సోమవారం అదుపులోకి తీసుకున్నారు. సరైన పత్రాలు లేవని ఆమెను జైలుకు పంపించారు. దీనిపై కౌర్ కుటుంబ సభ్యులతో పాటు స్థానిక పం జాబీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

# రాజకీయ పార్టీలకు 'పోష్' వర్తింపచేయలేం

## పార్టీలను పనిప్రదేశంగా గుర్తించలేం..

## పిటిషన్ తిరస్కరించిన సుప్రీంకోర్టు




**న్యూఢిల్లీ సెప్టెంబరు 15:** రాజకీయ రంగంలో పనిచేస్తున్న మహిళలకు లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోష్) కింద రక్షణ కల్పించాలంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. రాజకీయ పార్టీలకు, కార్యకర్తలకు మధ్య యజమానిఉద్యోగి సంబంధం ఉండదని, కాబట్టి రాజకీయ పార్టీలను "పని ప్రదేశం"గా పరిగణించలేమని సోమవారం స్పష్టం చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. రాజకీయ పార్టీలను 'పోష్' చట్టంలోని 'పని ప్రదేశం' నిర్వచనం కిందకు ఎలా తీసుకురాగలమని ధర్మాసనం ప్రశ్నించింది. పార్టీకి, దాని కార్యకర్తలకు మధ్య యజమానిఉద్యోగి బంధం లేనప్పుడు, ఈ చట్టం వర్తింపజేయడం సాధ్యం కాదని అభిప్రాయపడింది. అడ్వకేట్ యోగమాయ ఎం.జి. ఈ స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేశారు. 2022 మార్చిలో కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆమె ఈ పిటిషన్‌లో సవాలు చేశారు. యజమానిఉద్యోగి సంబంధం లేనందున, రాజకీయ పార్టీలు అంతర్గత ఫిర్యాదుల కమిటీలను (ఐసీసీ) ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని అప్పట్లో కేరళ హైకోర్టు తీర్పు ఇచ్చింది. కేరళ హైకోర్టు తీర్పు వల్ల రాజకీయ, సినీ, మీడియా వంటి అనధికారిక రంగాలలో పనిచేస్తున్న ఎంతో మంది మహిళలు పోష్ చట్టం రక్షణకు దూరమవుతున్నారని పిటిషనర్ వాదించారు. యజమాని, ఉద్యోగి , పని ప్రదేశం వంటి పదాలకు చట్టంలో విస్తృత అర్థం ఉందని, కానీ హైకోర్టు తీర్పు దాని స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉందని పేర్కొన్నారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 15, 19(1), 21 కింద కల్పించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనని పిటిషన్‌లో ఆరోపించారు. గత నెలలో కూడా ఇదే తరహా ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) సీజేఐ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనమే తిరస్కరించింది. అయితే, కేరళ హైకోర్టు తీర్పును ప్రత్యేకంగా ఎస్ఎల్‌పీ ద్వారా సవాలు చేయవచ్చని అప్పుడు సూచించింది. కాగా, గతేడాది డిసెంబర్‌లో ఇలాంటి మరో పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు, ఈ విషయంలో ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించడం గమనార్హం.

# ఛత్తీస్‌గఢ్‌లో న్యూడ్‌పార్టీ!

## రూ.40వేలు ప్రవేశరుసుం..

## ఆన్‌లైన్‌లో ఆహ్వానాల చక్కర్లు

## ఆర్గనైజర్లు, అనుమానితుల అరెస్టులు




**రాయ్‌పూర్, సెప్టెంబరు 15:** ఛత్తీస్‌ఘర్ రాజధానిలో ఈనెల 21వ తేదీ న్యూడ్‌పార్టీ జరుగుతుందన్న సోషల్‌మీడియా ప్రచారంపై పోలీసులు స్పందించారు. రంగంలోకి దిగిన రాయ్‌పూర్ పోలీసులు అనుమానితులు అనేక మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆర్గనైజర్లుగా అనుమానిస్తున్న వారిని సమగ్ర విచారణజరిపి మరింతగా ముందుకు వెళతామని పోలీస్ అధికారులు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలనుంచి అర్ధరాత్రి దాటేంతవరకూ కూడా ఈ న్యూడ్‌పార్టీ ఉంటుందని, ఇందుకుగానుప్రవేశ రుసుం రూ.40వేలుగా ప్రకటించారు. అంతే కాకుండా ఈమొత్తంలో ఆరాత్రి బసచేసేందుకు గదికూడా కేటాయిస్తామని ప్రచారంచేసారు. ఒక్కసారిగా నెట్‌లో ఈపోస్టులు వైరల్ అయ్యాయి. హైపర్‌క్లబ్ మేనేజర్ జేమ్స్‌బ్యాక్, సంతోష్ జెవాని, అజయ్ మహాపాత్ర, ఎస్ఎస్‌గుప్త, టినుసింగ్, దేవేంద్ర అందరినీ అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తునానమని, మరి కొందరు అనుమానితులను కూడా అదుపులోకి తీసుకున్నామన్నారు. ఛత్తీస్‌ఘర్ కాంగ్రెస్ చీఫ్ దీపక్ బైజ్ మాట్లాడుతూ అధికారంలో ఉన్న బిజెపి ఇలాంటి చట్టవ్యతిరేక శక్తులకు రక్షణ ఇస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ వ్యవస్థలు క్షీణిస్తే ఇలాంటి న్యూడ్ పార్టీలు ప్రారంభం అవుతాయని, సోషల్‌మీడియాలో పోస్టర్లు వైరల్ అవుతున్నాయని అన్నారు. అయినా కూడా ప్రభుత్వం సైలెంట్‌గా ఉందని, బిజెపి హయాంలో చట్ట వ్యతిరేక శక్తులు మరింతగా రెచ్చిపోతున్నారని ఆయన గుర్తుచేసారు. పలుకుబడి ఉన్న వ్యక్తులు మాత్రమే ఇలాంటి పార్టీలునిర్వహిస్తారని చెప్పారు. హోంమంత్రి తన శాఖపై పట్టుకోల్పోయారని ప్రతిరోజు ఒక కొత్తకుంభకోణం వెలుగులోకి వస్తోందని, నేరగాళ్లు ప్రభుత్వాన్ని డామినేట్ చేస్తున్నారన్నారు. అయితే డిప్యూటీ సీఎం విజయ్‌శర్మ మాట్లాడుతూ ఈ సమాచారం తన దృష్టిలో లేదని, ఇలాంటి వాటిని ఎంతమాత్రం సహించబోమని, అనుమతులు ఇవ్వమని సరికదా కఠిన చర్యలు కూడా ఉంటాయని హెచ్చరించారు. ఛత్తీస్‌ఘర్ మహిళాకమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ కిరణ్మయి నాయక్ రాయ్‌పూర్ ఎస్పీకి లేఖరాస్తూ 48 గంటల్లోతనకు నివేదిక ఇవ్వాలని కోరారు. ఎస్పీతోపాటు సైబర్‌సెల్‌చీఫ్‌ను కూడా విచారణ చేయాలని, నిర్వాహకులు, ప్రాయోజితంచేసే ప్రముఖులు, ఆహ్వానాలూన్‌లైన్‌లో సర్క్యులేట్ చేసిన వారిని వెంటనే అరెస్టుచేయాలనికోరారు. రోజువారి ప్రగతిని కమిషన్‌కు నివేదించాలని కూడా మహిళాకమిషన్ ఛైర్‌పర్సన్ పేర్కొన్నారు.

## అరుణాచల్ దిబాంగ్ నదిపై మెగా డ్యామ్‌నిర్మాణం

### చైనాకు దీటుగా భారత్ ముందడుగు

**ఇటానగర్, సెప్టెంబరు 15:** చైనాకు ధీటుగా అరుణాచల్‌ప్రదేశ్‌లోని దిబాంగ్ నదిపై భారత్ మెగా డ్యామ్ నిర్మిస్తోంది. జల విద్యుత్ కేంద్రంతో పాటు డ్రాగన్ విడుదల చేసే వరదను తట్టుకునేలా డ్యామ్‌ను నిర్మించనుంది. భారత సరిహద్దుల్లో టిబెట్‌లోని బ్రహ్మపుత్ర నదిపై చైనా భారీ జలవిద్యుత్తు ప్రాజెక్టు నిర్మిస్తున్న నేపథ్యంలో వ్యూహాత్మక భద్రతలో భాగంగా భారత్ కూడా మెగా డ్యాంకు శ్రీకారం చుట్టింది. అరు



ణాచల్ ప్రదేశ్‌లోని దిబాంగ్‌నదిపై 17వేల కోట్లతో మెగా డ్యాంను నిర్మిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ భారీ డ్యాం ద్వారా పెద్ద మొత్తంలో నీటి విడుదల చేసి భారత్‌లో కృత్రిమ వరదలు సృష్టించే ప్రమాదం ఉందని అనుమానాలు ఉన్నాయి. చైనా కుట్రలను తిప్పికొట్టే లక్ష్యంతో భారత్ కూడా అరుణాచల్‌లో మెగా డ్యాం నిర్మాణం చేపట్టినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. 2032 కల్లా ఈ మెగా డ్యాంను అందుబాటులోకి తీసుకొచ్చేలా పనులు సాగుతున్నాయి. చైనా ప్రాజెక్టు పూర్తైతే భారత్‌లోని బ్రహ్మపుత్రకు ప్రమాదమేనని భావిస్తోంది. టిబెట్‌లోని బ్రహ్మపుత్ర నదిపై చైనా ఇటీవల భారీ జల విద్యుత్తు ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించింది. దీనిపై భారత్, బంగ్లాదేశ్‌లు ఆందోళన వ్యక్తం చేశాయి. చైనా జల విద్యుత్ ప్రాజెక్టు ప్రభావం దిగువన ఉన్న దేశాలపై పడుతుందని భారత్ ఆందోళన వ్యక్తంచేసింది. చైనా ప్రాజెక్టు పూర్తైతే భారత్‌లోని బ్రహ్మపుత్ర నది పూర్తిగా ఎండిపోయే ప్రమాదముంది. ఈ ప్రాజెక్టును వాటర్ బాంబుగా వినియోగించుకొని, భారత్‌లో కృత్రిమ వరదలు సృష్టించే ప్రమాదముందనే వార్తలు ప్రచారంలో ఉన్నాయి.

## సంక్షిప్తంగా..

## మాజీ ఐఎఎస్ పూజాఖేడ్కర్‌పై కిడ్నాప్ కేసు



**ముంబయి, సెప్టెంబరు 15:** మహారాష్ట్రకు చెందిన మాజీ ఐఏఎస్ ఆఫీసర్ పూజా ఖేడ్కర్ పై పోలీసులు మరో కేసు నమోదు చేశారు. తన కారును ఢీ కొట్టాడనే కోపంతో ఓ డ్రైవర్ ను తన ఇంట్లోని ఓ గదిలో బంధించిందని ఆరోపించారు. బాధితుడి ఫిర్యాదుతో పూజా ఖేడ్కర్ పై కిడ్నాప్ కేసు పెట్టారు. నకిలీ సర్టిఫికెట్లతో ఐఏఎస్ కు ఎంపికైన పూజా ఖేడ్కర్ ను కేంద్రం ఇప్పటికే ఉద్యోగంలో నుంచి తొలగించిన విషయం తెలిసిందే. దీనిపై ఆమె న్యాయ పోరాటం చేస్తున్నారు. ఇటీవల నవీ ముంబైలో ఓ కాంక్రీట్ మిక్సర్ ట్రక్ ఎదురుగా వస్తున్న కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. అయితే, ఆ తర్వాత మిక్సర్ ట్రక్ డ్రైవర్ కనిపించకుండా పోయాడు. డ్రైవర్ కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు సదరు ప్రమాదానికి గురైన కారును పూజా ఖేడ్కర్ ఇంటి ఆవరణలో గుర్తించారు. కారును పరిశీలించి, యజమానిని ప్రశ్నించేందుకు వెళ్లిన పోలీసుల పట్ల పూజా ఖేడ్కర్ తల్లి మనోరమ ఖేడ్కర్ అనుచితంగా ప్రవర్తించారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ గేటు తీసేందుకు నిరాకరించారు. కాసేపటి తర్వాత బలవంతంగా గేటు తెరిచి లోపలికి వెళ్లిన పోలీసులు ఇంట్లోని ఓ గదిలో బంధించిన మిక్సర్ ట్రక్ డ్రైవర్ ను గుర్తించి విడిపించారు.

## హిట్ అండ్ రన్ బిఎండబ్ల్యు కేసులో డ్రైవర్ అరెస్టు




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 15:** దేశరాజధాని ఢిల్లీలో జరిగిన బీఎండబ్ల్యూ కారు హిట్ అండ్ రన్ కేసులో ఆ కారు డ్రైవర్ గగన్‌ప్రీత్‌ను అరెస్టు చేశారు. ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రటరీ నవజ్యోత్ సింగ్, ఆయన భార్య సందీప్ కౌర్ బైక్‌పై వెళ్తుండగా ఆ వాహనాన్ని బీఎండబ్ల్యూ కారు ఢీకొన్నది. ఆదివారం జరిగిన ఆ ప్రమాదంలో ఆర్థికశాఖ ఆఫీసర్ నవజ్యోత్ ప్రాణాలు కోల్పోయారు. ఆయన భార్య తీవ్రంగా గాయపడ్డారు. అయితే ఇదే ప్రమాదంలో గాయపడ్డ బీఎండబ్ల్యూ డ్రైవర్ గగన్‌ప్రీత్ హాస్పిటల్‌లో చికిత్స పొందింది. ఆమెను సోమవారం పోలీసులు అరెస్టు చేసి కస్టడీలోకి తీసుకున్నారు. హిట్ అండ్ రన్ ఘటనలో ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నిరక్ష్యపూరిత డ్రైవింగ్ కింద సెక్షన్ 281, ప్రమాదభరిత ప్రవర్తన కింద 125 బీ , హత్యాయత్నం కింద 105 సెక్షన్, తప్పుడు సమాచారం ఇచ్చిన కేసులో 238 సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. డ్యామేజ్ చెందిన వాహనాన్ని ఎఫ్ఎస్ఎల్ బృందం తనిఖీ చేసింది. బీఎండబ్ల్యూ కారును ఓ మహిళ డ్రైవ్ చేసిందని, సెంట్రల్ వర్జ్‌ను ఢీకొన్న తర్వాత ఆ వాహనం కంట్రోల్ తప్పి, బైక్‌ను ఢీకొన్నదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

## వర్క్‌ఫ్రం హోం కాదు వర్క్‌ఫ్రం థియేటర్

**బెంగళూరు, సెప్టెంబరు 15:** సినిమా థియేటర్‌కు వెళ్లేది కాసేపు రిలాక్స్ అవ్వడానికి. కానీ, ఆ చీకట్లో వెండితెరపై సినిమా వెలుగుతుంటే, ఓ యువతి మాత్రం తన ల్యాప్‌టాప్ ఆన్ చేసుకుని ఆఫీస్ పనిలో మునిగిపోయింది. బెంగళూరులో చోటుచేసుకున్న ఈ వింత ఘటనకు సంబంధించిన ఫొటో ఇప్పుడు ఇంటర్నెట్‌లో ప్రకంపనలు సృష్టిస్తోంది. నగరంలోని కార్పొరేట్ వర్క్ కల్చర్‌పై తీవ్రమైన చర్చకు దారితీసింది. లోక అనే సినిమా చూసేందుకు బెంగళూరులోని ఓ థియేటర్‌కు ఓ ఉద్యోగి వెళ్లాడు. తన ముందు వరుసలో కూర్చున్న ఓ యువతి ల్యాప్‌టాప్ ఓపెన్ చేసి తీవ్రంగా పనిచేస్తుండటం గమనించాడు. ఈ దృశ్యాన్ని ఫొటో తీసి రెడిట్ అనే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో పోస్ట్ చేశాడు. బెంగళూరులో ఉద్యోగుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చెప్పడానికి ఇదే నిదర్శనం అంటూ దానికి ఓ వ్యాఖ్యను జోడించాడు. ఈ ఫొటో క్షణాల్లో వైరల్‌గా మారింది. నెటిజన్లు ఈ ఘటనపై తీవ్రంగా స్పందిస్తున్నారు.

## కేరళలో 67కు పెరిగిన అమీబా కేసులు



**తిరువనంతపురం, సెప్టెంబరు 15:** కేరళలో మెదడు తినే అమీబా కేసుల సంఖ్య 67కు చేరింది. తాజాగా 17ఏళ్ల బాలుడికి అమీబిక్ మెనింగో ఎన్‌సెఫలిటిస్ అనే అరుదైన ఇన్ఫెక్షన్ సోకింది. స్నేహితులతో కలిసి అక్కులం టూరిస్ట్ విలేజ్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టిన తర్వాత ఆ యువకుడు ఈ వ్యాధి బారినపడినట్లు ఆరోగ్యశాఖ అధికారులు నిర్ధారించారు. దీంతో ఆ స్విమ్మింగ్ పూల్‌ను అధికారులు మూసివేశారు. నీటి నమూనాలు సేకరించి పరీక్ష కోసం పంపారు. కాగా, మెదడు తినే అమీబా వ్యాధి కారణంగా కేరళలో గతవారం ఒకే నెలలో ఐదో మరణం సంభవించింది. మలప్పురం జిల్లాలోని వండూర్‌కు చెందిన 56 ఏళ్ల శోభనకు ఈ వ్యాధి సోకింది. కోజికోడ్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఆమె మరణించింది. అదే హాస్పిటల్‌లో చికిత్స పొందిన సుల్తాన్ బతేరీకి చెందిన 45 ఏళ్ల రతీష్ అనే మరో రోగి కూడా అదే వ్యాధితో చనిపోయాడు.

# మాదేశాన్ని మాకిచ్చేయండి

## లక్షలాదిమంది ఆందోళనలతో దద్దరిల్లిన లండన్ వీధులు

**లండన్, సెప్టెంబరు 15:** బ్రిటన్‌లో వలసదారుల సంఖ్య పెరిగిపోవడంపై స్థానికుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తమ దేశాన్ని తమకే వదిలేయాలంటూ లక్షలాది మంది లండన్ వీధుల్లోకి వచ్చి ఆందోళన చేపట్టారు. "మా దేశాన్ని మాకు ఇచ్చేయండి" అనే నినాదాలతో లండన్ నగరం దద్దరిల్లింది. ఈ నిరసన కార్యక్రమం హింసాత్మకంగా మారడంతో పోలీసులతో ఘర్షణ చోటుచేసుకుంది. జాతీయవాద నేత టామీ రాబిన్సన్ నేతృత్వంలో లక్ష మందికి పైగా నిరసనకారులు యూకే జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు ఉండే వైట్‌హాల్ ప్రాంతంలోకి చొచ్చుకువెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ ఘటనలో 26 మంది పోలీసు అధికారులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు పాలస్తీనా, ఇస్లామిక్ స్టేట్ జెండాలను చించివేసి తమ నిరసన తెలిపారు. ఈ ఆందోళనలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు. నియంత్రణ లేని వలసలతో బ్రిటన్ వేగంగా పతనమవుతోంది. మీరు హింసను ఎంచుకోకపోయినా, హింసే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తోంది.దాన్ని ఎదుర్కోవాలి, లేదంటే ప్రాణాలు వదలాలి. ఇదే వాస్తవం అని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు, టామీ రాబిన్సన్ నిరసనకు వ్యతిరేకంగా పలువురు బ్రిటన్ ఎంపీలు, వామపక్ష నేతలు, ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు సుమారు 5 వేల మందితో కౌంటర్ ర్యాలీ నిర్వహించారు. రాబిన్సన్ మద్దతుదారులను జాత్యహంకారులుగా, మహిళా వ్యతిరేకులుగా వారు ఆరోపించారు. ఆఫ్రికా, మధ్యప్రాచ్య దేశాల నుంచి వలసలు, శరణార్థుల సంఖ్య పెరిగిపోవడంతో తమ సంస్కృతి దెబ్బతింటోందని, నేరాలు అధికమవుతున్నాయని బ్రిటన్‌లోని జాతీయవాద వర్గాలు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. యూకే ప్రభుత్వ గణాంకాల ప్రకారమే 2024చివరి నాటికి దేశంలో 5,15,697 మంది అధికారిక శరణార్థులు ఉన్నారు. మరో లక్షా 24 వేల మందికి పైగా ఆశ్రయం కోసం చేసుకున్న దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. చట్టవిరుద్ధంగా దేశంలో నివసిస్తున్న వారి సంఖ్య 10 నుంచి 15 లక్షల వరకు ఉండవచ్చని అంచనా.

# ఇందిరమ్మ ఇళ్లకు రూ.1,435 కోట్ల చెల్లింపులు

## గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి.గౌతం

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు రూ.1,435 కోట్లను లబ్ధిదారులకు అందచేసినట్లు గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి.గౌతం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.15 లక్షల ఇళ్ల పనులు ప్రారంభం కాగా, 1.29 లక్షల ఇళ్ల పనులు పురోగతిలో ఉన్నాయని, వాటిలో సుమారు 20 వేల ఇళ్ల గోడలు, 8633 ఇళ్ల రూఫ్ పూర్తి అయ్యాయని ఎండి వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణం పూర్తయిన ఇళ్లకు గృహ ప్రవేశాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణ పురోగతిని బట్టి, ప్రతి సోమవారం లబ్ధిదారులకు ఆధార్ నెంబర్ ఆధారంగా నేరుగా బ్యాంకు ఖాతాల్లో నగదును జమ చేస్తున్నామని ఆయన తెలిపారు. అందులో భాగంగా సోమవారం 13,841 మంది లబ్ధిదారులకు రూ. 146.30 కోట్లను విడుదల చేశామని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# వైద్యవిద్యార్థుల సమస్యలను తీర్చడంలో ముందుంటాం

## నీట్స్ పేరంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణచారి

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** వైద్య విద్యార్థుల సమస్యలను తీర్చడంలో ముందంజలో ఉంటామని నీట్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయణ చారి అన్నారు. సోమవారం నాగోల్ లోని ఓ ప్రైవేట్ కళాశాలలో నీట్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. సత్యనారాయణ చారి మాట్లాడుతూ పేరెంట్స్ అసోసియేషన్ భవిష్యత్తులో చేయవలసిన కార్యక్రమాల గూర్చి కులం కుశంగా చర్చించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ చారి మాట్లాడుతూ.. ఈ అసోసియేషన్ అతి త్వరలో రిజిస్ట్రేషన్ చేయాలనుకుంటున్నామన్నారు. వైద్య విద్యార్థుల అడ్మిషన్లలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైన సంప్రదించడానికి ప్రతి జిల్లాలో సైతం మన సభ్యులు ఉంటారని వెల్లడించారు. గతంలో మనం చేసిన ఉద్యమం ద్వారా నాలుగు నుంచి ఐదు వందల మందికి స్థానిక విద్యార్థులకు మెడికల్ సీట్లు కల్పించడంలో ఈ ఉద్యమం తోడ్పడిందని ఆయన వెల్లడించారు. అనంతరం ప్రధాన కార్యదర్శి పొడిశెట్టి రమేష్ మాట్లాడుతూ జీవో 33 అమలు కోసం ప్రారంభమైన మన పోరాటం జీవో 150 గా ప్రభుత్వ మార్చడం దానిని పకడ్బందీగా అమలు చేయడం చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. యూనివర్సిటీ వెల్లడించిన మెరిట్ లిస్టులో దాదాపు 1,000 మందికి పైగా స్థానికేతలను గుర్తించి వారి సర్టిఫికెట్లను పరిశీలించి కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ అనర్హులుగా ప్రకటించడం జరిగిందన్నారు. ఇలా చేయడం వల్ల దాదాపు 400 మంది పైగా స్థానికులకు మెడికల్ సీట్లు కల్పించడంలో ఉపయోగపడిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సభ్యులు భవిష్యత్తులో అసోసియేషన్ చేయాల్సిన కార్యక్రమాల కోసం తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

# అంగన్‌వాడీ ఉద్యోగాల భర్తీకి కసరత్తు

## దక్షిణాది రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానం అమలు

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** తెలంగాణలోని అంగన్వాడీ కేంద్రాల్లో పెద్ద ఎత్తున ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసేందుకు సర్కార్ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. ఇప్పటికే రాష్ట్రంలో అంగన్వాడీల్లో 15,274 ఉద్యోగ ఖాళీలు ఉన్నట్లు గుర్తించిన ప్రభుత్వం నియామక విధానంలో మార్పులపై దృష్టిసారించింది. ఈ ప్రక్రియ పూర్తికాగానే ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. కాగా అంగన్వాడీ కేంద్రాల్లో సిబ్బంది కొరత కారణంగా పోషకాహారం పంపిణీ, పూర్వప్రాథమిక విద్య వంటి కీలక సేవలు సక్రమంగా అందడం లేదు. సహాయకులు లేకపోవడంతో పోషకాహారం అందించడంలో సమస్యలు, అలాగే టీచర్లులేని చోట విద్యార్థులకు ప్రాథమిక విద్య అందడం కష్టంగా మారుతోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అంగన్వాడీల్లో ఖాళీల వివరాలను సేకరించి మొత్తం 15,274 ఖాళీలు ఉన్నట్లు గుర్తించింది.
ఇందులో టీచర్లు 2,999 ఖాళీలు ఉండగా, సహాయకులు 12,275 ఖాళీలు ఉన్నాయి. దీంతో వీటి నియామక విధానంలో మార్పులపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఇందులోభాగంగా అంగన్వాడీ సిబ్బంది నియామకానికి దక్షిణాది రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను శిశు సంక్షేమ శాఖ కమిటీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదించింది. ఆయా రాష్ట్రాల్లో విద్యార్హతలు, ఎంపిక విధానంపై అధికారులు అధ్యయనం చేశారు. ఈ నివేదిక ఆధారంగా తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుత నియామక విధానంలో మార్పులు తీసుకొచ్చే అవకాశం ఉంది.



చిరుతను పరిశీలిస్తున్న కలెక్టర్, జిల్లా అధికారులు

# ఎట్టకేలకు చిక్కిన చిరుత

## వీడిన పాలమూరు వాసుల భయాందోళన

**మహబూబ్‌గర్ బ్యూరో, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** గత రెండు నెలలుగా మహబూబ్నగర్ పట్టణవాసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న చిరుత ఎట్టకేలకు అధికారులకు చిక్కింది. మూడు సార్లు టీడీ గుట్ట వద్ద పెద్ద రాయిపై కూర్చుని అటు, ఇటు చూస్తున్న దృశ్యాలను వీక్షించిన ప్రజలు నిద్రలేని రాత్రులు గడిపారు. రెండు రోజుల కింద టీడీగుట్టపై మళ్లీ కనిపించడందో స్థానికులు భయాందోళన చెందారు. ఎప్పుడు తమవైపునకు వస్తుందో, ఏ రాత్రి ఇండ్లపై దాడి చేస్తుందో అని.. అయితే అధికారుల ప్రత్యేక చొరవతో డ్రోన్లు, సీసీ కెమెరాలు, బోన్ల సాయంతో, వనపర్తి జిల్లాతోపాటు హైదరాబాద్ నుంచి ప్రత్యేక బృందాలను రప్పించి తీసుకున్న చర్యలు ఫలించాయి. మహబూబ్ నగర్ జిల్లా వీరన్నపేట, టి.డి. గుట్ట ప్రాంతంలో గత కొన్ని రోజులుగా కనిపిస్తున్న చిరుతను సోమవారం ఉదయం విజయవంతంగా అటవీ శాఖ అధికారులు పట్టుకున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. సోమవారం పట్టుకున్న చిరుతను జిల్లా అటవీ అధికారి కార్యాలయం లో జిల్లా కలెక్టర్ పరిశీలించి అటవీ సిబ్బందిని అభినందించారు. జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్. సత్యనారాయణ మాట్లాడుతూ ఉదయం సుమారు 7:30 గంటలకు ట్రాప్ కేజ్లో చిక్కిన ఈ ఆడ చిరుతను, ఫీల్డ్ డ్యూటీలో ఉన్న సిబ్బంది ఉదయం 10:30 గంటలకు గుర్తించారు. వెంటనే ప్రాంతాన్ని చుట్టుముట్టి భద్రత కల్పించి, స్థానిక ప్రజల రాకపోకలు నిలిపివేసి, పోలీసుల సహకారంతో ప్రాంతాన్ని సురక్షితం చేశారు. వెటర్నరీ వైద్యుడిని పిలిపించి చిరుతను పరిశీలించగా, కేజ్లో తన్నుకోవడం వలన స్వల్ప గాయాలు ఉన్నట్లు గుర్తించారు. ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 2:30 గంటల వరకు సిబ్బంది ట్రాక్టర్ సహాయంతో కేజ్ ను కొండపై నుంచి కిందికి తీసుకువచ్చి, మధ్యాహ్నం 2:30 గంటలకు డీసీఎం వాహనంలో ఎక్కించి నెహ్రూ జూలాజికల్ పార్క్, హైదరాబాద్కు సురక్షితంగా తరలించారని తెలిపారు. అక్కడ చిరుతకు వైద్య చికిత్స కల్పించి దగ్గరలో ఉన్న అటవీ ప్రాంతంలో చిరుతను వదిలి వేస్తారని ఆయన వెల్లడించారు.

# పోలీసు సంస్కరణల ప్రాజెక్టుకు సైబరాబాద్, సంగారెడ్డి ఎంపిక

## రెండుచోట్ల పైలట్ ప్రాజెక్టుగా 30 పోలీసుస్టేషన్లలో అమలు

## ఐపిఎఫ్‌తో టి.పోలీసు ఎంఒయు

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** తెలంగాణలో పోలీసు సంస్కరణల అమలుకు సైబరాబాద్, సంగారెడ్డి జిల్లాలో 30 పోలీసు స్టేషన్లను ఎంపిక చేశారు. ఇందుకు గానూ ఇండియన్ పోలీసు ఫౌండేషన్ (ఐపిఎఫ్) ప్రతినిధులతో డిజిపి జితేందర్ సోమవారం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ప్రాజెక్టు అమలుకు గత ఆగస్టు నెలలో సర్కారు ఆమోదం తెలపగా దీనిని సోమవారం అధికారికంగా ఆమోదముద్ర వేశారు. ఐపిఎఫ్‌ను ఢిల్లీలో 2014లో మేఘాలయ మాజీ డిజిపి రామచంద్రన్ స్థాపించగా ఆ తరువాత దేశ వ్యాప్తంగా దీని విస్తరణ జరిగిందని డిజిపి జితేందర్ ఈ సందర్భంగా తెలిపారు. దేశంలో పోలీసు సంస్కరణలను వేగంగా అమలు చేయడంతో పాటు, ప్రజలతో పోలీసు శాఖ మమేకం అవడంతో పాటు ప్రజలకు మరింత భద్రత కల్పించడం, దీని లక్ష్యమని ఆయన తెలిపారు.
ఐపిఎఫ్‌లో విశ్రాంత సీనియర్ ఐపిఎస్ అధికారులతో పాటు విద్యావేత్తలు, పరిశోధ కులు, బ్యూరోక్రాట్లు వుంటారని, వీరంతా ఒక బోర్డు కింద పనిచేస్తారని డిజిపి తెలిపారు. పోలీసు సంస్కరణల అమలు ద్వారా ప్రజలకు పోలీసుల పై మరింత విశ్వాసం పెరుగుతుందని ఆయన తెలిపారు. తెలంగాణలో ఇప్పటికే అమలవుతున్న మీ సేవ, క్యూఆర్ కోడ్ వ్యవస్థ, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, మహిళల కోసం టి.సేఫ్ వంటి కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నాయని ఆయన అన్నారు. పోలీసు సంస్కరణలకుగానూ సైబరాబాద్, సంగారెడ్డిలో 30 పోలీసు స్టేషన్లను ఎంపిక చేశామని ఆయన తెలిపారు. ఐపిఎఫ్ అధ్యక్షుడు విశ్రాంత డిజి ఓం ప్రకాష్ మాట్లాడుతూ పరి శోధన, సామర్థ్యాభివృద్ధి, విధాన రూపకల్పన ద్వారా పోలీసింగ్‌ను మెరుగు పరచడం తమ లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే ఐపిఎఫ్ హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు, పంజాబ్, కేరళ, ఉత్తరప్రదేశ్‌లలో విభాగాలను ఏర్పాటు చేసిందని ఇప్పుడు తెలంగాణలో ఏర్పాటవుతుందని ఆయన తెలిపారు. ఐపిఎ ఫ్ ఉపాధ్యక్షుడు, ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఈష్ కుమార్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ద్వారా పౌరుల ఫిర్యాదులను సత్వరం పరిష్కరించడం, మహిళల భద్రత, ప్రజలు కోరుకున్నట్లుగా పోలీసింగ్ ఏర్పాటడం, పోలీసుల కోసం మంచి వాతావరణ కల్పించడం ముఖ్యంగా వున్నాయని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టు ఏడాది పాటు నిర్వహించిన తరువాత స్వతంత్ర సంస్థ ద్వారా పరిశీలన చేయిస్తామని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టు అమలు కోసం పోలీసులకు శిక్షణ



ఇస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్, పర్సనల్ విభాగం అదనపు డిజి అనిల్ కుమార్, ఐపిఎఫ్ ప్రతినిధులు కోడె దుర్గా ప్రసాద్. శరత్ కుమార్, ఐజిలు చంద్రశేఖర్ రెడ్డి, రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మరో రూ.35 వేల కోట్ల రుణం

## రిజర్వ్ బ్యాంక్ అనుమతి కోసం సర్కార్

## రూ.2,34,500 కోట్లకు చేరిన అప్పు

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** రుణాలకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అభివృద్ధి పనుల్లో మరింత వేగం పెంచేందుకు రాష్ట్ర సర్కార్ సిద్ధమైంది. ఇందు కోసం రూ.35వేల కోట్ల మేర రుణాలను తీసుకోవాలని నిర్ణయించింది. ఈ రుణం నిమిత్తం రిజర్వ్ బ్యాంక్‌కు ప్రతిపాదనలు పెట్టి వాటికి అందుకు అనుమతి కోరింది. ఈ రుణంలో యంగ్ ఇండియా స్కూల్స్ కోసం 35వేల కోట్లు ఖర్చు చేయనుంది. వెయ్యి కోట్లను సాధారణ ఖర్చుల కోసం, మూసీ సుందరీకరణ కోసం 4వేల 100 కోట్లు కావాలని ఈ ప్రతిపాదనల్లో పేర్కొంది. అలాగే యంగ్ ఇండియా స్కూల్స్ కోసం 30వేల కోట్లు కావాలని ఆర్బీఐ దృష్టికి తీసుకెళ్లింది. ఈ కొత్త అప్పుతో ఇప్పటివరకు కాంగ్రెస్ సర్కార్ చేసిన అప్పు 2లక్షల 34వేల 500 కోట్లకు చేరింది. రేవంత్ సర్కార్ 21 నెలల్లోనే అప్పు ఇంతకు చేరుతోంది. జూలై 31 నాటికి, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న రుణాలు రూ.24,669.88 కోట్లుగా ఉండగా, వార్షిక అంచనా బడ్జెట్‌లో మొత్తం రూ.54 వేల కోట్లు సేకరించనున్నట్లు పేర్కొంది. కాగా రోజు రోజుకు సర్కార్ ఖజానాకు ఆదాయం తగ్గుతూ వస్తోంది. రాష్ట్ర ఖజానాకు ప్రధాన ఆదాయ వనరులైన జీఎస్టీ, ల్యాండ్ రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, సేల్ టాక్స్, ఎక్సైజ్ ఆదాయం గడిచిన నాలుగు నెలల్లో పెరగకపోగా తగ్గుతూ వస్తుండటం సర్కార్‌కు మరింత గుదిబండగా మారింది.
గతేడాది కంటే ఈ ఏడాది జీఎస్టీలో 3శాతం, సేల్స్ ట్యాక్స్‌లో 2శాతం, స్టేట్ ఎక్సైజ్ పన్నులో 2.50 శాతం, ల్యాండ్ రెవెన్యూ ఆదాయం 2.3 శాతం తగ్గింది. మరోవైపు అప్పులు మాత్రం ఈ నాలుగు నెలల్లో 45 శాతం రుణాలు చేసింది. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జూలై వరకు నాలుగు నెలలకు రాష్ట్ర ఖజానాకు 74,955 కోట్ల రూపాయల మేర ఆదాయం సమకూరింది. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రుణాలు రూ.24,670 కోట్లు తీసుకుంది. ఇక రుణాల నిమిత్తం వడ్డీ చెల్లింపుల కింద రూ.9,355 కోట్లు ఖర్చు చేసింది. ప్రభుత్వం జూలై నాటికి రూ.68,823 కోట్లు లేదా వార్షిక కేటాయింపులో 26.1 శాతం ఖర్చు చేసింది. రెవెన్యూ వ్యయం ఒక్కటే రూ.62,835 కోట్లు ఖర్చయింది.
జీతాలు, పెన్షన్లు, సబ్సిడీలు మరియు వడ్డీ చెల్లింపుల ద్వారా ఇది జరిగింది. రూ.36,504.45 కోట్ల వార్షిక లక్ష్యంలో 16.4 శాతం అంటే రూ.5,988 కోట్ల మాత్రమే ఉన్న పేలవమైన మూలధన వ్యయం ఆందోళనకరంగానే ఉంది. గత ఏడాది ఇదే కాలానికి 22.77 శాతంగా ఉన్న రాష్ట్రం, ఇప్పటివరకు రుణాలు మరియు అప్పులు వార్షిక రుణ పరిమితిలో 45.7 శాతానికి చేరుకున్నాయి. ఈ పరిస్థితుల్లో అభివృద్ధి పనుల కోసం మరో 35 వేల కోట్ల రూపాయల మేర రుణం చేయాల్సిన తప్పనిసరి పరిస్థితులు ఏర్పాడ్డాయి.

# జర్నలిస్టుల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నాం

## అక్రెడిటేషన్ విధానంపై కార్యాచరణ ప్రణాళిక

## జర్నలిస్టుల సమస్యలపై మంత్రి పొంగులేటి సమీక్ష



**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు అందేలా విధివిధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం అంబేద్కర్ సచివాలయంలో హోమ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రవిగుప్తా, ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, ఐఅండ్ పిఆర్ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, సిపిఆర్‌ఒ జి.మల్సూర్‌తో కలిసి సమీక్ష నిర్వహిం చారు. ఈ సమావేశంలో ప్రధానంగా అక్రెడిటేషన్ పాలసీ, జర్నలిస్ట్‌ల హెల్త్‌పాలసీ, జర్నలిస్టుల అవార్డులు, జర్నలిస్టులపై దాడులకు సంబంధించి హైపవర్ కమిటీ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాతూ జర్న లిస్టులపై దాడులు జరగకుండా ప్రభుత్వం అన్నీచర్యలు తీసుకుంటుందని, ఇందుకోసం హైపవర్ కమిటీని కూడా పునరుద్ధరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఉమ్మడి రాష్ట్రంలో 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జిఒ జారీ చేసిందని, తెలంగాణ ఏర్పడ్డాక ఆ ఊసే ఎత్తలేదన్నారు. అలాగే, జర్నలిస్టుల జీత భత్యాలకు సంబంధించి త్రైపాక్షిక కమిటీని పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల హెల్త్ పాలసీపై సమగ్రంగా చర్చించా మని, ఇన్సూరెన్స్ పాలసీలో ఏది జర్నలిస్టులకు ప్రయోజనకరంగా ఉంటుందో అనే అంశంపై ఆరోగ్యశ్రీ విభాగంతో కలిసి లోతైన అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. అక్రెడిటేషన్ పాలసీపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. జర్నలిస్టుల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను తక్షణమే రూపొందించాలని అధికారులకు సూచించారు.
జర్నలిస్టులకు అవార్డులను పునరు ద్ధరించాలన్న ప్రెస్ అకాడెమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి పట్ల మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశ్రీ సి.ఇ.ఓ. ఉదయ్ కుమార్, కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి నదీపరీవాహక ప్రాంతం మూడు భాగాలుగా అధ్యయనం

## డబ్ల్యుఐఐ డీన్ రుచిబదోలా

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** గోదావరి పరివాహక ప్రాంతాన్ని మూడు భాగాలుగా అధ్యయనం చేశామని మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మహారాష్ట్రతో పోలిస్తే తెలంగాణలో గోదావరి తక్కువ కాలుష్యానికి గురైందని డబ్ల్యూఐఐ (వైల్డ్ లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా) డీన్ డాక్టర్ రుచిబదోలా అన్నారు. సోమవారం వైల్డ్ లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా(డబ్ల్యూఐఐ) ఆధ్వర్యంలో ఒక ప్రైవేట్ హోటల్లో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ భారతదేశంలోని నదుల పర్యావరణ పరిస్థితులను అంచనా వేసి వాటి సంరక్షణ కోసం సరైన ప్రణాళికలు అమలు చేయడానికి మొత్తం 7 నదులను ఎంపిక చేసినట్ల తెలిపారు. నదుల్లో ఇసుక క్వారీల నియంత్రణ సరైన విధంగా అమలు కావడంలేదని, మితిమీరిన ఇసుక తవ్వకాల వల్ల భవిష్యత్తులో ఆనకట్టలు, వంతెనలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాగే, నదీ జలాల పక్కన నీటిని శుద్ధి చేసి చెట్లు, గడ్డి జాతుల మొక్కలు నాటాలని సూచించారు. సుమారు 25 ఏళ్ల క్రితం భారతదేశంలోని నదులు, చెరువుల్లో విదేశీ జాతుల చేప పిల్లలను (ప్రధానంగా ఆఫ్రికన్ జాతి) విడిచారని, ప్రస్తుతం అవి స్థానిక భారతీయ చేపల కంటే ఎక్కువగా విస్తరించినట్లు గుర్తించామని తెలిపారు. ముఖ్యంగా కార్ప్ టిలాపియా అనే చేపలు దేశవ్యాప్తంగా అధిక సంఖ్యలో ఉన్నట్లు గుర్తించామని వెల్లడించారు.
వలల వాడకం విషయంలో కూడా ప్రత్యేక దృష్టి అవసరమని నిపుణులు సూచించారు. చిన్నపల్ల చేపలను కూడా పట్టే విధంగా వలలను ఉపయోగించడం వల్ల స్థానిక జాతుల పెంపకం దెబ్బతింటుందని, ఇది భవిష్యత్తులో చేపల జనాభా తగ్గిపోవడానికి దారి తీస్తుందని హెచ్చరించారు. అందువల్ల మత్స్యకారులు శాస్త్రీయ పద్ధతిలో వలలను వాడాలని, చిన్న చేపలకు పెరుగుదలకు అవకాశం ఇవ్వాలని సూచించారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని పర్యావరణ పరిస్థితులను క్రమం తప్పకుండా పర్యవేక్షించడం ద్వారా మాత్రమే నది జీవవ్యవస్థను కాపాడగలమని, రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంతోసమన్వయం చేసుకొని సంరక్షణ చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అటవీ దళాల ప్రధాన సంరక్షిణాధికారిణి డాక్టర్ సువర్ణ జియోలాజిక్ సర్వే ఆఫ్ ఇండియా సైంటిస్ట్ పాండి, పిసిబి నుంచి డాక్టర్ ప్రసాద్, గోదావరి రివర్ మేనేజింగ్ బోర్డ్ మెంబెర్(టెక్నికల్) ఇరిగేషన్, సిసిఎంబి చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ ఉమాపతి, సిసిఎంబి ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కార్తికేయన్, బయో డైవర్సిటీ నుంచి శిల్పి శర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

## ప్రైవేటు కళాశాలల మేనేజ్‌మెంట్ నిర్ణయానికి మద్దతు

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలని కోరుతూ ప్రైవేట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్లు కాలేజీలు బంద్‌కు బిజెపి మద్దతు ఇస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కాలేజీలకు భారీగా బకాయిలు పెరగడంతో, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితులు ఎదురయ్యాయి. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ కాలేజీలు తాత్కాలికంగా మూసివేయాల్సిన పరిస్థితికి వచ్చాయి. ఇది రాష్ట్ర ప్రభుత్వ చర్య వల్ల ఏర్పడిన పరిస్థితి అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లు పైగా ఉన్నప్పటికీ, రెండేళ్లుగా ఒక్క పైసా కూడా విడుదల చేయడం లేదని, ఫీజు రీయింబర్స్ మెంట్ లేకపోవ డంతో ప్రైవేట్ కాలేజీలు ప్రొఫెసర్లు, లెక్చరర్స్, టీచర్లకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వం గత ఆరు నెలలుగా ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలతో మాట్లా డుతూ మేమ త్వరలో పరిష్కారం చేస్తాం" అని చెప్పినా, ఇప్పటి వరకు ఎటువంటి స్పష్టమైన నిర్ణయం గానీ పెండింగ్ బకాయిలు విడుదల చేయలేదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ విద్యార్థులకు రూ.5 లక్షల విద్యాభరోసా కార్డులు ఇస్తామని వాగ్దానం చేసింది. కానీ ఈ వాగ్దానం ఇప్పటి వరకు అమలుకావడం లేదన్నారు. విద్యా వ్యవస్థను కాపాడాల్సిన బాధ్యత తెలంగాణ ప్రభుత్వం మీదే ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఉన్న వ్యవస్థ మరింత కూలిపోయే పరిస్థితికి లోనవుతుందని అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ. 1000 కోట్లు నిధులు ఇస్తామని వాగ్దానం చేశారు. కానీ రాష్ట్రంలో పరిస్థితి రిటైర్డ్ టీచర్లకు పెన్షన్లు కూడా ఇవ్వని పరిస్థితి దాపురించింది. భారతీయ జనతా పార్టీ ప్రైవేట్ మేనేజ్మెంట్స్ తీసుకున్న నిర్ణయాన్ని పూర్తిగా మద్దతు పలుకుతుందన్నారు. కొత్త యూనివర్సిటీలకు కనీసం భవన నిర్మాణాలు చేయకపోవడం సబబుకాదు. ఇప్పటికైనా అవసరమైన మేరకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. విద్యా వ్యవస్థను కాపాడడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన బాధ్యత అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, కొత్త భవనాల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు.

# 'సెప్టెంబర్17' పై బిజెపి కల్లబొల్లి మాటలు కట్టిపెట్టాలి

## సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** తెలంగాణ గవర్నర్ బిజెపికి చప్రాసి మాదిరిగా వ్యవహరిస్తున్నారని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ..రాష్ట్రంలో సెప్టెంబర్ 17న బిజెపి సర్కార్ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 17 గురించి తెలంగాణ ప్రజలకు బిజెపి నేతలు వక్ర భాష్యం చెబుతున్నారని మండిపడ్డారు. నాడు తెలంగాణ సాయుధ పోరాటంలో రాజాకార్లకు వ్యతిరేకంగా ప్రాణాలకు ఎదురొడ్డి పోరాడింది కేవలం కమ్యూనిస్టులు మాత్రమేనని అన్నారు. రాష్ట్ర బిజెపినేతలు ఏది చెబితే రాష్ట్ర గవర్నర్ అందుకు తలాడిస్తున్నాడని



నారాయణ కామెంట్ చేశారు. ప్రతి ఏటా సెప్టెంబర్ 17 రాగానే హడావుడి చేయడం వారికి పరిపాటిగా మారిందన్నారు. ఏనాడైనా ప్రజలకు అండగా ఉండి పోరాటం చేసిన చరిత్ర కమ్యూనిస్టులదేనన్నారు. 1925లో సీపీఐ పార్టీ, ఆర్ఎస్ఎస్ పుట్టాయని..భారత స్వాతంత్య్ర ఉద్యమంలో ఏ ఒక్క ఆర్ఎస్ఎస్ కార్యకర్త పాల్గొనలేదన్నారు. బ్రిటీష్ లాఠీ, బుల్లెట్ దెబ్బలు వారికి తగలేదని అన్నారు. 4,500 మంది కమ్యూనిస్టులు దేశ స్వాతంత్రం కోసం తమ ప్రాణాలర్పించారని నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర బిజెపి నేతలు సెప్టెంబర్ 17పై కల్లబొల్లి మాటలు బంద్ చేయాలని నారాయణ హితవు పలికారు.

# పోక్సో కేసులో నిందితుడికి 21 యేళ్ల జైలు

## నల్గొండ న్యాయస్థానం సంచలన తీర్పు!

## బాలికకు రూ.10 లక్షల పరిహారం

**చిట్యాల రూరల్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త :** ఎనిమిదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు దోమల రాములుకు 21 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.30 వేల జరిమానా విధిస్తూ నల్గొండ జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి రోజా రమణి సోమవారం తీర్పు చెప్పారు. పరిహారం కింద బాలికకు రూ.10 లక్షలు చెల్లించా లంటూ న్యాయమూర్తి తన తీర్పులో ఆదేశించారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు కేసు వివరాలు ఇలా ఉన్నాయి.. నల్గొండ జిల్లా చిట్యాల మండలంలోని వనిపాకల గ్రామానికి చెందిన దోమల రాములు 2018 ఫిబ్రవరి 1న మద్యం మత్తులో ఆగ్రామంలోని ఓ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించాడు. ఇంట్లో ఒంటరిగా ఉండి టీవీ చూస్తున్న ఎనిమిదేళ్ల బాలికను బెదిరించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు చెప్పగా తండ్రి ఫిబ్రవరి 11న చిట్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రాములుపై పోక్సో కేసు నమోదు చేసి కె. భాస్కర్ రెడ్డి, డి. సైదాబాబు, కె. పాండురంగారెడ్డి దర్యాప్తు చేపట్టి న్యాయస్థానంలో నేరారోపణ పత్రాన్ని దాఖలు చేశారు. ఈకేసు ఎనిమిదేళ్లుగా నల్గొండ జిల్లా పోక్సో న్యాయస్థానంలో విచారణ కొనసాగింది. సుదీర్ఘ విచారణ అనంతరం 2025 సెప్టెంబర్ 15న (నేడు సోమవారం) నేరం రుజువు కావడంతో న్యాయస్థానం నిందితుడికి పైవిధంగా శిక్ష విధించింది. ప్రాసిక్యూషన్ తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్ కుమార్ వాదించారు. న్యాయ సలహాదారుగా భరోసా కేంద్రం లీగల్ ఆఫీసర్ మామిడి కల్పన వ్యవహరించారు.



జూబ్లీహిల్స్ నియోజక వర్గం వెంగళరావునగర్ డివిజన్ బూత్‌స్థాయి కమిటీ సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి కెటిఆర్

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బిఆర్ఎస్ గెలుపునకు కలిసికట్టుగా పనిచేయాలి: మాజీమంత్రి కెటిఆర్

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉపఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ గెలుపునకు బూత్ స్థాయి నుంచి కలిసికట్టుగా పనిచేసి గెలిపించుకోవాలని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని వెంగళరావునగర్ డివిజన్ బూత్ కమిటీ సమావేశంలో దివంగత ఎమ్మెల్యే సతీమణి మాగంటి సునీత గోపినాథ్‌తో పాటు ఎల్బీనగర్ ఎమ్మెల్యే వెంగళరావునగర్ నగర్ డివిజన్ ఇన్‌చార్జ్ సుధీర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ విజయంతోనే గోపినాథ్‌కు ఘన నివాళి అన్నారు. ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలతో మోసం చేసిన ఘనత కాంగ్రెస్‌దే అని అన్నారు. రేవంత్ ప్రభుత్వం ఫీజు రియింబర్స్‌మెంటు విషయంలో విద్యార్థులను మోసం చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత అధికారంలోకి రాగానే 20వేలకోట్ల ఫీజు రియింబర్సు మెంటు అందించామని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలకు ఉద్యోగ జీతాలకు డబ్బులు పూర్తిగా ఖర్చు అవుతున్నాయని ఫీజు రియింబర్స్‌మెంటుకు డబ్బులు లేవని ఉపముఖ్యమంత్రి చెప్పడం హాస్యస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో రైతులకు యూరియా కొరతకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని అందుకు నిదర్శనగా మిరియాలగూడ ఎమ్మెల్యే గన్‌మాన్ ఏకంగా లారీ యూరియాను అక్రమంగా ఎత్తుకెళ్ళిపోయాడని గన్‌మానే యూరియా ఎత్తుకుపోతే ఎమ్మెల్యే ఎంత ఎత్తుకుని పోయాడో అన్నారు. దోపిడీలకు బ్రాండ్ అంబాజిడర్‌గా కాంగ్రెస్ పనిచేస్తుందన్నారు.

# విమోచన దినోత్సవం కాదు, విలీనమేనని బిజెపి గుర్తుంచుకోవాలి

## మాజీ ఎంపి వి.హనుమంతరావు

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** విమోచన దినోత్సవం కాదు, విలీనం అని మాత్రమే బిజెపి గుర్తుంచుకోవాలని మాజీ ఎంపి వి.హనుమంతరావు అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. మోడీ ఆపరేషన్ సిందూర్ అంటున్నాడని, పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ అవసరమా? అంటూ ప్రశ్నించారు. పాకిస్థాన్‌తో మ్యాచ్ పెట్టారని అమరుల కుటుంబాలు ఎడుస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉగ్రవాదులకు సపోర్ట్ చేస్తుందని మోడీ అంటున్నారని, ఉగ్రవాదులకు నెహ్రూ, ఇందిరా గాంధీ బలైపోయారన్నారు. దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలు అర్పించిన నెహ్రూ కుటుంబాన్ని అవమానిస్తారా? అన్నారు. స్వాతంత్రం 1947 లోనే వచ్చిందని, స్వాతంత్రంలో బిజెపి పాత్ర చెప్పాలన్నారు. బిజెపి ఏమి చేసిందో చెప్పాలన్నారు. అసలు మీ బిజెపి ఎక్కడుంది అన్నారు. మోడికి, కిషన్ రెడ్డికి నెహ్రూ కనిపించట్లేదా?అన్నారు. వల్లభాయ్ పటేల్ హీరో, నెహ్రూ జీరో అంటున్నారని ఇది పద్దతి కాదన్నారు. నెహ్రూను పక్కనబెడుతున్నారని అన్నారు. పటేల్‌ను మేము గౌరవిస్తాం, ఆయన కాంగ్రెస్ పార్టీకానీ నెహ్రూను పక్కన పెట్టాలని చూస్తున్నారు అన్నారు. నెహ్రూను అవమానిస్తే ఉరుకునేది లేదన్నారు.



# పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను అభినందించిన మంత్రి పొన్నం

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** టిపిసిసి చీఫ్‌గా మహేష్ కుమార్ గౌడ్ పదవీబాధ్యతలు స్వీకరించి యేడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా పలువురు మంత్రులు, నేతలు ఆయనను అభినందించారు. సోమవారం నివా సానికి వెళ్లి మహేష్‌కుమార్‌గౌడ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు తెలిపారు. మంత్రితోపాటు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, టిఎస్ఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి రుద్ర సంతోష్, ప్రవీణ్‌కుమార్ కొప్పుల అభినందనలు తెలిపారు.

# దేవదేవుని దర్శనం మహాద్భాగ్యం

## శ్రీవారిని దర్శించుకున్న మారిషస్ ప్రధాని డాక్టర్ నవీన్‌చంద్ర

**తిరుమల,సెప్టెంబర్ 15ప్రభాత వార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం మహద్భాగ్యమని, తనకెంతో అనుభూతికలిగించిందని మారిషస్ ప్రధానమంత్రి డాక్టర్ నవీన్‌చంద్ర రాంగులం,వీణా రాంగులం తెలిపారు. స్వామివారి దర్శనం అద్భుతంగా జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం తిరుమలకు చేరుకున్న మారిషస్ ప్రధాన మంత్రి డాక్టర్ నవీన్‌చంద్ర రాంగుళం, వీణారాంగుళం దంపతులు సాయంత్రం నైవేద్యవిరామసమయంలో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ మహద్వారం వద్ద ఆంధ్రప్రదేశ్‌మంత్రి రాంనారాయణరెడ్డి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ అనిల్ కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.



అనంతరం ఆలయం వెలుపల భక్తులతో కరచాలనం చేసి అందరినీ ఆప్యాయంగా పలకరించారు. స్వామివారి దర్శనానంతరం తిరుగుప్రయాణమయ్యారు. శ్రీవారి దర్శనార్థం సాయంత్రం తిరుమలకు వచ్చిన మారిషస్ ప్రధాని రాంగుళం దంపతులకు పద్మావతి విశ్రాంతి గృహాల సముదాయం వద్ద ఆంధ్రప్రదేశ్‌మంత్రి రాంనారాయణరెడ్డి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.



నవీన్‌మిట్టల్‌ను సన్మానిస్తున్న రత్నాకర్‌రావు, జనప్రియ, వెంకటేశ్వర్లు, సౌమ్యానాయక్ తదితరులు

# వేగంగా విద్యుత్ నెట్‌వర్క్ విస్తరణ

## దానికి అనుగుణంగా ఇంజినీర్లు పనిచేయాలి

## ఎనర్జీ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** దేశంలోగానీ, రాష్ట్రంలోనిగానీ విద్యుత్ నెట్‌వర్క్‌వేగంగా విస్తరిస్తుందని దానికి అనుగుణంగా ఇంజనీర్లు పనిచేయాలని ఎనర్జీ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ అన్నారు. ఈమేరకు సోమవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య 165 వ జయంతి సందర్భంగా జరిగిన ఇంజనీర్సడే వేడుకలను తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ (టిజిపిఈఏ) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టిజిజెన్కో ఆడిటోరియంలో నిర్వహించిన ఈకార్యక్రమానికి నవీన్‌మిట్టల్‌తోపాటు, జెన్కో సిఎండీ హరీష్, టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండీ ముషారఫ్ ఫరూఖీ, వివిధ సంస్థల డైరెక్టర్లు పాల్గొన్నారు. ఈసందర్భంగా నవీన్‌మిట్టల్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఇంజనీర్ల సేవలను కొనియాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎనర్జీకి ఇస్తున్న ప్రాముఖ్యతను వివరించారు. దేశంలో ఇప్పటికే కన్వెన్షనల్ ఎనర్జీ కెపాసిటీ కంటే రెన్యువబుల్ ఎనర్జీ ఇన్నాల్ కెపాసిటీ ఎక్కువగా ఉందన్నారు. అదే విధంగా బ్యాటరీ స్టోరేజ్ సిస్టం ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఈ సిస్టం ద్వారా విద్యుత్ టారిఫ్ ను ఎలా కంట్రోల్ చేసుకోవచ్చు తెలియజేశారు.అలాగే విద్యుత్ సంస్థలలోని మాన్‌పవర్ రిక్రూట్మెంట్ ,ప్రమోషన్లు , సాంక్షన్ పోస్టులు, ట్రాన్స్ఫర్ పాలసీ,జిపిఎఫ్ వంటి విషయాల్లో త్వరలోనే పరిష్కారం చూపే విధంగా ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. టీజీ ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ ఫరూఖీ మాట్లాడుతూ విద్యుత్ ఇంజనీర్లు చాలా నిబద్ధతతో నిరంతరం పనిచేస్తారని కొనియాడారు. హైదరాబాదులో కుండ పోత వర్షం ఉన్నప్పటికీ నెట్వర్క్ ఫెయిల్ కాకుండా మెయింటైన్ అవుతుందని అది సంస్థలోని ఇంజనీర్ల కృషివల్లనేనని పేర్కొన్నారు. అలాగే హైదరాబాదు పట్టణంలో మొత్తము అండర్ గ్రౌండ్ కేబుల్ సిస్టంని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ప్రెసిడెంట్ రత్నాకర్ రావు, అసోసియేట్ ప్రెసిడెంట్ జనప్రియ, అడిషనల్ జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్లు,ఎన్‌పిడిసిఎల్ సెక్రటరీ సౌమ్యా నాయక్ ఇతర రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# బీహార్ అభివృద్ధిని జీర్ణించుకోలేని కాంగ్రెస్, ఆర్జేడి!

## పూర్ణియా జిల్లాలో విపక్షాలపై ప్రధాని మోడీ ధ్వజం

**పాట్నా, సెప్టెంబరు 15:** ఆర్‌జేడీ, కాంగ్రెస్ అస్తవ్యస్త పాలన కారణంగా బీహార్ తీవ్రంగా నష్టపోయిందని ప్రధాని నరేంద్ర మోడీ విమర్శించారు. ప్రస్తుతం తాము చేపడుతున్న అభివృద్ధిని చూసి ఆ రెండు పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయని అన్నారు. బీహార్‌లోని పూర్ణియా జిల్లాలో పర్యటించిన ప్రధాని, జాతీయ మఖానా బోర్డుతో పాటు 36 వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పేదలకు మద్దతివ్వటమే తన మోటో అని ప్రధాని మోదీ తెలిపారు. అందులో భాగంగానే నాలుగు కోట్ల ఇళ్లను పేదలకు నిర్మించి ఇచ్చామని చెప్పారు. మరో మూడు కోట్ల గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయని వెల్లడించారు. బీహార్ ప్రజలను కాంగ్రెస్ పార్టీ బీడీలతో పోల్చడాన్ని ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. ఇది బీహారీలకు అవమానించడమే అవుతుందని అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఇండియా కూటమికి పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. రాష్ట్రంలో అక్రమ ప్రవేశాలకు ఆశ్రయం ఇచ్చిందని ఆరోపించారు. ఎన్‌డీఏ ప్రభుత్వం వారిని రాష్ట్రం నుంచి తరిమివేస్తుందని పేర్కొన్నారు. బీహార్, దేశ అభివృద్ధి, భద్రత, రక్షణలో ఎప్పుడూ తమ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. ఆర్‌జేడీ, కాంగ్రెస్ నాయకులు కేవలం తమ కుటుంబాల గురించే ఆలోచిస్తారని మోడీవిమర్శించారు. తాను మాత్రం వికసిత్ భారత్‌లక్ష్యంతోనే పని చేస్తానని తెలిపారు. బీహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే వ్యతిరేకిస్తున్నాయని ప్రధాని మోడీ అన్నారు. బీహార్ గుర్తింపును కూడా ఆ పార్టీలు నాశనం చేసినట్లు ఆయన ఆరోపించారు. కాంగ్రెస్, ఆర్‌జేడీ కలిసి చొరబాటుదారులను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. విదేశాల నుంచి వచ్చిన వారి కోసం ఇలాంటి యాత్రలు చేస్తున్నారని అన్నారు.

బీహార్ ప్రజలకు ఓ విషయం సరిగ్గా అర్థం చేసుకోవాలనుకుంటున్నాని అన్నారు. చొరబాటుదారులు ఎవరైనా వెళ్లిపోవాల్సిందే, వారని అడ్డుకునే బాధ్యత ఎన్‌డీఏకు ఉందని చెప్పారు. ఇదే ర్యాలీలో ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రం, దేశం కోసం ప్రధాని మోదీ ఎంతో కృషి చేశారని అన్నారు. ప్రధానమంత్రి కొత్త టెర్మినల్ భవనమైన పూర్ణియా విమానాశ్రయాన్ని ప్రారంభించారు. ఇది ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుంది. రూ. 40వేల కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు, శంకుస్థాపన చేశారు. బీజేపీ, జేడీయూ



ప్రభుతం మొదట 2005 నవంబర్ 24 ఏర్పాటైంది. అప్పటి నుంచి ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తోంది. ఇలాంటి తప్పులు మళ్లీ జరిగే ప్రశ్నే లేదు. బీజేపీ జేడీయూ కలిసి పని చేస్తాయని నీతీశ్ కుమార్ తెలిపారు.

# పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలి

## అసెంబ్లీ అదనపు కార్యదర్శికి రిజాయిండర్లు ఇచ్చిన బిఆర్‌ఎస్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 15:** పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ సభాపతికి విజ్ఞప్తి చేసినట్లు తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు శాసనసభ ప్రాంగణానికి వెళ్లి శాసనసభ అదనపు కార్యదర్శి ఉపేందర్ రెడ్డిని కలిశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారిపై మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసిందని శాసనసభ అదనపు కార్యదర్శికి తెలియజేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఇచ్చిన వివరణను అధికారులు తమకు తెలియజేశారని, వారి వివరణపై బీఆర్ఎస్ పార్టీ నిర్ణయాన్ని తెలియజేయడానికి మూడు రోజులు గడువు ఇచ్చారని జగదీశ్ రెడ్డి మీడియాకు తెలిపారు.

కాగా పార్టీ మారిన బాన్స్‌వాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ,గద్వాల్ ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి ,చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య ,భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ ,పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ,జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌లు స్పీకర్‌కు ఇచ్చిన సమాధానాల పై సోమవారం అసెంబ్లీ అదనపు కార్యదర్శి ఉపేందర్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ తరపున బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు జి.జగదీష్ రెడ్డి,కె.పి. వివేకానంద, చింతా ప్రభాకర్ రిజాయిండర్లు సమర్పించారు.

పార్టీ మారిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి,దానం నాగేందర్‌లు స్పీకర్ నోటీసులకు స్పందించక పోవడంతో వారిపై రిజాయిండర్లు ఇవ్వలేదు.

ఎమ్మెల్యేలు అరికె పూడి గాంధీ,ప్రకాష్ గౌడ్‌ల పై పిటిషన్ వేసిన బిఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ విదేశాల్లో ఉండటంతో ఆయన తిరిగి రాష్ట్రానికి వచ్చిన తర్వాత మూడు నాలుగు రోజుల్లో వారిద్దరి సమాధానాలపై రిజాయిండర్లు ఇవ్వాలని బిఆర్ఎస్ నిర్ణయించింది.

# రాష్ట్రంలో పూర్తి స్థాయిలో కేంద్ర పథకాల అమలు

## నిధులు రాబట్టేందుకు ఆర్థిక శాఖ ప్రణాళికలు

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** కేంద్రం నుండి సాధ్యమైనన్ని ఎక్కువ నిధులను రాబట్టాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర సర్కార్ ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా కేంద్రం అమలు చేస్తున్న ప్రాయోజిత పథకాలను రాష్ట్రంలో పూర్తి స్థాయిలో అమలు చేయాలని నిర్ణయించింది. తద్వారా కేంద్రం నుండి వీలైనన్ని గ్రాంట్లు రాష్ట్రానికి అందేలా ఆర్థిక శాఖ ప్రణాళికలు రూపొందిస్తోంది.

ఇప్పటి వరకూ కేంద్ర పథకాను రాష్ట్రంలో సక్రమంగా అమలు చేయకపోవడంతో పాటు, వాటికి రాష్ట్ర వాటాగా కేటాయించాల్సిన నిధులు జత చేయకపోవడంతో పలు సందర్భాలో కేంద్ర నిధులు మంజూరు కావడం లేదు. ఇక నుండి అటువంటి నిర్లక్ష్యం జరగకుండా సకాలంలో కేంద్ర నిధులకు రాష్ట్ర మ్యాచింగ్ గ్రాంట్లు కలిపి కేంద్ర పథకాల నిధులు సకాలంలో విడుదలయ్యేలా చర్యలు తీసుకోనుంది.

ఇందుకు కేంద్రం సింగిల్ నోడల ఏజెన్సీ ద్వారా సిస్టమ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్విక్ ట్రాన్సఫర్ విధానాన్ని తీసుకొచ్చింది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ఆర్థిక శాఖలు, రిజర్వ్ బ్యాంక్‌కు చెందిన ఈ కుబేర్ వ్యవస్థలు కలిసి పనిచేయనున్నాయి. కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల పర్యవేక్షణ కోసం అకౌంట్ రెండరింగ్ యూనిట్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు.

# బిఆర్‌ఎస్ హయాంలో ప్రచారం ఫుల్.. ప్రజలకు ఒరిగింది శూన్యం

## ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రచారం ఫుల్, కానీ ప్రజలకు ఒరిగింది నిల్ అని ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ అధికారం పోయేనాటికి ఆరోగ్యశ్రీ బకాయిలు ఫుల్‌గా ఉన్నాయని, మీరు పెట్టిన మెడికల్ కాలేజీల్లో సౌకర్యాలు నిల్‌గా ఉన్నాయన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఫుల్‌గా ఉండగా, యూనివర్సిటీలు, విద్యాలయాల్లో ఫాకల్టీ నిల్‌గా ఉందన్నారు. రెండు దఫాల్లో తెచ్చిన అప్పులు ఫుల్, చేసిన అభివృద్ధి నిల్ అన్నారు. కాళేశ్వరం పేరిట దోపిడి ఫుల్, రైతులకు కోసం మీరు చేసింది నిల్ అన్నారు.

## జాతీయ గ్రాప్లింగ్ ఛాంపియన్‌షిప్ 2025లో

# నారాయణ విద్యార్థులకు 3 బంగారు పతకాలు

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** భారత రెజ్లింగ్ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్టాత్మక జాతీయ గ్రాప్లింగ్ (రెజ్లింగ్) ఛాంపియన్ షిప్ 2025లో నారాయణ విద్యార్థులు 3 బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయిలో సత్తాచాటారు.ఆయుష్ ఠాకూర్ , వైష్ణవి ఠాకూర్ అనే ఇద్దరు ప్రతిభావంతులైన నారాయణ విద్యార్థులు తమ నైపుణ్యం, కృషి, పట్టుదలతో జాతీయస్థాయిలో తమ విజయకేతనాన్ని ఎగురవేశారు.ఆయుష్ ఠాకూర్ యు11 విభాగంలో పోటీ పడి, రెండు బంగారు పతకాలు గెలుచుకున్నారు. ఒకటి జి ఐ విభాగంలో (కిమోనో వంటి ప్రత్యేక డ్రస్అదే శైలి) మరియు మరొకటి వ్నిటి విభాగంలో నేరుగా పట్టీలు, మార్పులతో జరిగే శైలి) వైష్ణవి ఠాకూర్, యు15 విభాగంలో బి। ఈవెంట్‌లోబంగారు పతకం సాధించారు. ఈ విజయాలు విద్యార్థుల పట్టుదలనే కాకుండా నారాయణ విద్యాసంస్థల సమగ్ర సహకారానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. చదువులో ఎటువంటి లోటు లేకుండా ఉండేందుకు, వారికి ప్రత్యేక తరగతులు, మార్గదర్శనం అందజేయడం ద్వారా నారాయణ తన బహు ముఖ ప్రతిభా అభివృద్ధికి కట్టుబడి ఉందని మరోసారి నిరూపిం చింది. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డా పి. సింధూర నారాయణ మాట్లా డుతూ "పట్టుదల, సరైన మార్గదర్శకత్వం.. అవకాశాలు కలిసి వచ్చినప్పుడు యువ ప్రతిభావంతులు ఎలాంటి సవాళ్లనైనా ధైర్యంగా ఎదుర్కొనగలరన్నారు. వైష్ణవి, ఆయుష్ విజయాలు మనకు వాటినే గుర్తు చేస్తున్నాయని వారి విజయం సహ విద్యార్థులకు ప్రేరణగా నిలిచే కాకుండా, నారాయణ నాలుగు దశాబ్దాలుగా పాటిస్తున్న విలువలు, శ్రేష్టతకు నిదర్శనంగా నిలుస్తోందన్నారు.నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ శరణి నారాయణ మాట్లాడుతూ ఆయుష్ ఠాకూర్, వ వైష్ణవి ఠాకూర్లకు ముందుగా అభినందనలు తెలిపారు. వారు సాధించిన ఘన విజయాలను గౌరవిస్తూ నారాయణ పాఠశాలలు



ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా వారి క్రీడాప్రతిభను ప్రోత్సహించడం, వారిని మరింత ప్రేరేపించడం, ఇతర విద్యార్థులను కూడా కలలు కనడానికి ఉత్సాహపరచడం నారాయణ విద్యాసంస్థల లక్ష్యమన్నారు. 46 ఏళ్ల విజయవంతమైన వారసత్వంతో, నారాయణ విద్యాసంస్థల విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతూ, ప్రతి విద్యార్థి క్రీడా కలలను, విద్యా లక్ష్యాలను నెరవేర్చడానికి అంకితభావంతో కొనసాగు తున్నాయి. ఎందుకంటే "మీ కలలే మా కలలు" అనేది నారాయణ నినాదమన్నారు.

# అధికారి వేధింపులతోనే ఉద్యోగిని ఆత్మహత్య

## పరిహారంగా రూ.90 కోట్లు చెల్లించాలని తీర్పు

**టోక్యో, సెప్టెంబరు 15:** కార్యాలయంలో పై అధికారి వేధింపులు తాళలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో జపాన్ న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. ఉద్యోగిని మృతికి కంపెనీ, దాని ప్రెసిడెంటే బాధ్యులని తేల్చిచెప్పింది. బాధితురాలి కుటుంబానికి 150 మిలియన్ యెన్లు భారత కరెన్సీలో సుమారు రూ.90 కోట్లు పరిహారంగా చెల్లించాలని ఆదేశించింది. జపాన్‌లోని ప్రముఖ కాస్మోటిక్స్ సంస్థ డియూపీ కార్పొరేషన్‌లో సటోమి (25) అనే యువతి 2021 ఏప్రిల్‌లో ఉద్యోగంలో చేరారు. అదే ఏడాది డిసెంబర్‌లో జరిగిన ఒక మీటింగ్‌లో, ఆమె ముందస్తు అనుమతి లేకుండా క్లయింట్లను కలిశారని కంపెనీ ప్రెసిడెంట్ మిత్సురు సకై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరి ముందే ఆమెను వీధికుక్క అంటూ అవమానకరమైన పదజాలంతో దూషించారు. మరుసటి రోజు కూడా అదే తరహాలో వేధించడంతో సటోమి తీవ్ర మానసిక క్షోభకు గురయ్యారు. ఈ ఘటన తర్వాత ఆమె డిప్రెషన్‌లోకి వెళ్లిపోయారు. చికిత్స కోసం సెలవు తీసుకున్నప్పటికీ ఆమె పరిస్థితి మెరుగుపడలేదు. చివరకు 2022 ఆగస్టులో ఆత్మహత్యాయత్నం చేయగా, కోమాలోకి వెళ్లారు. సుదీర్ఘ కాలం మృత్యువుతో పోరాడి 2023 అక్టోబర్‌లో ప్రాణాలు విడిచారు. తమ కుమార్తె మృతికి కారణమైన కంపెనీపై, ప్రెసిడెంట్‌పై ఆమె తల్లిదండ్రులు న్యాయపోరాటం ప్రారంభించారు. ఈ కేసుపై విచారణ జరిపిన టోక్యో జిల్లా కోర్టు, సటోమి మానసిక ఆరోగ్యం దెబ్బతినడానికి, ఆమె ఆత్మహత్యకు ప్రెసిడెంట్ మిత్సురు సకై వ్యాఖ్యలే కారణమని నిర్ధారించింది.

# వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీం మధ్యంతర ఉత్తర్వులు వార్షణీయం

## మాజీమంత్రి కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 15:** వక్ఫ్ సవరణ చట్టం 2025పై సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్వాగతించారు. ఈ చట్టంలోని వివాదాస్పద నిబంధనలపై బిఆర్ఎస్ మొదటి నుంచి తన ఆందోళనలను గట్టిగా వినిపించిందని ఆయన పేర్కొన్నారు.ఈ చట్టం ప్రగతిశీలత ముసుగులో దేశంలో విభజన రాజకీయాలకు, మత సామరస్యానికి విఘాతం కలిగించడానికి ప్రయత్నిస్తోందని తాము ఎప్పుడూ చెబుతూనే ఉన్నామని అన్నారు. వక్ఫ్ సవరణ చట్టంలోని సమస్యలపైన తాము పోరాడామని తెలిపారు. ఒక వ్యక్తి ముస్లిం అని ఎవరు నిర్ణయిస్తారు.. ప్రభుత్వ అధికారి ఏకపక్షంగా వక్ఫ్ ఆస్తుల యాజమాన్యాన్ని ఎలా నిర్ణయిస్తారు, ఇలాంటి అనేక సమస్యలు ఈ చట్టంలో ఉన్నాయి,ఇవి విభజన రాజకీయాలకు ఆజ్యం పోయగలవు అని వ్యాఖ్యానించారు. బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ దేశంలోని మత సామరస్య వాతావరణాన్ని పరిరక్షించడానికి కృషి చేస్తోందని కెటిఆర్ స్పష్టం చేశారు. రాజకీయాల కన్నా దేశ ఐక్యత ముఖ్యమని తాము విశ్వసిస్తామని తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా రాజ్యసభలో తమ పార్టీ సభ్యులు పూర్తి శక్తితో పోరాడారని, భవిష్యత్తులో కూడా అవసరమైనప్పుడు దేశ సమగ్రత కోసం పోరాడుతూనే ఉంటామని తెలిపారు. బిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ మైనార్టీల సంక్షేమంలో గొప్ప పురోగతి సాధించిందని గుర్తు చేశారు.



కొడంగల్‌లో సిఎం ఇంటి ముందు ధర్నాలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

# సిఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి అంగన్‌వాడీల యత్నం

## మహాధర్నా.. పోలీసులతో వాగ్వాదం, అరెస్టు

**కొడంగల్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలోని సిఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి అంగన్‌వాడీలు ప్రయత్నించారు. ప్రీ ప్రైమరీ వ్యవస్థను రద్దు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సిఎం రేవంత్ రెడ్డి ఇంటి ముందు భైఠాయించి మహాధర్నా చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న ప్రీప్రైమరీ వ్యవస్థతో తమ ఉద్యోగాలతోపాటు తమ కుటుంబాలు రోడ్డున పడతాయని వికారాబాద్ జిల్లావ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసం ముందు ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతి రేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లా డుతూ ప్రీప్రైమరీ పీఎంశ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాలకు అప్పగించాలన్నారు. విద్యాబోధన బాధ్యతను అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు ఇవ్వాలన్నారు. అలాగే విద్యావాలంటీర్లకు నిర్ణయించిన వేతనాన్ని అదనంగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఒకవేళ ఈ ప్రీప్రైమరీ వ్యవస్థను తీసుకు రావాలి అనుకుంటే అది తమ అంగన్‌వాడీ కార్యకర్తలకే కేటాయించాలని తెలిపారు. గతంలో నెలకు రూ.18వేల వేతనాన్ని అందిస్తామని తెలిపిన ప్రభుత్వాలు ప్రస్తుతం తమకు కేవలం రూ.11,500 జీతంతోనే సరిపెడుతున్నారని, ఇప్పుడు మరోసారి ప్రీప్రైమరీ వ్యవస్థ ద్వారా తమకు అన్యాయం చేయాలని చూస్తున్నారని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ప్రీప్రైమరీ వ్యవస్థను తమకే కేటా యించాలని లేదా రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా నేపథ్యంలో పోలీసులకు అంగన్‌వాడీ కార్యకర్తలకు వాగ్వివాదాం చోటు చేసుకోవడంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్తత నెలకొనడంతోపాటు పలువురు అంగన్ వాడీ కార్యకర్తలు సొమ్మసిల్లి పడిపోయారు. కాగా అంగన్‌వాడీ టీచర్ల ధర్నాకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బుస్స చంద్రయ్య మద్దతు తెలిపారు.

# భద్రతా కార్యకలాపాల్లో రైల్వే బోర్డు మార్గదర్శకాలు పాటించాల్సిందే

## భద్రతపై సమీక్ష నిర్వహించిన జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ


**హైదరాబాద్ (తార్నాక), సెప్టెంబరు 15, ప్రభాతవార్త :** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సోమవారం సికిందరాబాద్‌లోని రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, ప్రధాన విభాగాధిపతులతో కలిసి జోన్ వ్యాప్తంగా రైలు కార్యకలాపాల భద్రతపై వివరణాత్మక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల మొత్తం ఆరు డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు (డి.ఆర్.ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ప్రయాణీకుల, శాఖాపరమైన భద్రతను నిర్ధారించడానికి భద్రతా విధానాలు, భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించడం ప్రాముఖ్యత గురించి వివరించారు. ఏదైనా భద్రతా కార్యకలాపాలు చేపట్టేటప్పుడు రైల్వే బోర్డు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన అధికారులను ఆదేశించారు. లెవల్ క్రాసింగ్‌లు, గేట్ల వద్ద అనధికార వాహనాల కదలికపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్టేషన్లలో బ్యాటరీ ఆపరేటెడ్ కార్ల (బి.ఓ.సిలు) నిర్వహణ, క్యాంపింగ్ కోచ్‌లను సరిగ్గా స్థిరపరచడం మరియు రిలే గదులలో పూర్తి ఇంటర్‌లాకింగ్ ప్లాన్‌ల నిర్వహణ కోసం భద్రతా సూచనలను పాటించాల్సిన అవసరాలపై ఆయన దృష్టి సారించారు. జనరల్ మేనేజర్ జోన్ వ్యాప్తంగా కొనసాగుతున్న భద్రతా కార్యక్రమాలను సమీక్షిస్తూ, ఇంజనీరింగ్, సిగ్నల్, టెలికమ్యూనికేషన్స్, మెకానికల్,ఎలక్ట్రికల్ వంటి వివిధ విభాగాలు చేపట్టిన చొరవలను పరిశీలించారు. పశువుల రన్ ఓవర్ కేసులను పర్యవేక్షించడం, ప్రైవేట్ సైడింగ్‌లలో సి.సి.టి.వి ఏర్పాటు,సరుకు రవాణా రైలు కార్యకలాపాలలో భద్రతా చర్యలు వంటి ముఖ్యమైన రంగాలను ఆయన పరిశీలించారు. తనిఖీల సమయంలో గుర్తించిన ఏవైనా లోపాలను సజావుగా రైలు కార్యకలాపాలను నిర్వర్తించడానికి వెంటనే



అధికారులతో సమాక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ

సరిదిద్దాలని ఆయన నొక్కి చెప్పారు. సంజయ్ కుమార్ శ్రీవాస్తవ భద్రతా ప్రమాణాలను పెంపొందించడంపై వ్యూహాత్మక ప్రాధాన్యతనిచ్చారు. పర్యవేక్షకులు క్షేత్రస్థాయి కార్యకలాపాలను నిశితంగా పర్యవేక్షించాలని సూచించారు. సమస్యలను సకాలంలో పరిష్కారాన్ని నిర్ధారించాలని ఆదేశించారు. అదేవిధంగా భద్రతా కేటగిరీ సిబ్బందికి రిఫ్రెషర్ కోర్సులు, కుటుంబ కౌన్సెలింగ్ సెషన్ల ద్వారా శిక్షణ,సున్నితత్వాన్ని పెంపొందించడంతో జోన్ వ్యాప్తంగా భద్రతా సంస్కృతిని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఆట



## యుఎఇ రేసు అతికా కైవసం

**న్యూఢిల్లీ:** భారత రేసింగ్‌లో 10 ఏళ్ల ప్రాడిజీ అతికా మీర్ యుఎఇ కార్టింగ్‌లో మినీమాక్స్ విభాగంలో రేసును గెలుచుకున్న మొదటి మహిళగా చరిత్ర సృష్టించింది. అనుభవజ్ఞులైన యూరోపియన్ రేస్ విజేతలతో సహా 14 మంది డ్రైవర్లతో కూడిన ఈ పోటీలో అతికా ఒంటరి మహిళ. అయినా పట్టుదలతో సోమవారం దుబాయ్ కార్ట్‌డ్రోమ్‌లో జరిగిన ప్రతిష్టాత్మక డిఎఎమ్‌సి ఛాంపియన్‌షిప్ ఓపెనర్‌లో పోల్ పొజిషన్ నుండి కమాండింగ్ విజయాన్ని పూర్తి చేసింది. ఫైనల్స్‌లో, అతికా తన స్థానాన్ని నిలబెట్టుకునే ప్రయత్నంలో సఫలమై ట్రాక్ పరిమితుల్లో అందరికంటే ముందుగా నిర్ధారించిన లక్ష్యాన్ని అధిగమించింది. ఈ విజయం ఆమె పోల్ తీసుకున్న మొట్టమొదటి మహిళగా మరియు మినీమాక్స్ విభాగంలో తుది విజయాన్ని సాధించింది. ఇది ఆమె మిడిల్ ఈస్టర్న్ కార్టింగ్ లెగ్‌కు పరిపూర్ణ ప్రారంభాన్ని సూచిస్తుంది. ఆమె అరుదైన ప్రతిభను గుర్తించి, ఫార్ములా 1 ఈ సంవత్సరం ప్రారంభంలో తన ఎఫ్1 అకాడమీ డివైడి ప్రోగ్రామ్ కోసం ఆమెను ఒప్పందం కుదుర్చుకుంది. ఇలా ఒక భారతీయ మహిళా డ్రైవర్‌కు ఇదే మొదటి అవకాశం.

## ఫిడే గ్రాండ్ స్విస్..
# ఆధిక్యంలో వైశాలి
### అమెరికా చేతిలో ప్రజ్ఞానంద ఓటమి

**న్యూఢిల్లీ:** ఫిడే గ్రాండ్ స్విస్ 2025, మహిళల విభాగంలో వైశాలి తిరిగి ఉమ్మడి ఆధిక్యంలోకి వచ్చింది. అలాగే రౌండ్ 10లో ప్రజ్ఞానంద అవకాశాలు దెబ్బతిన్నాయి. ఉజ్బెకిస్తాన్‌లోని సమర్‌కండ్‌లో జరిగిన గ్రాండ్ స్విస్ మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్ వైశాలి మాజీ ప్రపంచ ఛాంపియన్ ఉక్రెయిన్‌కు చెందిన మరియా ముజిచుక్‌ను ఓడించి ఉమ్మడి ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.



డిఫెండింగ్ ఛాంపియన్ సిసిలియన్ డిఫెన్స్‌తో తలపడింది. వైశాలి 42 ఎత్తుగడలలో గెలిచి, ఉక్రెయిన్‌కు చెందిన ఓవర్‌నైట్ లీడర్ కాటెరినా లాగ్నోతో కలిసి 10 పాయింట్లలో 7.5 పాయింట్లతో ఆధిక్యంలో నిలిచింది. ఈ ఇద్దరు అగ్రగాముల తర్వాత ఇప్పుడు మాజీ మహిళా ప్రపంచ ఛాంపియన్‌లు చైనాకు చెందిన జోంగి టాన్ మరియు యుక్సిన్ సాంగ్ మరియు కజకిస్తాన్‌కు చెందిన బిబిసారా అస్సాబయేవా ఏడు పాయింట్లతో ఉన్నారు.



ఇక ఓపెన్ విభాగంలో ఎరిగైసి అర్జున్ చైనాకు చెందిన యు యాంగీతో డ్రాగా ఆడగా, మాజీ జాయింట్ లీడర్ నిహాల్ సరిన్ కూడా ఉజ్బెకిస్తాన్‌కు చెందిన నోడిర్‌బెక్ అబ్దుసత్తోరోవ్‌ను మాత్రమే ఓడించగలిగాడు, దీంతో క్యాండిడేట్స్‌లో బెర్త్ కోసం భారత సవాలు దాదాపుగా ఆవిరైపోయింది. కాగా ఈ టోర్నమెంట్ నుండి క్యాండిడేట్స్‌లో చోటు దక్కించుకోవాలనే ఆర్ ప్రజ్ఞానంద లక్ష్యం అమెరికాకు చెందిన హాన్స్ మోక్ నీమాన్ చేతిలో ఓడిపోవడంతో ముగిసింది.

# సూపర్ 4కి భారత్

**న్యూఢిల్లీ:** భారత జట్టు చేతిలో ఓడిపోయినప్పటికీ, పాకిస్తాన్ జట్టు గ్రూప్ ఏ పట్టికలో రెండవ స్థానంలో ఉంది. కానీ, ఈ ఓటమి ప్రభావం ఆ జట్టు నెట్ రన్ రేట్‌పై స్పష్టంగా కనిపిస్తుంది. ఆసియా కప్ 2025 పాయింట్ల పట్టికలో పాకిస్తాన్ ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లు ఆడింది. ఇందులో ఒక మ్యాచ్‌లో గెలిచింది. మెన్ ఇన్ గ్రీన్ ఒక మ్యాచ్‌లో ఓటమిని ఎదుర్కొంది. ఆరో మ్యాచ్‌లో, టీమిండియా పాకిస్థాన్‌ను 7 వికెట్ల తేడాతో ఓడించి, ఆసియా కప్‌లో తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంది. ఈ విజయంతో, గ్రూప్ ఏ పాయింట్ల పట్టికలో టీమిండియా బలమైన స్థానానికి చేరుకుంది. పాకిస్థాన్‌ను ఓడించడం ద్వారా టీమిండియా ఇప్పటికే సూపర్ ఫోర్ లో తన స్థానాన్ని నిర్ధారించుకుంది. అంతకుముందు, ఈ నెల 10న యూఏఈపై





## రన్ రేట్ మారిన పరిణామాలు
## ఆసియా కప్ నుంచి పాక్ ఔట్?

టీమిండియా అద్భుతమైన విజయాన్ని సాధించింది. పాకిస్థాన్‌పై ఇది వారి రెండవ విజయం. దీంతో రెండు మ్యాచ్‌ల్లో రెండు విజయాలతో మొదటి స్థానంలో నిలిచిన భారత జట్టు నెట్ రన్ రేట్ విషయంలోనూ (+4.793) దూకుడుగా ఉంది. ఇప్పుడు టీమిండియా తదుపరి మ్యాచ్ సెప్టెంబర్ 19న ఒమన్‌తో జరుగుతుంది. ఇది కేవలం లాంఛనప్రాయ మ్యాచ్ మాత్రమే. కానీ, సూపర్ ఫోర్ కి వెళ్లే ముందు, భారత జట్టు ఇక్కడ కూడా తన బలాన్ని చూపించాలనుకుంటుంది. ఇక భారత జట్టు చేతిలో ఓడిపోయినప్పటికీ, పాకిస్తాన్ జట్టు గ్రూప్ ఏ పట్టికలో రెండవ స్థానంలో ఉంది. కానీ, ఈ ఓటమి ప్రభావం ఆ జట్టు నెట్ రన్ రేట్‌పై స్పష్టంగా కనిపిస్తుంది. ఆసియా కప్ 2025 పాయింట్ల పట్టికలో పాకిస్తాన్ ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లు ఆడింది. ఇందులో ఒక మ్యాచ్‌లో గెలిచింది. మెన్ ఇన్ గ్రీన్ ఒక మ్యాచ్‌లో ఓటమిని ఎదుర్కొంది. ఇప్పుడు పాకిస్తాన్ తదుపరి మ్యాచ్ సెప్టెంబర్ 17న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో జరుగుతుంది. పాకిస్తాన్ సూపర్ ఫోర్‌కు చేరుకోవాలంటే, కచ్చితంగా గెలవాల్సిందే. అదే సమయంలో, పాకిస్తాన్ ముందున్న ఇబ్బందులు మరింత కఠినంగా మారాయి. ఆసియా కప్ 2025 గ్రూప్ బీని పరిశీలిస్తే, ఇక్కడ ఆఫ్ఘనిస్తాన్ జట్టు ఆధిపత్యం కనిపిస్తుంది. ఇప్పటివరకు ఒక మ్యాచ్





ఆడిన ఆఫ్ఘనిస్తాన్ నెట్ రన్ రేట్ ప్లస్ 4.700 ఉండగా, శ్రీలంక ఒక మ్యాచ్‌లో ఒక విజయంతో రెండవ స్థానంలో ఉంది. ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లు ఆడిన బంగ్లాదేశ్ ఒక మ్యాచ్ గెలిచి ఒక మ్యాచ్‌లో ఓడిపోయింది. గ్రూప్ బి పట్టికలో ఇది మూడవ స్థానంలో కొనసాగుతోంది. హాంకాంగ్ రెండు ఓటములతో నాల్గవ స్థానంలో పట్టికలో దిగువన ఉంది.






## స్కేటింగ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో..
# ఆనంద్‌కుమార్‌కు కాంస్యం

**న్యూఢిల్లీ:** స్కేటింగ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్-2025లో ఆనంద్‌కుమార్ వెల్‌కుమార్ చారిత్రాత్మక కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. స్పీడ్ స్కేటింగ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో 500 మీటర్ల+డి స్ప్రింట్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకోవడం ద్వారా ఆనంద్‌కుమార్ వెల్‌కుమార్ భారత క్రీడా చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడు. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో దేశంలో మొట్టమొదటి సీనియర్ పతక విజేతగా నిలిచాడు. చైనాలోని చెంగ్డులో జరిగిన ప్రపంచ క్రీడల్లో ఇన్‌లైన్ స్పీడ్ స్కేటింగ్ ట్రాక్ 1000 మీటర్ల స్ప్రింట్‌లో వెల్‌కుమార్ కాంస్యం సాధించిన మరో మైలురాయి క్షణాన్ని నమోదు చేసిన కొన్ని వారాల తర్వాత ఈ ఘనత సాధించడం గమనార్హం. ఈ క్రీడల్లో ఆయన 1:22.482 సెకన్ల సమయంతో తొలి పతకాన్ని సాధించాడు. అంతర్జాతీయ స్కేటింగ్‌లో వెల్‌కుమార్ 2021లో, జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం గెలుచుకోవడం ద్వారా గుర్తింపు పొందాడు, ఒక నెల వ్యవధిలో రెండు చారిత్రాత్మక కాంస్య పతకాలు మరియు అంతర్జాతీయ ప్రదర్శనల బలమైన రికార్డుతో, వెల్‌కుమార్ విజయం ప్రపంచ స్పీడ్ స్కేటింగ్‌లో భారతదేశం యొక్క పెరుగుతున్న ఉనికిని హైలైట్ చేస్తుంది.









## వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్
# పరుల్, అంకిత పరాజయం

**న్యూఢిల్లీ:** ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025, మహిళల స్టీపుల్‌చేజ్‌లో పరుల్, అంకిత ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయారు. మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో 35 మంది అథ్లెట్లలో పరుల్ 20వ స్థానంలో నిలవగా, అంకిత చివరి స్థానంలో నిలిచింది. టోక్యోలో సోమవారం జరిగిన ఈ స్టీపుల్‌చేజ్‌లో భారత్‌కు చెందిన పరుల్ చౌదరి, అంకితా ధ్యాని పురోగతి సాధించడంలో విఫలమయ్యారు. హీట్ 2లో పోటీ పడుతున్న జాతీయ రికార్డు హోల్డర్ పారుల్ ఈ రేసులో 9:22.24 సెకన్ల సమయంతో మొత్తం మీద 20వ స్థానంలో నిలిచింది. అలాగే అంకితా ధ్యాని హీట్ 1లో 10:03.22 సెకన్లలో 11వ స్థానంలో నిలిచింది. అంకితా సమయం మొత్తం 35 మంది అథ్లెట్లలో అత్యంత వెనకబడి ఉండటంతో ఆమె తదుపరి రౌండ్‌కు చేరుకోలేకపోయింది. మునుపటి ఎడిషన్‌లో, పరుల్ ఫైనల్‌కు చేరుకోగా, అప్పటి జాతీయ రికార్డు సమయంతో మొత్తం మీద 11వ స్థానంలో నిలిచింది. ప్రతి మూడు హీట్స్ నుండి మొదటి ఐదుగురు రన్నర్లు ఫైనల్‌కు చేరుకున్నారు. ఉగాండాకు చెందిన పెరుత్ చెముటై 9:07.68 సెకన్లతో అగ్రస్థానంలో నిలిచింది. అమెరికాకు చెందిన ఏంజెలీనా నెపోలియన్ 9:18.03 సెకన్లతో పురోగతి సాధించిన చివరి రన్నర్‌గా నిలిచింది. ఇక ఫైనల్ ఈ నెల 17న జరుగనుంది.

# ఇకపై గడువు పొడిగింపులేదు
### పన్ను రిటర్నులు పూర్తిచేయాలి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 15:** ఆదాయపు పన్ను రిటర్నులు (ఐటీఆర్) 2024-25కుగాను దాఖలు చేసేందుకు గడువు సోమవారంతో ముగిసిందని ఆదాయపు పన్ను శాఖ స్పష్టం చేసింది. గడువు పొడిగించారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని పేర్కొంది. ఐటీఆర్ గడువు సెప్టెంబర్ 30 వరకు పెంచారు అంటూ కొంతమంది సోషల్ మీడియా వేదికలపై ప్రచారం చేస్తుండగా, ఆదాయపు పన్ను శాఖ తన అధికారిక 'ఎక్స్' ఖాతా ద్వారా ఈ విషయాన్ని ఖండించింది. జులై 31 చివరి తేదీగా ఉన్న గడువును ఇప్పటికే సెప్టెంబర్ 15 వరకు పొడిగించాం. ఇప్పుడు మరోసారి పొడిగించినట్టు వస్తున్న ప్రచారం అబద్ధం. ఐటీఆర్ దాఖలుకు సెప్టెంబర్ 15నే చివరి తేదీ. 24న7 హెల్ప్‌డెస్క్ సపోర్ట్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు.





పన్ను చెల్లింపుదారులకు సహాయంగా కాల్స్, లైవ్ చాట్స్, వెబ్ సెషన్స్ వంటి సేవలతో రౌండ్ ది క్లాక్ హెల్ప్‌డెస్క్‌ను అందుబాటులో ఉంచినట్లు ఐటీ శాఖ వెల్లడించింది. ఐటీఆర్ దాఖలుపై సందేహాల నివృత్తికి ఇది ఉపయోగపడనుంది. దాదాపు 6 కోట్లకు పైగా పన్ను చెల్లింపుదారులు ఇప్పటికే ఐటీఆర్‌ను దాఖలు చేశారని ఐటీ విభాగం పేర్కొంది. వీటిలో 5.51 కోట్ల రిటర్నులు ఈవెరిఫై అయ్యాయని, ఇందులో 3.78 కోట్ల రిటర్నుల పరిశీలన పూర్తయిందని వెల్లడించింది. ఆదాయపు పన్ను శాఖ మరో ముఖ్య హెచ్చరికను చేసింది. తప్పుడు సమాచారం లేదా మోసపూరిత మినహాయింపులు చూపించి రిఫండ్ తీసుకునే ప్రయత్నాలు నేరంగా పరిగణించబడతాయని, దీనివల్ల శిక్ష, జరిమానాలు మరియు పన్ను నోటీసులు వచ్చే ప్రమాదం ఉందని స్పష్టం చేసింది. రూ. 3 లక్షలకు పైగా ఆదాయం ఉన్న ప్రతి ఒక్కరూ ఐటీఆర్ ఫైలింగ్ తప్పనిసరిగా చేయాలని సూచించింది. కొత్త, పాత పన్ను విధానాల్లో ఏది మీకు అనుకూలమో చూసుకుని ఫైల్ చేయాలని తెలిపింది.

## వాణిజ్యం





## రూ.10లక్షల యుపిఐ పరిమితులు
# నేటినుంచే అమల్లోకి!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 15:** యూపీఐ ద్వారా పెద్ద మొత్తంలో చెల్లింపులు చేసేవారికి శుభవార్త. తరచూ లావాదేవీల పరిమితి సమస్యను ఎదుర్కొనే వారికి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఊరట కల్పించింది. ఎంపిక చేసిన కొన్ని కీలక రంగాల్లో రోజువారీ లావాదేవీల పరిమితిని ఏకంగా రూ.10 లక్షల వరకు పెంచిన నిర్ణయాలు సోమవారంనుంచే అమలులోకి వచ్చాయి. గతంలో పెద్ద మొత్తంలో బీమా ప్రీమియంలు, పెట్టుబడులు, లేదా ఇతర ఖర్చులు చెల్లించాలంటే లావాదేవీలను విభజించాల్సి రావడం లేదా చెక్కులు, బ్యాంకు బదిలీల వంటి పాత పద్ధతులను ఆశ్రయించాల్సి వచ్చేది. ఈ ఇబ్బందులను తొలగించి, అధిక విలువైన లావాదేవీలను డిజిటల్ బాట పట్టించేందుకే ఈ మార్పులు చేసినట్లు ఎన్‌పీసీఐ స్పష్టం చేసింది. అయితే, ఈ పెంచిన పరిమితులు కేవలం వ్యక్తుల నుంచి వ్యాపారులకు (పి2బి) చేసే చెల్లింపులకు మాత్రమే వర్తిస్తాయి. తాజా మార్పుల ప్రకారం, క్యాపిటల్ మార్కెట్లు, బీమా ప్రీమియంల చెల్లింపుల కోసం ఒక్కో లావాదేవీ పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచారు. ఈ విభాగాల్లో ఒక రోజులో గరిష్టంగా రూ.10 లక్షల వరకు చెల్లించవచ్చు. అలాగే, రుణ వాయిదాలు (ఈఎంఐ), ప్రయాణ బుకింగ్‌లు, ప్రభుత్వ ఈమార్కెట్‌ప్లేస్ లావాదేవీల కోసం కూడా ఒక్కో లావాదేవీ పరిమితిని రూ.5 లక్షలకు పెంచారు. క్రెడిట్ కార్డు బిల్లుల చెల్లింపులకు ఒక్కో లావాదేవీకి రూ.5 లక్షల వరకు అవకాశం కల్పించగా, రోజువారీ పరిమితిని రూ.6 లక్షలుగా నిర్ణయించారు. నగల కొనుగోళ్లకు లావాదేవీ పరిమితిని రూ.2 లక్షలకు, రోజువారీ పరిమితిని రూ.6 లక్షలకు పెంచడం ద్వారా వినియోగదారులకు కొంత వెసులుబాటు కల్పించారు. అయితే, వ్యక్తుల మధ్య (పి2పి) రోజువారీ లావాదేవీల పరిమితిలో ఎలాంటి మార్పు చేయలేదని, అది యథాతథంగా రూ.1 లక్షగానే కొనసాగుతుందని ఎన్‌పీసీఐ స్పష్టం చేసింది. ఈ పెంచిన పరిమితులు కేవలం ధృవీకరించబడిన వ్యాపారులకు (వెరిఫైడ్ మర్చంట్స్) చేసే చెల్లింపులకు మాత్రమే వర్తిస్తాయని, ఇది లావాదేవీల భద్రతను మరింత పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ నిర్ణయాన్ని ఫిన్‌టెక్ సంస్థలు, పారిశ్రామిక వర్గాలు స్వాగతించాయి.

# సూచీలకు ఫెడ్ రిజర్వు భయాలు
### సెన్సెక్స్ నిఫ్టీ లాభాల జోరుకు బ్రేక్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 15:** దేశీయ స్టాక్ మార్కెట్లలో ఎనిమిది రోజులుగా కొనసాగుతున్న లాభాల పరంపరకు సోమవారం బ్రేక్ పడింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ పాలసీ సమావేశం జరగనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించడంతో సూచీలు స్వల్ప నష్టాలతో ఫ్లాట్‌గా ముగిశాయి. జీఎస్టీ సంస్కరణల కారణంగా దేశీయంగా వినియోగం బలంగా ఉండటంతో మార్కెట్లు పెద్దగా పడిపోకుండా నిలదొక్కుకున్నాయి. సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 118.96 పాయింట్లు నష్టపోయి 81,785.74 వద్ద స్థిరపడింది. ఉదయం 81,925.51 వద్ద దాదాపు ఫ్లాట్‌గా ప్రారంభమైన ఈ సూచీ, రోజంతా 81,744.70 నుంచి 81,998.51 మధ్య పరిమిత శ్రేణిలో కదలాడింది. మరోవైపు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 44.80 పాయింట్ల నష్టంతో 25,069.20 వద్ద ముగిసింది. యూఎస్ ఫెడ్ సమావేశం నేపథ్యంలో ట్రేడర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. గత వారం భారీగా పెరిగిన ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ కనిపించింది. ఫెడ్ 25 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ రేట్లను తగ్గిస్తుందని మార్కెట్లు ఇప్పటికే అంచనా వేశాయి. అయితే, భవిష్యత్ వడ్డీ రేట్ల తీరుపై ఫెడ్ ఎలాంటి సంకేతాలు ఇస్తుందోనని ఇన్వెస్టర్లు ఎదురుచూస్తున్నారని మార్కెట్ విశ్లేషకులు తెలిపారు. దేశీయంగా బలమైన వినియోగం, వాణిజ్య ఒప్పందాలపై





కొత్త ఆశలు, 2026 ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో కంపెనీల ఆదాయాలు మెరుగుపడతాయన్న అంచనాలు మార్కెట్ సెంటిమెంట్‌కు మద్దతుగా నిలుస్తున్నాయని వారు వివరించారు. సెన్సెక్స్ స్టాక్స్‌లో ఏషియన్ పెయింట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్, ఇన్ఫోసిస్, సన్ ఫార్మా, టీసీఎస్, టెక్ మహీంద్రా నష్టపోయాయి. మరోవైపు, బజాజ్ ఫైనాన్స్, ఎటర్నల్, ఎల్‌అండ్‌టీ, అదానీ పోర్ట్స్ లాభాల్లో ముగిశాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ, ఎఫ్ఎంసీజీ, ఆటో సూచీలు నష్టాల్లో ముగిశాయి. అయితే, నిఫ్టీ బ్యాంక్, నిఫ్టీ ఫిన్ సర్వీసెస్ స్వల్ప లాభాలను నమోదు చేశాయి. ప్రధాన సూచీలు ఫ్లాట్‌గా ఉన్నప్పటికీ, బ్రాడర్ మార్కెట్లలో కొనుగోళ్ల జోరు కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.44శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.76శాతం మేర లాభపడ్డాయి. మార్కెట్లలో కొంత లాభాల స్వీకరణ సాధారణమేనని, నిఫ్టీ 25,150 స్థాయిని దాటితే 25,300 వరకు వెళ్లే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతానికి మార్కెట్ పడిపోయినప్పుడు కొనుగోలు చేయడం మంచి వ్యూహమని వారు సూచిస్తున్నారు.

## హోంలోన్ కస్టమర్లకు
# ఎస్బీఐ ఊరట

**ముంబయి, సెప్టెంబరు 15:** దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తమ ఖాతాదారులకు ఊరటనిచ్చే ప్రకటన చేసింది. సెప్టెంబర్ నెలకు సంబంధించి కీలక రుణ వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు వెల్లడించింది. ఈ నిర్ణయం సోమవారం నుంచే అమల్లోకి వచ్చినట్లు ఓ సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. వడ్డీ రేట్లలో మార్పు లేకపోవడంతో, ఇప్పటికే రుణాలు తీసుకున్న వారిపై అదనపు ఈఎంఐ భారం పడదు. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లను (ఎంసీఎల్ఆర్) స్థిరంగా ఉంచారు. దీని ప్రకారం, ఓవర్‌నైట్, ఒక నెల ఎంసీఎల్ఆర్ 7.90 శాతంగా ఉంది. మూడు నెలల కాలపరిమితికి 8.30 శాతం, ఆరు నెలలకు 8.65 శాతం వడ్డీ రేటు కొనసాగుతుంది. చాలా వరకు వినియోగదారుల రుణాలు ఆధారపడి ఉండే ఏడాది ఎంసీఎల్ఆర్ 8.75 శాతంగా ఉంది. ఇక రెండు, మూడు సంవత్సరాల ఎంసీఎల్ఆర్ వరుసగా 8.8 శాతం, 8.85 శాతంగా కొనసాగుతున్నట్లు బ్యాంక్ స్పష్టం చేసింది. ఈ రేట్ల మార్పు అనేది ఇప్పటికే ఫ్లోటింగ్ రేటుపై రుణాలు తీసుకున్న వారిపై ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం హోమ్ లోన్ వడ్డీ రేట్లు కనీసం 7.50 శాతం నుంచి గరిష్ఠంగా 8.70 శాతం మధ్య ఉన్నాయి. అయితే, కస్టమర్ల సిబిల్ స్కోర్‌ను బట్టి ఈ వడ్డీ రేట్లలో మార్పులు ఉంటాయని గమనించాలి. అదేవిధంగా, టాప్‌అప్ హోమ్ లోన్‌పై 8 శాతం నుంచి 10.75 శాతం వరకు వడ్డీ వర్తిస్తుందని బ్యాంక్ పేర్కొంది.





# మార్కెట్ ధరకంటే ఎక్కువకు ఇన్ఫీ బైబాక్!

**ముంబయి, సెప్టెంబరు 15:** ఇన్ఫోసిస్ కంపెనీ షేర్ల బైబ్యాక్ ప్రణాళికలో భాగంగా ఒక్కో షేరుకు రూ.1800 చొప్పున కొనుగోలు చేస్తామని తెలిపింది. ప్రస్తుతం ఉన్న ధర రూ.1524తో పోలిస్తే రూ.276 అదనంగా చెల్లిస్తామని తెలిపింది. ఇన్ఫోసిస్ ఐదో అతిపెద్ద షేర్ బైబ్యాక్‌గా చెప్పవచ్చు. దీంతో ఈ స్టాక్ ఫోకస్ లోకి వచ్చింది. ఈ షేర్లు కొనేందుకు ఇన్వెస్టర్లు మొగ్గు చూపుతున్నారు. అయితే, ఈ షేర్ల బైబ్యాక్ సంబంధించిన రికార్డ్ తేదీని కంపెనీ ఇప్పటి వరకు వెల్లడించలేదు. రికార్డ్ తేదీలోపు ఈ షేర్లు కొనుగోలు చేసిన వారికి మాత్రమే బైబ్యాక్‌లో పాల్గొని అదనపు లాభం పొందే అవకాశం ఉంటుంది. షేర్ల బైబ్యాక్ అంటే ఒక కంపెనీ తమ సొంత షేర్లను మార్కెట్ నుంచి తిరిగి కొనుగోలు చేస్తుంది. సాధారణంగా కంపెనీ వద్ద అదనపు నిధులు ఉన్నప్పుడో లేదా షేర్ విలువ తక్కువగా ఉన్నప్పుడో ఇలా బైబ్యాక్ చేసి కంపెనీ ప్రమోటర్ల వాటా పెంచుతారు. బైబ్యాక్ చేయడం వల్ల మార్కెట్లో షేర్ల సంఖ్య తగ్గిపోతుంది. దీంతో షేర్ విలువ పెరుగుతుంది. ఇన్ఫోసిస్ టెండర్ ఆఫర్ ద్వారా ఒక షేరుకు రూ.1800 పెట్టి బైబ్యాక్ చేస్తోంది. ఇది ప్రస్తుత మార్కెట్ ధర రూ.1524 కంటే 18 శాతం అధికం. 10 కోట్ల షేర్లను రూ.18000 కోట్లు పెట్టి తిరిగి కొనుగోలు చేస్తోంది. ఇది కంపెనీ ఈక్విటీ మూలధనంలో 2.41 శాతంగా ఉంటుంది. ఈ షేర్ల బైబ్యాక్‌లో ఎక్కువ మంది ఇన్వెస్టర్లు పాల్గొనే అవకాశాలు కనిపిస్తున్నాయని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో యాక్సెప్టెన్స్ రేషియో (అనుమతి నిష్పత్తి) తక్కువగా ఉండవచ్చంటున్నారు. అయితే, స్వల్ప కాలంలో ఇన్ఫోసిస్ షేరు రూ.1810కి చేరవచ్చనే అంచనాలూ ఉన్నాయి. అనుమతి నిష్పత్తి 620 శాతం వరకు ఉండవచ్చంటున్నారు. ఆఫర్ చేసిన షేర్లలో కొంత భాగమే తిరిగి కొనవచ్చని దీని అర్థం. ఈ బైబ్యాక్ ద్వారా విక్రయించిన షేర్లపై మూలధన లాభాల పన్ను వర్తిస్తుంది. పెట్టుబడిదారుల ఆదాయ స్లాబ్ ఆధారంగా ఇది ఉంటుంది.

# కొత్తపన్నులతో ప్రతిషాపులో బోర్డులు ఉండాలి
### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**చెన్నై, సెప్టెంబరు 15:** వినియోగదారులకు భారీ ఊరట కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 350కి పైగా వస్తువులపై జీఎస్టీని గణనీయంగా తగ్గించినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ తగ్గింపు ప్రయోజనాలు ప్రజలకు పూర్తిగా చేరేలా చూడటానికి, ఇకపై ప్రతి దుకాణంలోనూ కొత్త పన్ను రేట్ల వివరాలతో కూడిన బోర్డును తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆమె స్పష్టం చేశారు. చెన్నైలో జరిగిన 'వికసిత్ భారత్ దిశగా పన్నుల సంస్కరణలు' అనే సదస్సులో నిర్మలా సీతారామన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా తగ్గిన జీఎస్టీ రేట్లు ఈ నెల 22వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారని, దీనివల్ల అనేక వస్తువుల ధరలు దిగివస్తాయని అన్నారు. గతంలో ఉన్న నాలుగు (5%), 12%, 18%, 28%) పన్ను శ్లాబులను ఇప్పుడు రెండు కేటగిరీలకు (5%, 18%) సరళీకరించినట్లు ఆమె వివరించారు. ఈ సంస్కరణ ద్వారా దేశంలోని 140 కోట్ల మంది ప్రజలపై పన్ను భారం తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జీఎస్టీ తగ్గింపును క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాలని, దీనిపై ఇప్పటికే అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేశామని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.